Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

దినపత్రిక

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :04 సంచిక : 38 పేజీలు 8 వెల : 5 ఆదివారం 27 జూలై 2025

ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

అక్షరాన్నే ఆయుధంగా మలుచుకున్న పత్రిక

16th ANNIVERSARY

వార్షికోత్సవ ప్రత్యేక సంచిక

ప్రకటనదారులకు, పాఠకులకు మా నమస్సుమాంజలులు...

16వ వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేయుట గురించి పాఠకులారా !.. ఉత్తేజిత దినపత్రికను హృదయపూర్వకంగా అభిమానించినందుకు మేనేజ్‌మెంట్ మీకు అభినందనలు తెలియజేస్తుంది.

జన వాక్కులే వార్తలుగా మలుచుకొని నిజాన్ని ఇజంగా చేసుకొని నిరంతరం నూతన వరవడిలో పత్రికను మీ ముందుకు తెస్తున్నామన్నా విషయం మీకందరికీ తెలిసిందే.

పత్రిక నడవాలంటే ఆర్థిక మూలాలు ముఖ్యం. కావున మీరంతా వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేసి పత్రికాభివృద్ధికి మీ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందజేయవలసిందిగా ఆకాంక్షిస్తున్నాము ....

మీ... ఉత్తేజిత దినపత్రిక ఎడిటర్

ప్రకటనదారులకు విజ్ఞప్తి...

తారీఫ్

| మల్టీకలర్ | బ్లాక్ & వైట్ పేజి |
|---|---|
| బ్యాక్ కవర్ పేజి మల్టీకలర్ : 50,000/- | బ్యాక్ పేజి : 20,000/- |
| ఇన్నర్ మల్టీకలర్ పేజి : 20,000/- | ఇన్నర్ పేజి : 20,000/- |
| ఫ్రంట్ మల్టీకలర్ పేజి : 70,000/- | ఫ్రంట్ పేజి : 30,000/- |

గమనిక : సకాలంలో ప్రకటనల తాలుకా ఫోటోలు మరియు మెటీరియల్‌ను ఉత్తేజిత తెలుగు దినపత్రిక విలేకరులకు అందజేయవలసిందిగా కోరడమైనది.



## ఆరు నెలల్లో విజయవాడ డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం

అమరావతి: రాబోయే ఆరు నెలల్లో విజయవాడ డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని రాష్ట్ర మున్సిపల్ శాఖమంత్రి నారాయణ స్పష్టం చేశారు. విజయవాడలోని కాలువలను సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన పరిశీలించారు. గత తెదేపా ప్రభుత్వ హయాంలో రూ.500కోట్లతో ప్రారంభించిన పనులను వైకాపా ప్రభుత్వం అర్థాంతరంగా నిలిపివేసిందన్నారు. 55శాతం పనులు తెదేపా హయాంలోనే పూర్తి చేసినట్లు చెప్పారు. మిగతా పనులు ఆరు నెలల్లో పూర్తి చేసి నగర ప్రజలకు డ్రైనేజీ సమస్య నుంచి విముక్తి కల్పిస్తామన్నారు. ఆక్రమణలు తొలగించి పేదలకు వేరే చోట ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

## రైతు సమస్యలపై కూటమి నిర్లక్ష్యం



**పొగాకు పంటలకు పడిపోయిన ధరలు**

**ఎరువుల సరఫరాలో పూర్తి నిర్లక్ష్యం**

**రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి**

కర్నూలు: రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కార్మిక కర్షక భవన్లో పత్రికా విలేకరుల సమావేశం జరిగింది. సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రభాకర్ రెడ్డి, జిల్లాప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో గత రెండు సంవత్సరాల నుండి పొగాకు పంటను విస్తారంగా సాగు చేస్తున్నారు. గత సంవత్సరం బాగా రేటు- పలకడంతో రైతులు పొగాకు పంట వైపు మల్లారని చెప్పారు. అయితే ఈ సంవత్సరం అత్యధికంగా రైతులు పొగాకు పంట సాగు చేయడం వలన కంపెనీ వారు రేటు- పూర్తిగా దిగ్గోచారని ఇది చాలా అన్యాయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 18 వేల రూపాయలు గతంలో రేటు- ఉండగా ఈ సంవత్సరం 15000 ఇస్తామని అది కూడా ఇవ్వకుండా 5000, 4000 ,6000 మాత్రమే ఇచ్చారు. ఇప్పుడు చాలామంది రైతుల దగ్గర పూర్తిగా కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదని ప్రభుత్వం పై విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు మాటల్లో స్వర్గం చూపిస్తున్నారు తప్ప ఆచరణలో రైతులకు మేలు చేసింది లేదని ఆయన ధ్వజమెత్తారు. కర్నూలు జిల్లాలో ప్రధానంగా మూడు మండలాల్లో పంట విస్తారంగా వేశారు. అక్కడక్కడ కొన్ని మండలాల్లో వందల ఎకరాల్లో సాగు చేయడం జరిగినది .కంపెనీ వారు ప్రచారం చేయడం వల్ల పంట విస్తారంగా వేశారని వేసిన పంటను పూర్తిగా కొనుగోలు చేయక పోవడం దుర్మార్గమని ఇప్పటి-కై-నా మిగిలి ఉన్న పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు-చేసి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పంటలు లేక ధరలు లేక ఎరువులు పురుగుల మందులు అందక ఇబ్బందులకు గురవుతున్నారని వాటిని ప్రభుత్వం పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. యూరియా రైతులకు అవసరమైనంత అందించడంలో విఫలమైందని రైతులకు అవసరమైనటు- వంటి డి ఏ పి, యూరియా అందజేయాలని, అవసరంలేని ఎరువులు అంట కట్టకూడదని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రైతుల సమస్యపై సంఘటితమై రైతు వ్యతిరేక విధానాలపైన పోరాడాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి. రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో పండిన పొగాకుపంటను పూర్తిగా కొనుగోలు చేయాలని ఇప్పటికే అనేక రూపాలలో ఆందోళన చేసినప్పటికీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు- వ్యవహరిస్తుందని, కంపెనీలకు వత్తాసు పలుకుతుందని, ప్రైవేటు- వ్యక్తులను పంపించి 1000 2000 ఇవ్వాలని డిమాండ్ చేయడం ఎంతవరకు సమంజసం అని ఆయన అన్నారు.



## పోలవరం వద్ద ఉద్ధృతంగా ప్రవహిస్తున్న గోదావరి.. డ్రోన్ దృశ్యాలు

భారీ వర్షాలతోపాటు ఎగువ ప్రాంతాల నుంచి వరదనీరు చేరడంతో ఏలూరు జిల్లా పోలవరం వద్ద గోదావరి ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఈ వరద కారణంగా పోలవరం జలాశయం నీటిమట్టం భారీగా పెరుగుతోంది. దీంతో అధికారులు ప్రాజెక్ట్ రేడియల్ గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పోలవరం జలాశయానికి సంబంధించిన డ్రోన్ దృశ్యాలను మీరూ చూసేయండి

## 30న నిసార్ రాకెట్ ప్రయోగం

**అమెరికాతో సంయుక్తంగా తయారీ**

**క్రయోజనిక్ ఇంజన్ సాంకేతికతలో భారత్ విజయం**




**బెంగలూరు:** భారత్, అమెరికా కలిసి సంయుక్తంగా తయారు చేసిన 'ఎర్త్ ఇమేజింగ్ శాటిలైట్ అయిన సింథటిక్ ఎపర్చర్ రాడార్ శాటిలైట్ ప్రయోగానికి సిద్ధంగా ఉంది. ఇది ఒక సాంకేతిక అద్భుతం, గేమ్ ఛేంజర్‌గా మారుతుందని చెబుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలు నుంచి ప్రాణాలను కాపాడేందుకు ఈ శాటిలైట్ ఉపయోగపడుతుంది. 1.3 బిలియన్ డాలర్ల పైగా ఖర్చుతో భారత్, అమెరికాలు కలిసి ఈ శాటిలైట్‌ని రూపొందించాయి. భారత్ లోని శ్రీహరికోట లాంచింగ్ సెంటర్ నుంచి ఈ ఉపగ్రహ ప్రయోగం జరుగుతుంది. భారతీయ రాకెట్ ద్వారా నిసార్‌ని కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నారు. ఒకప్పుడు, 90లలో అమెరికన్లు ఈ రాకెట్ అభివృద్ధిని దెబ్బతీయాలని చూశారు, ఇప్పుడు అదే రాకెట్ ద్వారా నిసార్ అంతరిక్షంలోకి ప్రవేశపెట్టబడుతుంది. జూలై 30న ఈ రాకెట్ శ్రీహరికోట నుంచి లాంచ్ చేయబడుతుంది.

ఇస్రో చెబుతున్న దాని ప్రకారం.. నిసార్ ఉపగ్రహం 2392 కిలోల బరువు ఉంటుంది. 12 రోజుల వ్యవధిలో ఇది మొత్తం భూమిని అన్ని వాతావరణాలు, పగలు, రాత్రుల్ని స్కాన్ చేసి డేటా ఇస్తుంది. నిసార్ భూమి ఉపరితలంపై మార్పులను, మంచు పలకల కదలికలు, వృక్ష సంపద మార్పులు చేర్పులను గుర్తించగలదు. దీనిని జియోసింక్రోనస్ శాటిలైట్ లాంచ్ వెహికల్ మార్క్ 2 రాకెట్ ఉపయోగించి ప్రయోగిస్తారు. ఇది దేశీయంగా అభివృద్ధి చేసిన క్రయోజనిక్ ఇంజన్‌తో పనిచేసే రాకెట్. 90లలో ఈ సాంకేతికత భారత్‌కు రష్యా నుంచి అందకుండా అమెరికా అడ్డుకుంది. ఎక్కువ బరువు ఉండే, ఎర్త్ సింక్రోనస్ ఆర్బిట్‌లో ఉపగ్రహాలను ప్రవేశపెట్టడానికి భారీ రాకెట్లు- అవసరం అవుతాయి. ఇది క్రయోజనిక్ టెక్నాలజీ ఉపయోగించుకుంటుంది. భారత్ సొంతగా తన క్రయోజనిక్ టెక్నాలజీని అభివృద్ధి చేసుకునేందుకు 20 ఏళ్లు కష్టపడింది. అమెరికా తిరస్కరణలు భారత్‌ని మరింత సమర్థంగా పనిచేసేలా చేసింది.

## గోవా గవర్నర్‌గా అశోక్‌గజపతి ప్రమాణం

### హాజరైన లోకేశ్ పలువురు టిడిపి నేతలు



పనాజి: గోవా గవర్నర్‌గా పూసపాటి అశోక్ గజపతిరాజు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే ఉదయం 11.30 గంటలకు రాజ్‌భవన్ బంగ్లా దర్బార్ హాల్‌లో అశోక్ గజపతిరాజుతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎపి మంత్రులు నారా లోకేష్, సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్‌తో పాటు- పలువురు టిడిపి ఎంపీలు హాజరయ్యారు. ప్రమాణ స్వీకారం నేపథ్యంలో అశోక్ గజపతి రాజు తన కుటుంబ సభ్యులతో కలసి శుక్రవారం ఉదయమే గోవాకు చేరుకున్నారు. ఆయన వెంట కుమార్తె స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి, భార్య సునీలాగజపతి, ఇతర కుటుంబ సభ్యులు వెళ్లారు. అశోక్ గజపతిరాజు ప్రమాణ స్వీకారానికి జిల్లాలో ఉన్న అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు వందల సంఖ్యలో గోవాకు తరలి వెళ్లారు. గోవా గవర్నర్‌గా పూసపాటి అశోక్ గజపతిరాజు ప్రమాణ స్వీకారంలో పాల్గొనేందుఉ టిడిపి శ్రేణులు కూడా హాజరయ్యారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, మంత్రివర్గ సభ్యులు, ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఏపీ మంత్రులు నారా లోకేశ్, సంధ్యారాణి, తెలుగుదేశం ఎంపీలు, ఏపీ బీజేపీ అధ్యక్షుడు, నేతలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రమాణస్వీకారం అనంతరం అశోక్ గజపతిరాజును గోవా అధికారులు పరిచయం చేసుకున్నారు. ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ స్వయంగా పరిచయం చేశారు. అనంతరం మంత్రి నారా లోకేష్.. గజపతిరాజుకు బొకే ఇచ్చి.. శాలువా కప్పి సన్మానించారు.




## శ్రీవారిని దర్శించుకున్న హోంమంత్రి అనిత



తిరుమల: తిరుమల వేంకటేశ్వరుడిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. శనివారం ఉదయం విఐపి విరామ సమయంలో ఎపి హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత , సినీనటి నిరోషా, ఆస్ట్రేలియా కౌన్సిల్ జనరల్ శిలాయ్ జాకి, ప్రభుత్వ విప్ శ్రీధర్‌లు కుటు-ంబ సభ్యులతో కలసి స్వామివారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శన అనంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసి శ్రీవారి శేష వస్త్రంతో సత్కరించారు.

## విజయవాడ హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం

**అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న వాహనం**

**ఇద్దరు పోలీస్ అధికారుల మృత్యువాత**




హైదరాబాద్: యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం ఖైతాపూర్ వద్ద ఘోర ప్రమాదం జరిగింది. కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న పోలీసు అధికారుల కారు అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యింది. ఇందులో ఇద్దరు అధికారులు మృతి చెందారు. మృతులు ఇద్దరూ ఏపీకి చెందిన డీఎస్పీలు చక్రధర్‌రావు(57), శాంతారావు(54)గా గుర్తించారు. విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న స్కార్పియో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి.. రోడ్డు అవతలివైపు పడింది. అటుగా వస్తున్న లారీ.. స్కార్పియోను ఢీకొట్టడంతో వాహనం ముందు భాగం నుజ్జునుజ్జయింది. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వాహనంలో ఇరుక్కుపోయిన మృత దేహాలను బయటకు తీశారు. మృతులిద్దరూ ఇంటెలిజెన్స్ అండ్ సెక్యూరిటీ వింగ్‌లో పనిచేస్తున్నట్లు గుర్తించారు. ప్రమాదంలో ఏఎస్పీ కోకా రామ్ ప్రసాద్, డ్రైవర్ నర్సింగరావుకు తీవ్ర గాయాలయ్యాయి. నర్సింగరావును ఎల్బీనగర్ కామినేని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అదనపు ఎస్పీ రామ్‌ప్రసాద్‌కు పక్కటెముకలు, కాలు ఫ్రాక్చర్ అయింది.

నర్సింగరావు భుజం ఫ్రాక్చర్ అయిందని, ఇద్దరికీ ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. డ్రైవర్ పక్కన కూర్చుని సీట్ బెల్ట్ పెట్టుకోవడంతో

# రాష్ట్రానికి నష్టం జరుగుతుంటే 'తెలంగాణ జాగృతి' ఊరుకోదు




హైదరాబాద్: కాలానుగుణంగా తెలంగాణ జాగృతి తన పంథాను మార్చుకుందని జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించిన 'లీడర్' శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో కొత్త నాయకత్వాన్ని పెంపొందించాలనుకుంటున్నట్లు చెప్పారు.తెలంగాణ జాగృతి నుంచి గాంధీగిరీకి కొత్త భాష్యం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. మన సంప్రదాయాలు, కట్టుబాట్లపై అవగాహన కల్పించుకోవడమే లీడర్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో కొంపల్లి శ్రీ కన్వెన్షన్‌లో నిర్వహిస్తున్న లీడర్ శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ.. జాగృతి కార్యకర్తలకు మానవీయ, సామాజిక బాధ్యతలపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. అలాగే నాయకత్వ లక్షణాలు ఎలా ఉండాలో ఆమె వివరంగా తెలిపారు. ఎప్పుడూ కొత్తగా ఉంటేనే సంస్థలు బతుకుతాయి. తల్లి గర్భంలో నుంచి ఎవరూ నాయకత్వ లక్షణాలతో పుట్టరు. నేర్చుకుంటూ, మార్చుకుంటూ ముందు కెళ్లేవాడే నాయకుడవుతాడు తప్ప.. మూస పద్ధతిలో కొనసాగేవాడు నాయకుడు కాలేడని అన్నారు. సామాజిక స్పృహ కలిగిన రాష్ట్రాల్లో తెలంగాణ 11 స్థానంలో ఉందని ఓ సర్వేలో తేలింది. తోటివారి గోప్యతకు, మర్యాదకు భంగం వాటిల్లకుండా పదునైన విమర్శలు చేయడం నేర్చుకోండి. పక్కవాడిని తిడుతున్నారంటే కంటెంట్ లేనట్లు అర్థం. మహాత్మాగాంధీ ఎప్పుడూ ఎమ్మెల్యే గానో, ఎంపీగానో లేరు. కానీ, ఇప్పటికీ ఆయన్ని గుర్తు చేసుకుంటాం. సాంస్కృతిక నేపథ్యం లేకుండా ఏ జాతీ మనుగడ సాధించలేదు. సాంస్కృతిక నేపథ్యం లేని జాతి.. పునాది లేకుండా కట్టిన బిల్డింగ్ లాంటిది. తెలంగాణ జాతికి అద్భుతమైన నేపథ్యం ఉంది. దానిని పరిరక్షించేందుకే 'జాగృతి' పని చేస్తుంది. తెలంగాణ ఉద్యమ కాలంలో యాసను అవహేళన చేసిన ఓ వ్యక్తికి నంది అవార్డు ఇవ్వడాన్ని నిరసించిన ఒకే ఒక సంస్థ తెలంగాణ జాగృతి. నమ్మిన సిద్ధాంతం కోసం ఎంత పెద్ద వ్యక్తులైనా, ఎంత పెద్ద సమస్య అయినా ఎదురొడ్డి నిలిచిన సంస్థ ఇది. తెలంగాణ రాకముందు రాష్ట్రం కోసం పని చేశాం. వచ్చిన తర్వాత ప్రజల అభివృద్ధి కోసం పని చేశాం. రాష్ట్రానికి నష్టం జరుగుతుంటే తెలంగాణ జాగృతి ఊరకోబోదని కవిత అన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం ఎంత పెద్ద వ్యవస్థతోనైనా, ఎంతటి పెట్టుబడి వ్యవస్థతోనైనా జాగృతి నిలబడి పోరాడిందని కవిత పేర్కొన్నారు. జాగృతి లాంటి సంస్థలు తరచూ పుట్టవు, పుట్టినవి చరిత్రలో నిలవడం చాలా అరుదని పేర్కొన్నారు. ఇది కేవలం ఒక సంస్థ మాత్రమే కాక, ఒక ఉద్యమంగా ప్రజలలో పెంపొందించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతోందని చెప్పారు. అలాగే, నాయకత్వం అంటే హోదా కాదు.. ప్రజా స్పృహ అని పేర్కొన్నారు. ఇంట్లో ఉండే ఇల్లాలు మొదటి లీడర్.. అని మహిళలను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. ఇంట్లో ప్రతి ఒక్కరి అవసరాలను ముందుగా గుర్తించి, తగినంత జాగ్రత్త తీసుకునే మహిళలే నిజమైన నాయకులు అని చెప్పుకొచ్చారు. అదే విధంగా, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని.. పరిష్కార మార్గాలు అన్వేషించే వాడే నిజమైన నాయకుడని ఆమె అభిప్రాయపడ్డారు. సామాజిక స్పృహే మంచి నాయకుడి ప్రథమ లక్షణమని కవిత అన్నారు. మన ఇంట్లో ఉన్న చెత్తను పక్కింట్లో వేయకుండా

చూసుకోవడమే సామాజిక స్పృహ అంటూ ఉదాహరణతో వివరించారు. జాగృతి కార్యకర్తలు ఈ స్పృహతో సేవా మార్గంలో ముందుకు సాగాలని ఆమె పిలుపునిచ్చారు. బయట కొన్ని విమర్శలు, అనుమానాలు వ్యక్తమవుతున్నప్పటికీ, జాగృతి కార్యకర్తలు సంయమనం పాటించాలని సూచించారు. వల్గర్ భాషను వాడకుండా, విషయపరమైన పదునైన సమాధానాలు ఇవ్వగలిగినవారే నిజమైన నేతలు అవుతారని వివరించారు. మహాత్మా గాంధీ చెప్పిన అహింసా సిద్ధాంతాన్ని పాటించాలనీ, ధైర్యానికి ఉదాహరణగా సుభాష్ చంద్రబోస్ ని మనసులో ఉంచుకోవాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమం ఏ ప్రయోజనాల కోసం కాదని, కేవలం సమాజానికి మంచి నాయకత్వం అందించాలనే దృష్టితోనే జరుపుతున్నామని ఆమె స్పష్టం చేశారు. ఎవరైనా నాయకత్వం పొందాలనుకుంటే.. జాగృతి వాళ్ల వెంట నిలుస్తుందని స్పష్టం చేశారు. బడుగు, బలహీన, అట్టడుగు వర్గాల మహిళలు, యువత రాజకీయంగా ఎదగడానికి జాగృతి ఒక గొప్ప వేదికగా మారుతుందని ఆమె పేర్కొన్నారు.

## డిఎ శివకుమార్, సిద్దరామయ్యల మధ్య తీవ్ర విభేదాలు

న్యూఢిల్లీ: 'సీఎం మార్పు' అంశంపై కర్ణాటక రాజకీయాల్లో తీవ్ర చర్చ జరుగుతున్న వేళ అనూహ్య ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఐదేళ్లూ తానే ముఖ్యమంత్రినని సిద్ధరామయ్య చెబుతున్నా.. తన చేతుల్లో ఏమీ లేదని డీకే శివకుమార్ అంటున్నా సీఎం పీఠం విషయంలో సిద్ధూ, డీకే వర్గాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో మరో కీలక విషయం తెరపైకి వచ్చింది. ఇటీవల దిల్లీలోని కర్ణాటక భవన్‌లో కర్ణాటక సీఎం, డిప్యూటీ- సీఎంల ప్రత్యేక అధికారులు పరస్పరం దాడి చేసుకున్నట్లు- పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. దీంతో కర్ణాటక ప్రభుత్వంలో లుకలుకలు మరోసారి బయటపడ్డాయి. పార్టీ వర్గాల ప్రకారం.. సిద్ధరామయ్య వద్ద ప్రత్యేక అధికారిగా విధులు నిర్వహిస్తున్న మోహన్‌కుమార్ అనే అధికారి తనను షూతో కొట్టినట్లు- శివకుమార్ వద్ద పనిచేసే ప్రత్యేక అధికారి ఆంజనేయ ఆరోపించారు. షూతో కొట్టి పార్టీ నేతల ముందు తన గౌరవానికి భంగం కలిగించి నందువల్ల.. అతడిపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. గతంలో కూడా మోహన్‌కుమార్‌కు పలువురు ఉన్నతాధికారులతో దురుసుగా ప్రవర్తించిన చరిత్ర ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయం తన దృష్టికి వచ్చిందని రెసిడెంట్ కమిషనర్ ఇమ్‌కోంగ్ల జమీర్ తెలిపారు.
ఆంజనేయ తనతో దురుసుగా ప్రవర్తించినట్లు- సీఎం ప్రత్యేక అధికారి మోహన్‌కుమార్ ఆరోపించారు. ఆయనే తన ఛాంబర్‌లోకి వచ్చి బెదిరింపులకు పాల్పడ్డాడని తెలిపారు. అయితే ఈ ఘర్షణకు సంబంధించిన సీసీటీ-వీ ఫుటేజీని కార్యాలయంలోని అవుట్ సోర్సింగ్ సిబ్బంది తొలగించినట్లు- తెలుస్తోంది. ఈ విషయంపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను అడుగగా ఇరువురు అధికారుల మధ్య జరిగిన ఘర్షణ విషయం తన దృష్టికి రాలేదని అన్నారు. అసలు ఏం జరిగిందో పూర్తి వివరాలు తెలుసుకున్నాక దీనిపై
మాట్లాడతానని పేర్కొంటూ సమాధానం దాటవేశారు. అయితే పదోన్నతులు, పోస్టింగ్‌ల విషయంలో ఇరువురు అధికారుల మధ్య పలుమార్లు విభేదాలు తలెత్తినట్లు- పార్టీ వర్గాలు పేర్కొంటు-న్నాయి. రాష్ట్రంలో సీఎం మార్పు వార్తల వేళ ఈ ఘటన చోటుచేసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

# భద్రాద్రి వద్ద పెరుగుతున్న గోదావరి నీటిమట్టం

భద్రాచలం:ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరిలో క్రమంగా నీటిమట్టం పెరుగుతున్నది. శనివారం 11 గంటలకు భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 34.4 అడుగులకు చేరింది. దీంతో స్నాన ఘట్టాల ప్రాంతం వద్ద మెట్లు- వరద నీటిలో మునిగిపోయాయి. ఎగువ నుంచి వస్తున్న వరదతో నీటిమట్టం మరింత పెరుగుతుందని అధికారులు తెలిపారు. వరద ఉధృతి నేపథ్యంలో లోతట్టు- ప్రాంతాల ప్రజలకు హెచ్చరికలు జారీచేశారు. కాగా, దుమ్ముగూడం మండలం పర్ణశాల వద్ద పర్యాటక ప్రదేశం నార చీరల ప్రాంతం వరద నీటిలో మునిగిపోయింది. దీంతో పర్యాటకులను ఆపివేశారు. చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు కూడా భారీగా వరద నీరు వచ్చి చేరుతున్నది. ఈ నేపథ్యంలో లోతట్టు- ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు- చేస్తున్నారు.

# బనకచర్ల పేరుతో చంద్రబాబు కుట్రలు



**హైదరాబాద్:** సీఎం రేవంత్‌రెడ్డికి నిద్రలో కూడా కేసీఆర్ గుర్తుకు వస్తున్నారని, అందుకే ఆయన పేరును పదే పదే ప్రస్తావిస్తున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో హైదరాబాద్ మల్లాపూర్‌లోని ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు-చేసిన సదస్సులో గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు వల్ల కలిగే నష్టంపై ప్రజంటేషన్ ఇచ్చారు. ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అంశాలు, భవిష్యత్ కార్యాచరణపై బీఆర్ఎస్వీ నేతలకు హరీశ్‌రావు దిశానిర్దేశం చేశారు. రేవంత్‌రెడ్డి ఏనాడూ జై తెలంగాణ అనలేదు. ఉద్యమ గుర్తులు, చరిత్ర చెరిపేసే ప్రయత్నం చేస్తున్నారు. రేవంత్‌రెడ్డి పాలనలో నీళ్లు ఆంధ్రాకు, నిధులు దిల్లీకి వెళ్తున్నాయి. కాంగ్రెస్, భాజపా, చంద్రబాబు కలిసి రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలకు వాస్తవాలు చెప్పాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని.. కృష్ణా, గోదావరి జలాల్లో వాటాను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. గురు శిష్యులు కలిసి తెలంగాణకు చేస్తున్న అన్యాయాన్ని ప్రజలకు వివరిస్తామన్నారు. గోదావరి జలాలను ఏపీకి తరలించే
కుట్ర చేస్తున్నారని, రేవంత్‌రెడ్డి నిలదీసే పరిస్థితి లేదన్నారు. కేసీఆర్ నేతృత్వంలో మరో ఉద్యమానికి శ్రీకారం చుడతామని, అసవరమైతే భారత రాష్ట్రసమితి తరపున సుప్రీంకోర్టుకు వెళ్తాం అని హరీశ్‌రావు తెలిపారు. గోదావరిలో తెలంగాణకు 967 టీ-ఎంసీలు, ఏపీకి 513 టీ-ఎంసీలు కేటాయించారని హరీశ్‌రావు తెలిపారు. తెలంగాణ చర్చ సందర్భంగా ఇవి కూడా చర్చకు వచ్చాయని అన్నారు. కానీ తెలంగాణకు రావాల్సిన 967 టీ-ఎంసీలను కూడా ఏపీ వ్యతిరేకిస్తుందని మండిపడ్డారు. తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకిస్తూ రాసిన లేఖలను ఏపీ ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వరద జలాలు అంటున్నాడని.. లెక్క తేలకుండా వాటిని ఎలా తీసుకెళ్తావని చంద్రబాబుపై హరీశ్‌రావు మండిపడ్డారు. నీళ్లు నిండుగా ఉంటే గోదావరిపై తెలంగాణ ప్రాజెక్టులను ఎందుకు వ్యతిరేకించావని చంద్రబాబును హరీశ్‌రావు నిలదీశారు. చంద్రబాబు ఉమ్మడి ఏపీలోనే కేటాయించిన నీళ్లనే అడ్డుకుంటున్నాడని మండిపడ్డారు. కచ్చితంగా బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. కేసీఆర్ 2020లోనే కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కు లేఖ రాశారని.. సముద్రంలో కలుస్తున్న 3000 టీఎంసీల గోదావరి జలాల్లో తెలంగాణకు 1950 టీ-ఎంసీలు కేటాయించాలని కోరారని హరీశ్‌రావు తెలిపారు. హైదరాబాద్ నీటి అవసరాలు, పరిశ్రమల కోసం వాటిని వినియోగించుంటామని లేఖలో పేర్కొన్నారని చెప్పారు. ఇప్పుడు చంద్రబాబు 400 టీ-ఎంసీలు వినియోగించుకునేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ లెక్క తేలకుండా బనకచర్ల ప్రాజెక్టు ఎట్లా కడుతావని రేవంత్ రెడ్డి అడుగాలి కదా అని ఆయన ప్రశ్నించారు. గోదావరి నీళ్ల లెక్క తేలకుండా, వాటా తేలకుండా రాత్రికి రాత్రి ప్రాజెక్టు కడితే తెలంగాణ ఊరుకోదని హరీశ్‌రావు స్పష్టం చేశారు. దీనికి రేవంత్ రెడ్డి ఒప్పుకున్నా తెలంగాణ సమాజం ఒప్పుకోదని అన్నారు. నీళ్ల కోసం మరోసారి తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగుస్తుందని.. మరోసారి యూనివర్సిటీలు ఉద్యమ వేదికలు అవుతాయని హెచ్చరించారు. బనకచర్ల ప్రాజెక్టు కోసం రేవంత్ రెడ్డి సంతకాలు పెడితే కేసీఆర్ ఊరుకోడు.. రైతులు ఊరుకోరని అన్నారు. సుప్రీంకోర్టుకైనా వెళ్తాం.. రోడ్లను దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. తెలంగాణ వాటాలో చుక్క నీటిని వదలుకోమని స్పష్టం చేశారు.ఏపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టుకు రూపకల్పన చేసిందని హరీశ్‌రావు అన్నారు. పోలవరం ప్రాజెక్టును కట్టి కృష్ణా పరివాహక ప్రాంతానికి నీటిని తీసుకెళ్తామని చెప్పారని తెలిపారు. 1980లో బచావత్ ట్రిబ్యునల్ 80 టీఎంసీలను కృష్ణా నదికి తరలిస్తే, నాగార్జునసాగర్ మీద ఉన్న 45 టీఎంసీలు తెలంగాణకు ఇవ్వాలని చెప్పారని అన్నారు. ఆ 45 టీ-ఎంసీలు మాకు ఇవ్వడానికి చంద్రబాబు ఒప్పుకోవాలని డిమాండ్ చేశారు. నదీ పరివాహక ప్రాంతంలో నాగరికత ఉంటు-ందని అన్నారు. కృష్ణా, గోదావరి జలాల్లో మన వాటా మనం దక్కించుకోవాలని పిలుపునిచ్చారు. గోదావరి బనకచర్ల ద్వారా తెలంగాణకు తీరని అన్యాయం జరుగుతుందని హరీశ్‌రావు అన్నారు. దీనిపై గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ-ల్లో అవగాహన కల్పించారని తెలిపారు. పోతిరెడ్డి పాడు వెనుక కాంగ్రెస్ రెగ్యులటరే బనకచర్ల అని ఆయన స్పష్టం చేశారు. బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్
ద్వారా రాయలసీమకు తరలిస్తారని తెలిపారు. పోలవరం నుంచి 2 టీఎంసీల నీటిని తరలించేందుకే బనకచర్ల ప్రాజెక్టును తెరపైకి తెచ్చారని అన్నారు. గోదావరి నది ఏడు రాష్ట్రాల్లో ప్రవహిస్తుందని తెలిపారు.

# హైదరాబాద్‌లో ఆగని వాన.. రోడ్లపై వరదతో వాహనదారుల ఇబ్బందులు



ఎడతెరిపి లేని వర్షాలకు హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో రోడ్లు జలమయం అయ్యాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. రోడ్లపై వరద నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫలితంగా ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. మాసబ్ ట్యాంక్ సమీపంలో రోడ్లపైకి భారీగా నీరు చేరడంతో వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి

# భాగ్యనగర సౌభాగ్యం నిలిపేదెలా? !

చిన్న వర్షం వచ్చినా హైదరాబాద్ రోడ్లు వరదలను తలపిస్తున్నాయి. మామూలు రోజుల్లో ట్రాఫిక్ చిర్రెత్తు కొచ్చేలా చేస్తోంది. ఎక్కడికి వెళ్లాలన్నా ఇబ్బందిగా మారుతోంది. వర్షాం వస్తే నరకం కనిపిస్తోంది. హైదరాబాద్ విస్తరిస్తున్నా అందుకు తగ్గట్లుగా డ్రైనేజీని ఆధునీకరించడం లేదు. అలాగే వానవస్తే నీరు పోయేలా చేయడం లేదు. వేలకోట్ల ఆదాయం వస్తున్నా నగరం అభివృద్ధి విషయంలో పాలకులు శ్రద్ధ వహించడం లేదు. కెసిఆర్ హైదరాబాద్ గురించి కాకమ్మ కబుర్లు ఎన్నో చెప్పారు. హుస్సేన్ సాగర్‌ను కొబ్బరినీళ్లలా తయారు చేస్తానని ప్రగల్భాలు పలికారు. దాదాపు పదేళ్లు అధికారంలో ఉన్నా ఆ వైపు కన్నెత్తి చూడలేదు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తోంది. అయినా ఎలాంటి పురోగతి కానరావడం లేదు. ప్రలను బుజ్జగించే పనులు తప్ప కఠినంగా నగర సుందరీకరణ, ట్రాఫిక్ ఫ్రీ రోడ్లను అభివృద్ధి చేయడం లేదు. హైదరాబాద్ సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం కావాలి. ప్రధానంగా మురుగునీరు, చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు,ట్రాఫిక్ సమస్యలు ఎప్పటినుంచో వేధిస్తున్నాయి. నగరంలో చెత్తను ఎక్కడపడితే అక్కడ వేసేస్తున్నారు. ఈ విషయంలో కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. చెత్తను వీధుల్లో ఎక్కడ పడితే అక్కడ పడేసే విధానాలకు స్వస్తి పలకాలి. అవసరమైతే జరిమానాలు విధించాలి. దీనికితోడు నగరంలో రోడ్లపై వెలసిన ఆలయాలు,దర్గాలు, ఇతర కట్టడాల తొలగింపుపై కఠిన చర్యలకు ఉపక్రమించాలి. లేకుంటే అవి రోడ్లకు అడ్డంగా ఉండడం వల్ల ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయి. వీటి గురించి ఏ పార్టీ వారు కూడా మాట్లాడడం లేదు. మత కట్టడాలను తొలగించడం పాపమనా లేక, పార్టీలకు భయపడో కానీ వాటి జోలికి వెళ్లడం లేదు. హైదరాబాద్‌తో అనుబంధం ఉన్న వారిని, రాజకీయ పార్టీలను కూర్చోబెట్టి ఈ సమస్యలపై చర్చించాలి. రోడ్డు మధ్యలో ఉన్న ప్రార్థనా స్థలాలు, దర్గాల తొలగింపు అనివార్యం కావాలి. నగర సుందరీకరణ, విస్తరణలో వీటి తొలగింపు అత్యంత ముఖ్యం. అలాగే నాలాల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపాలి. హైడ్రా కొంతమేర కూల్చివేతలు చేపట్టడం ఆహ్వానించదగ్గదే. అయితే నాలాల ఆక్రమణలను పెద్ద ఎత్తున తొలగించాలి. డ్రైనేజీ వ్యవస్థను పటిష్టం చేసుకోవాలి. వర్షం వస్తే కాలనీలు మునిగే పరిస్థితి నుంచి బయటపడేలా ప్రణాళికలు సిద్ధం చూసుకోవాలి. హైదరాబాద్ రూపు రేఖలు మారబోతున్నాయన్న విశ్వాసం ప్రజల్లో కలగాలి. ప్రజలను కూడా ఇందులో బాధ్యులను, భాగస్వాములను చేయాలి. ఇప్పటికే శివారు ప్రాంతాలు బాగా అభివృద్ధి చెందాయి. తెలంగాణకు మణిహారమైన హైదరాబాద్ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సిఎం రేవంత్ రెడ్డి పదేపదే చెప్పడం కాకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలి. నగరంలో పారిశుద్ధ్య, మురుగు నీటి, తాగునీటి సమస్యలు గత కొన్నేళ్లుగా నిర్లక్ష్యానికి గురైనట్లు ఎవరైనా అంగీకరించాల్సిందే. భాగ్యనగరాన్ని మరింత ప్రణాళికా బద్ధంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాల్సి ఉంది. దీనికితోడు మెట్రో విస్తరణ, మూసీ సుందరీకరణతో నగర రూపురేఖలు మారుతాయి. పట్టణ విపత్తుల నివారణకు, వాటిని ఎదుర్కొన దానికి తీసుకోవాల్సిన చర్యలను చేపట్టడంతో పాటు, ఎలాంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొని తక్షణ రక్షణ చర్యలు తీసుకొనే విషయంలో జాతీయ, రాష్ట్రేతర సంస్థలతో సమన్వయం చేసుకోవాలి. ఇప్పుడు హైడ్రా తన పనిని వేగంగా చురుకుగా చేపట్టడం కలసి వస్తోంది. అలాగే అన్యాక్రాంతం అయిన భూములను పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇకపోతే ప్రధానంగా నగరంలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉంది. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో పాటు శివారు ప్రాంతాలు విస్తరించి, నగరంలో కలిసి పోవడం, పట్టణీకరణ విషయంలో క్రమపద్ధతి లేకపోవడంతో నగరం నరకకూపంగా మారుతోంది. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా సుమారు 110 చదరపు కి.మీల పట్టణ ప్రాంతం పునరుజ్జీవనం చేస్తామని సిఎం రేవంత్ పదేపదే ప్రకటించారు. అలాగే, నదీ తీర ప్రాంతంలో క్రొత్త వాణిజ్య, నివాస కేంద్రాలు వెలిసి, పాత హెరిటేజ్ ప్రాంతాలు క్రొత్తదనాన్ని సంతరించు కుంటాయి. ఇకపోతే జిహెచ్ఎంసి పరిధిలో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక నిధులు కేటాయించాలి. ఎయిర్ పోర్ట్ వరకూ మెట్రో విస్తరణ సాకారమయితే మరింత సౌకర్యంగా ఉంటుంది. పాత నగరానికి మెట్రో విస్తరణ, మల్టీ మోడల్ సబర్బన్ రైలు ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ వంటివన్నీ కూడా ట్రాఫిక్‌ను కంట్రోల్ చేసేవే. ఇకపోతే నగరంలో విలువైన భూములు అన్యాక్రాంతం అయినా గత పదేళ్లుగా పట్టింపు లేకుండా పోయింది. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌లోని ప్రభుత్వ భూములు ఏ విధంగానైతే అన్యాక్రాంతమయ్యాయో, స్వరాష్ట్రంలో దానికి రెట్టింపు భూ విధ్వంసం జరిగింది. ఆనాటి గొలుసుకట్టు చెరువులు చాలా మాయం చేసి, కొండలు, గుట్టలను పిండి చేసి రియల్ ఎస్టేట్ ప్లాట్లుగా మార్చేసి అమ్మేశారు. గత ప్రభుత్వం క్షేత్రస్థాయిలో ప్రభుత్వ భూములకు రక్షణగా ఉండే వీఆర్ఓ, వీఆర్ఏలను రెవెన్యూశాఖ నుంచి దూరం చేయడంతో కబ్జాలకు ప్రభుత్వమే ఉసిగొలిపినట్టయ్యింది.

# టూవీలరన్‌ను ఢీకొన్న ట్యాంకర్ తండ్రీ కూతుళ్ల దుర్మరణం

రంగరెడ్డి: రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ చౌరస్తాలో శనివారం ఉదయం ఘోర ప్రమాదం జరిగింది. ట్యాంకర్ లారీ ఢీకొట్టడంతో ద్విచక్రవాహనంపై వెళ్తున్న తండ్రి, కుమార్తె మృతి చెందారు. సీఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. షాద్‌నగర్‌కు చెందిన మచ్చేందర్.. శంషాబాద్ వర్ధమాన్ కళాశాలలో బీటెక్ చదువుతున్న తన కుమార్తె మైత్రిని కాలేజీకి పంపించేందుకు బైక్‌పై బస్టాప్‌కు బయలుదేరారు. షాద్‌నగర్ చౌరస్తా వద్దకు రాగానే వీరి ద్విచక్రవాహనాన్ని ట్యాంకర్ లారీ ఢీకొట్టింది. మచ్చేందర్ ఘటనాస్థలిలోనే మృతి చెందగా, మైత్రికి తీవ్రగాయాలై లారీ టైర్ల మధ్యలో ఇరుక్కు పోయింది. కాపాడండి అంటూ మైత్రి చేసిన ఆర్తనాదాలు స్థానికులను కంటతడి పెట్టించాయి. ప్రమాదం జరిగిన వెంటనే అతి కష్టమ్మీద తన మొబైల్‌ను సమీపంలో ఉన్న ఓ వ్యక్తికి ఇచ్చి కుటుంబ సభ్యులకు ఫోన్ చేయాలని ప్రాథేయపడటం అక్కడి వారిని కన్నీరు పెట్టించింది. అదే సమయంలో స్నేహితురాలి నుంచి మైత్రికి ఫోన్లు రావడంతో.. స్థానికులు ప్రమాదం విషయం చెప్పి ఆమె బంధువులకు సమాచారం అందేలా చేశారు. కాసేపటికి మైత్రి కూడా కన్నుమూసిందని సీఐ తెలిపారు. లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## డిజిపి ముందు పలువురు మావోల లొంగుబాటు




విజయవాడ: పలువురు మావోయిస్టులు శనివారం ఉదయం ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఎదుట లొంగిపోయారు. వారి వివరాలను డీజీపీ మీడియాకు వివరించారు. లొంగిపోయిన వారిలో రామకృష్ణ, అరుణ ఉన్నారని పేర్కొన్నారు. ఏవోబీ పరిధిలో భారీ డంప్‌ను స్వాధీనం చేసుకున్నట్లు- డీజీపీ తెలిపారు. ఏకే 47, హ్యాండ్ గ్రనేడ్లు, ఇతర ఆయుధాలు స్వాధీనం చేసుకున్న వాటిలో ఉన్నాయన్నారు. మావోయిస్టుల కదలికలపై ఎప్పటికప్పుడు సమాచారం అందుకుని జాయింట్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రానికి చెందిన దాదాపు 21 మంది ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్ వివిధ రాష్ట్రాల్లో మావోయిస్టు సభ్యులుగా పనిచేస్తున్నారని చెప్పారు. మావోయిస్టులంతా జనజీవన స్రవంతిలోకి వచ్చి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

# రోడ్లు, తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి

## 6 వేల కోట్లతో ప్రధాని మోడీ దృష్టికి ప్రతిపాదనలు

## ఎంపీ వల్లభనేని బాలసౌరి బాలశౌరి వెల్లడి

మచిలీపట్నం: బందరు పార్లమెంటు పరిధిలో రోడ్లు, తాగునీటి సమస్యల పరిష్కారానికి ఢిల్లీ స్థాయిలో కృషి చేస్తున్నామని ఎంపీ వల్లభనేని బాలసౌరి అన్నారు. ప్రజల త్రాగునీటి సమస్యల శాశ్వత పరిష్కారానికి 6 వేల కోట్లతో రూపొందించిన ప్రతిపాదనలను ప్రధాని మోడీ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ వెల్లడించారు. మండలంలోని అంగులూరు గ్రామంలో ఎంపీ వల్లభనేని బాలసౌరి, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శనివారం ఉదయం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో రూ.32 లక్షల ఎన్ హెచ్ పి సి సంస్థ సిఎస్ఆర్ నిధులతో నిర్మించిన మల్టీపర్పస్ కమ్యూనిటీ- హాల్ ను ఎమ్మెల్యే రాముతో కలిసి, ఎంపీ బాలసౌరి ప్రారంభించారు. పర్యటనలో భాగంగా ప్రజలు తెలిపిన సమస్యల
పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎంపీ బాలసౌరి, ఎమ్మెల్యే రాము హామీ ఇచ్చారు. అనంతరం ఎంపీ బాలసౌరి మీడియాతో మాట్లాడారు.. పార్లమెంటు- పరిధిలోని రోడ్లు, త్రాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దఅష్టి పెట్టినట్లు- తెలిపారు. ముఖ్యంగా కృష్ణానదికి ఆనుకొని ఉన్న ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలో త్రాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రజాప్రతినిధులందరం ఉమ్మడిగా కఅషి చేస్తున్నామన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా రూరల్ డెవలప్మెంట్ శాఖ ఆధ్వర్యంలో 6వేల కోట్లతో వాటర్ ప్రాజెక్టు నిర్మాణానికి అంచనాల రూపొందించామని, ఈ ప్రాజెక్టును ప్రధాని మోడీ దఅష్టికి తీసుకెళ్లగా ఆయన కూడా సానుకూలంగా స్పందించినట్లు- ఎంపీ బాలసౌరి చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యం, కేంద్ర సంస్థల సహకారంతో ఈ మెగా ప్రాజెక్టు కార్యరూపం దాల్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. మచిలీపట్నం పార్లమెంటు- పరిధిలోని రోడ్ల సమస్యలను సీఎం చంద్రబాబు,డిప్యూటీ- సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లినట్లు- పేర్కొన్నారు. రాబోవు
రెండేళ్లలో అన్ని రహదారులతో పాటు-గా, రైతులకు ఉపయోగపడేలా డొంక రోడ్లను కూడా అభివఅద్ధి చేసేందుకు ప్రతిపాదనల రూపొందించినట్లు- ఆయన చెప్పారు. ప్రజల విజ్ఞప్తుల మేరకు రైల్వే సమస్యలపై త్వరలో అధికారులతో సమావేశం నిర్వహించి... పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కొన్ని కారణాలతో ఆగిన మచిలీపట్నం తిరుపతి -ట్రైన్ త్వరలో తిరిగి ప్రారంభం అవుతుందని ఎంపీ బాలసౌరి వెల్లడించారు. 18 కోట్ల నిధులతో గుడివాడ మెయిన్ రోడ్డు అభివఅద్ధి పనులు త్వరలో ప్రారంభం అవుతాయని, బైపాస్ రోడ్డు సమస్యను కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ దఅష్టికి తీసుకెళ్లానని ఆ సమస్యను కూడా పరిష్కరిస్తానన్నారు. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ సోదరుడు ఎంపీ బాలసౌరి సహకారంతో రానున్న రోజుల్లో గుడివాడ నియోజకవర్గంలో దశాబ్దాలుగా అపరిస్కఅతంగా ఉన్న అనేక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటు-న్నట్లు- పేర్కొన్నారు. గుడివాడ అభివఅద్ధికి సహకరిస్తున్న ఎంపీ బాలసౌరికు ప్రజల తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నానని ఎమ్మెల్యే రాము అన్నారు. రాబోవు రోజుల్లో గుడివాడ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి తాను శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే రాము తెలిపారు. గ్రామ పర్యటనలో పాల్గన్న ఎంపీ బాలసౌరి, ఎమ్మెల్యే రాము వెంట పెద్ద సంఖ్యలో కూటమి శ్రేణులు పాల్గొనగా.... వీధి వీధినా ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికారు. పర్యటనలో భాగంగా గ్రామంలోని స్వర్గీయ భారతరత్న అంబేద్కర్, స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహాలకు నాయకులు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ పొట్లూరి రవి, జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, మండల టిడిపి నాయకులు సాయన పుష్పావతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి..... ఎస్ఎఫ్ఐ

**ప్రభుత్వ విద్య బలోపేతానికై పోరాటం.**

**జిల్లాలోనిప్రభుత్వ విద్య బలవపేతానికై 1000 కోట్లు విడుదల చేయాలి.**

**వలసలకు వెళ్తున్న మండలాలలో ప్రత్యేక హాస్టల్లో ఏర్పాటు చేయాలి.**




**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి ఎమ్మిగనూరు జులై 26 శనివారము**

ఎస్ఎఫ్ఐ 48వ జిల్లా ప్లీనర్ సమావేశాలలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అబ్దుల్లా, రంగప్ప అన్నారు. ఎమ్మిగనూరులోని నలంద డిగ్రీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా 48 ప్లీనరీ సమావేశాలలో వారు మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో పనులు లేక చాలామంది ప్రజలు ఉపాధి కోసం దూర ప్రాంతాలకు వెళ్తూ తమలాగే తమ పిల్లల జీవితం మారకూడదని వారని ప్రభుత్వ రెసిడెన్షియల్ లో చేర్పించి వారు దూర ప్రాంతాలకు వలసలకు వెళ్లాలని అనుకుంటే ప్రస్తుతం మాత్రం జిల్లా వ్యాప్తంగా ఏ రెసిడెన్షియల్ హాస్టల్ సీట్లు దొరకడం లేదన్నారు. ఈ ఇబ్బంది ముఖ్యంగా అమ్మాయిల చదువులకు ఆటంకంగా మారిందన్నారు ఒకవైపు కస్తూర్బా గాంధీ విద్యాలయాలలో సీట్లు రాక మరోవైపు సాంఘిక సంక్షేమ హాస్టల్లో సీట్లు రాకపోవడంతో ప్రైవేట్ రెసిడెన్షియల్ లో చదివించే స్తోమత వారికి లేకపోవడంతో వారితో పాటు దూర ప్రాంతాలకు వలసలకు తీసుకెళు న్నారని అన్నారు. తమ తోటి వయసు పిల్లలతో బడిలో ఆడుతూ పాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకోవాల్సిన విద్యార్థులు ఎక్కడో కూలిగా మారుతూ భవిష్యత్తును నిర్వీర్యం చేసుకునే దుస్థితి కర్నూలు జిల్లా వ్యాప్తంగా మారిందన్నారు. ఇంత జరుగుతున్న జిల్లా విద్యాశాఖ అధికారులు నిమ్మకి మీరే తిన్నట్టు వ్యవహరిస్తున్నారని ఇప్పటికైనా జిల్లా వ్యాప్తంగా ఒక సర్వే నిర్వహించి పనులకు వలసలకు వెళ్తున్న విద్యార్థులను బడిలో చేర్పించాలన్నారు. ప్రస్తుతం సంక్షేమ హాస్టల్ లో, గురుకులాలలో, కస్తూర్బా గాంధీకి బాలికల విద్యాలయాలలో, చదువుతున్న విద్యార్థులకు మౌనిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని. అలాగే పేరుకు మాత్రమే యూనివర్సిటీలుగా ఉన్న రాయలసీమ యూనివర్సిటీ, క్లస్టర్ యూనివర్సిటీ, ఉర్దూ యూనివర్సిటీలు అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని, ఆదోని మెడికల్ కాలేజ్ ప్రవేట్ స్వీకరణను నిలిపివేసి ప్రభుత్వమే నిర్మాణం పూర్తి చేసి అడ్మిషన్లు ప్రారంభించే విధంగా జిల్లాలోని ఎమ్మెల్యేలందరూ కృషి చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, సాయి ఉదయ్, విజయ్ జిల్లా నాయకులు రాము పాల్గొన్నారు.

# 8వ వార్డ్‌లో సుపరిపాలన తొలి అడుగు

**క్లస్టర్ ఇంచార్జ్ జాకీర్,వార్డ్ ఇంచార్జి శాలీ భాష ఆధ్వర్యంలో**

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు జులై 26:**



రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు గారి నేతృత్వంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సుపరిపాలన-తొలిఅడుగు కార్యక్రమంలో శనివారం నందికొట్కూరు పట్టణం 8వ వార్డులో క్లస్టర్ జాకీర్ హుస్సేన్,కౌన్సిలర్ శాలిబాషా గారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది.మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రసాద రెడ్డిగారు,మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి మరియు నాయకులు ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంచుతూ కార్యక్రమాన్ని నిర్వహించారు,ఇంటింటి తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలు అందించే దిశగా పరిశ్రమలు ఏర్పాటుకు ప్రోత్సాహం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అందిస్తున్నారు. పారాదర్శక పరిపాలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం అన్నారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటూ, అవగాహన కల్పిస్తూ సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నాం అని తెలిపారు.ప్రజల ఆదరణతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని, ప్రజల వద్దకే మా బలం అన్నారు. కార్యక్రమంలో కోక్లస్టర్ ఎస్ ఎండి జమీల్,రసూల్ ఖాన్,కుమార్ సనాఅబ్దుల్లా, మన్సూర్,శేఖర్,ఆయిల్ రవి, అక్రమ్ ముహమ్మద్,కలాం ఇర్ఫాన్,నికిల్,అఫ్రిద్,ఫయాజ్, కిషోర్,హరి,జీవన్ తదితరులు పాల్గొనడం జరిగినది.

# సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి తెలుగుదేశం ప్రభుత్వం

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**



ఎమ్మిగనూర్ జులై 26 శనివారము శాసనసభ్యులు డాక్టర్ బి వి జయ నాగేశ్వర్ రెడ్డి గారి ఆదేశాల మేరకు సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ఏడాదికాలంగా జరిగిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి మై టిడిపి APP లో పొందుపరచడం జరిగింది ఈ కార్యక్రమంలో 5వ వార్డ్ .కౌన్సిలర్ పి. అమానుల్లా ఐదో వార్డ్ అధ్యక్షులు యంగల ఈరన్న ప్రధాన కార్యదర్శి కే నాగూర్ భాష మరియు ఏ శ్రీనివాసులు పి సాదిక్ కే ఉస్మాన్ భాష మధు ముని నాగరాజు శంకర్ నూతన్ పాల్గొనడం జరిగింది.

# ఆగస్టు నెలలో తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారి ఆలయాలలో విశేష ఉత్సవాలు

**తిరుపతి,ఉత్తేజిత ప్రతినిధి, జూలై 26**

శ్రీపద్మావతీ అమ్మవారి ఆలయం....
ఆగస్టు 01, 15, 22, 29వ తేదీలలో శుక్రవారం సందర్భంగా సాయంత్రం 6 గంటలకు తిరుచ్చిపై అమ్మవారు ఆలయ నాలుగు మాడ వీధులలో విహరించి భక్తులకు దర్శనమివ్వనున్నారు.

ఆగస్టు 8న ఉదయం 10 గంటలకు తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం. సాయంత్రం 6 గంటలకు స్వర్ణ రథోత్సవం.



**శ్రీ సుందరరాజ స్వామి ఆలయంలో..**

ఆగస్టు 13న ఉత్తర భద్ర నక్షత్రం సందర్భంగా సాయంత్రం 6 గం.లకు స్వామివారు తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడ వీధులలో విహరించి అనుగ్రహించనున్నారు.

**శ్రీ బలరామ కృష్ణ స్వామి వారి ఆలయంలో ..**

ఆగస్టు 16న గోకులాష్టమి సందర్భంగా పెద్దశేష వాహనంపై స్వామివారు కటాక్షించనున్నారు.

**ఆగస్టు 17న ఉట్లోత్సవం, ఆస్థానం**

**శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయంలో...**

ఆగస్టు 26న హస్త నక్షత్రం సందర్భంగా సాయంత్రం 5 గంటలకు స్వామివారు తిరుచ్చిపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.

**తిరుచానూరు శ్రీనివాస ఆలయం**

ఆగస్టు 2, 9, 16, 23, 30 తేదీలలో వేంకటేశ్వరస్వామివారి మూలవర్లకు అభిషేకం.

**శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం, అప్పలాయగుంట...**

ఆగస్టు 1, 8, 15, 22, 29వ తేదీలలో శుక్రవారం సందర్భంగా ఉదయం 7 గంటలకు వస్త్రాలంకరణ సేవ, అభిషేకం. ఆగస్టు 3, 10, 17, 24, 31వ తేదీలలో శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామివారికి ఉదయం 8.15 గంటలకు అభిషేకం.

ఆగస్టు 5న మంగళ వారం ఉదయం 8 గంటలకు అష్టదళ పాదపద్మారాధన సేవ. ? ఆగస్టు 9న శ్రవణ నక్షత్రం సందర్భంగా ఉదయం 10.30. గంటలకు కల్యాణోత్సవం. ?ఆగస్టు 13న ఉదయం 8 గంటలకు అష్టోత్తర శత కలశాభిషేకం.

# ఎమ్మిగనూరు ఎమ్మెల్యే శ్రీ బి వి జయనాగేశ్వరడ్డి గారికి విన్నపము!

## APRJC (Girls) బనవాసి మ్యాథ్స్ లెక్చర్స్ ను భర్తీ చేయించగలరు!

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**



ఎమ్మిగనూరు జులై 26 శనివారము మన రాయలసీమ లో ఉన్న ఒకే ఒక్క APRJC (Girls) బనవాసి లో ఈ సంవత్సరంలో సమస్యల మీద సమస్యలు వచ్చినాయి. 1. లైబ్రేరియన్ మద్దిలేటి సమస్య 2. పరీక్షల సమయంలో విష జ్వరలు, 3. ఈ మధ్యలో ఒక అమ్మాయి ఆత్మ హత్య 4. ఇప్పుడు కాలేజీ కి మూల స్తంభాలు అయిన సీనియర్ MATHAS - A కు ఉన్న గీరవాణి మేడం మరియు MATHAS - B ఉన్న శ్రీదేవి మేడం కర్నూలు మరియు అనంతపురం కు ట్రాన్స్ఫర్ అయ్యారు. ఇప్పుడు ప్రస్తతం ఒకే ఒక్క రెగ్యులర్ మేడం ప్రిసిపల్ గా ఉన్నారు. మిగిలిన అందరూ కాంట్రాక్ట్ (గెస్టు) వాళ్ళు. ఈ విద్యా సంవత్సరంలో Maths కు చాలా ఇబ్బంది అవుతుంది. వేరే సబ్జెక్ట్ లెక్చర్ లేకున్న చదువుకోవచ్చు. కానీ మ్యాథ్స్ లేక పోతే చాలా కష్టం. కనుక దయచేసి మీరు ఇంటర్మీడియట్ సెక్రటరీ తో మాట్లాడి ఇక్కడి నుండి ట్రాన్స్ఫర్ అయిన గీరవాణి మేడం మరియు MATHAS - B ఉన్న శ్రీదేవి మేడం తిరిగి APRJC (Girls) బనవాసి తీసుకొని వచ్చి పిల్లలకు ఈ విద్య సంవత్సరము నష్ట పోకుండా చూడగలరు అని బాలికల తల్లి తండ్రులు కోరుతున్నారు.

# ఈ నెల 27 వ తేదీ నుండి ఆగస్టు 01 వ తేదీ వరకు నిర్వహించనున్న %ూూౌూాజ% -డిపార్ట్‌మెంటల్ పరీక్షలు, మే-2025 సెషన్ (నోటిఫికేషన్ నం. 04/2025) సంబంధించిన పరీక్షల ఏర్పాట్లు పూర్తి

**తిరుపతిజిల్లాలో 1 పరీక్ష కేంద్రంలిహాజరుకానున్న 3654 అభ్యర్థులు జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు**

**తిరుపతి ,ఉత్తేజిత ప్రతినిధి, జూలై 26**




ఈనెల 27.07.2025 నుండి 01.08.2025 వ తేదీ వరకు జిల్లాలో జరగనున్న APPSC – డిపార్ట్‌మెంటల్ పరీక్షలు, మే–2025 సెషన్ (నోటిఫికేషన్ నం. 04/2025) పరీక్షలకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయడం జరిగిందని జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు పేర్కొన్నారు. శనివారం ఉదయం స్థానిక కలెక్టరేట్ లోని V.C హాల్ నందు సంబంధిత అధికారులతో రేపు జరగనున్న APPSC పరీక్షల నిర్వహణపై సమీక్ష నిర్వహించి మాట్లాడుతూ ...ఈ నెల 27 వ తేదీ నుండి ఆగస్టు 01 తేదీ వరకు నిర్వహించనున్న APPSCడిపార్ట్‌మెంటల్ పరీక్షలు సంబంధించిన పరీక్షలు Objective type Papers ఉ. 10.00 నుండి మ 12.00 మరియు మ.3.00 నుండి మ.5.00, Conventional type Papers- ఉ. 10.00 నుండి మ 01.00 మరియు మ.3.00 నుండి మ.6.00 వరకు 1 సెంటర్ నందు పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ఏర్పాట్లు పూర్తి అయ్యాయని పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు.తిరుపతి జిల్లాలో ఈ పరీక్షలకు మొత్తం 1 సెంటర్ ను ఏర్పాటు చేయడం జరిగిందనీ 3654 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. ఈ పరీక్షల కొరకు ఒక డిప్యూటీ తహశీల్దార్ లైజన్ అధికారిగా నియమింపడం జరిగిందని అని తెలిపారు. పరీక్షా కేంద్రాలలోకి మొబైల్ ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఎలక్ట్రానిక్ వాచ్ లు, వైర్లెస్ హెడ్ సెట్స్, తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతి ఉండదని , పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు, ఆర్టీసి బస్సు సౌకర్యం,విద్యుత్ అంతరాయం లేకుండా సంబందిత శాఖల అధికారులు చూడాలని, త్రాగు నీరు, టాయిలెట్స్ సక్రమంగా ఉండాలని, అభ్యర్థుల సౌకర్యార్థం సకాలంలో పరీక్షా కేంద్రా లకు చేరుకునే విధంగా ఆర్ టి సి వారు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచిం చారు.APPSC -డిపార్ట్‌మెంటల్ పరీక్షలు, మే–2025 సెషన్ (నోటిఫికేషన్ నం. 04/2025) పరీక్షా కేంద్రముల వివరాలు: 9105– ION% డిజిటల్ జోన్, iDZ, జూ పార్క్ రోడ్, చెర్లోపల్లి గ్రామం, తిరుపతి 517503.ఈ సమావేశంలో APPSC నుండి ఆర్. వెంకట రమణ, సెక్షన్ ఆఫీసర్, బి.వి.ఎస్.శేఖర్, సెక్షన్ ఆఫీసర్ మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఏపీ పిటిడి నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఎమ్మిగనూరు డిపో ఆంధ్ర ప్రదేశ్

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి ఎమ్మిగనూరు జులై 26 శనివారము**




ప్రచురణ కొరకుఏపీఎస్ఆర్టీసీ గవర్నర్పేట 1 డిపో మరియు పాత బస్టాండ్ స్థలాన్ని ప్రైవేట్ సంస్థకు షాపింగ్ మాల్ కొరకు ఇవ్వాలని ప్రభుత్వ ప్రతిపాదన కు నిరసనగా రాష్ట్రంలోని అన్ని డిపోలలో 26 మరియు 27 తేదీల లో ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేయాలని రాష్ట్ర కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో శనివారం మొదటి రోజు ఎర్ర బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరైన ఎమ్మిగనూరు డిపో ఉద్యోగులు.ఏపీఎస్ఆర్టీసీ గవర్నర్పేట 1 డిపో మరియు పాత బస్టాండ్ స్థలాన్ని ప్రైవేట్ సంస్థకు షాపింగ్ మాల్ కొరకు ఇవ్వాలని ప్రభుత్వ ప్రతిపాదన పై రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ గా మా అభ్యంతరాలను వ్యతిరేకతను తెలియజేస్తూ రవాణా శాఖ మంత్రి గారికి, ఏపీఎస్ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్ గారికి, వైస్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ ఏపీఎస్ఆర్టీసీ గారికి వినతి పత్రములు ఇచ్చి ప్రభుత్వ ప్రతిపాదనను ఉపసంహరించుటకు చర్యలు తీసుకునే విధంగా ప్రభుత్వ పెద్దలకు తెలియజేయవలసిందిగా విజ్ఞప్తి చేయాలని తీర్మానించడం మేరకు వినతి పత్రములు ఎన్. ఏం. యు. ఎ. రాష్ట్ర కమిటీ ఇచ్చి ఉన్నారు. వందలకోట్ల రూపాయలు నష్టం కలిగించే ప్రయాణికులకు ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలిగే ప్రభుత్వ ప్రతిపాదనకు నిరసనగా ఉద్యోగులలో ఉన్న ఆందోళన , అశాంతి మరియు అభద్రతాభావం మేరకు 26.07.2025 ,27.07.2025 తేదీలలో రెండు రోజులు రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోలు మరియు కార్యాలయాలలో ఉద్యోగులందరూ ఎర్ర బ్యాడ్జీలు ధరించి ప్రభుత్వ ప్రతిపాదన కు తీవ్రమైన అభ్యంతరం తెలియజేస్తూ నిరసన తెలియజేయాలని తీర్మానించిన మేరకు ఈరోజు%శ్రీ% రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఎమ్మిగనూరు డిపో కార్యదర్శి ముస్తాక్ అహ్మద్ సహాయ కార్యదర్శి షరీఫ్ గారాల ఆధ్వర్యంలో ఎర్ర బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.

# ఆగస్టు నెలలో తెలుగుదేశం పార్టీ మంత్రి వర్గ విస్తరణలో భాగంగా



**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**

ఎమ్మిగనూరు జులై 26 శనివారము నియోజకవర్గం శాసనసభ్యులు పిఎసి సభ్యులు మరియు రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బి వి జయ నాగేశ్వర రెడ్డి గారికివెనుకబడిన రాయలసీమ ప్రాంతం నుండి అవ్వకాశం కల్పించాలని7వ వార్డు కౌన్సిలర్ ఎరుకల సుంకమ్మ అధ్వర్యంలో 7వ వార్డ్ టిడిపి నాయకులు మరియు ఆంధ్రప్రదేశ్ ఎరుకల సేవా సంఘం నాయకులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారిని కోరుతున్నాముబడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మాజీ మంత్రి వర్యులు స్వర్గీయ బి వి మోహన్ రెడ్డి ఎమ్మిగనూరు నియోజకవర్గం నుండి గెలిచి ఎన్నోసార్లు మంత్రి పదవి పొంది ఎమ్మిగనూరు నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడిపించాడు ఆయన వారసత్వంగా రాజాకీలలోకి వచ్చి నియోజకవర్గాన్ని చుట్టి ప్రతి సమస్యను తెలుసుకొని ప్రజలకు ఏ ఇబ్బందులు రాకుండా చేస్తున్న నాయకులు నియెజక వర్గాన్ని అభివృద్ధి పరుగులు పెట్టిస్తున్న నాయకులు బడుగు బలహీన వర్గాలకు ఆసరాగా నిలచిన నాయకులు డాక్టర్ బి వి జయ నాగేశ్వర రెడ్డి గారు ఆయనకు మంత్రి పదవి ఇస్తే నియెజకవర్గంలో మరియు రాష్ట్ర స్థాయిలో అయన సేవలను ప్రజలు వినియోగించుకోవచ్చు అని మా యొక్క విన్నపం

# అమరావతిలో మాచాని సోమప్ప భవన్ నిర్మించాలి

**. కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**



ఎమ్మిగనూరు జులై 26 శనివారము పట్టణ పితామహుడు, దేశవ్యాప్తంగా చేసిన సేవలకు గుర్తింపుగా పద్మశ్రీ అందుకున్న దివంగత (చేనేత మాచాని సోమప్ప గారి పేరున చేనేత భవన్ ను రాష్ట్ర రాజధాని అమరావతి లో నిర్మించాలని నేను ఈరోజు రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి విన్నపం పంపాను. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ లోని నాంపల్లి ప్రధాన రహదారిలో చేనేత భవన్ (హ్యాండ్లూమ్ హౌస్) కు మాచాని సోమప్ప భవన్ గా నామకరణం చేశారు. అది చూసిన మన ప్రాంతం వారికి గర్వకారణంగా ఉండేది. చేనేత సహకార రంగంలో సోమప్ప గారి కృషి దేశాన్ని ఆకర్షించింది... మార్గదర్శకం అయింది. రాష్ట్రం విడిపోయిన తర్వాత మాచాని సోమప్ప భవన్ పేరున హ్యాండ్లూమ్ హౌస్ లేకుండా పోయింది. కావున చంద్రబాబు నాయుడు గారు కల్పించుకొని అమరావతిలో ఐదు ఎకరాలు కేటాయించి పద్మశ్రీ మాచాని సోమప్ప భవన్ పేరుతో హ్యాండ్లూమ్ హౌస్ నిర్మించాలని ఆ ప్రాంగణంలో సోమప్ప గారి విగ్రహం నెలకొల్పి ఆయన పేరు శాశ్వతంగా ఉండలాగున చేయాలని కోరుతున్నాను. ఈ విషయంలో ఎంజి కుటుంబ సభ్యులు మరియు ఎమ్మెల్యే నాగేశ్వర రెడ్డి సహకరించాలని కోరుతున్నాను. ఇట్లు కోనేరు నాగేంద్ర ప్రసాద్.

# కుదిపేస్తున్న ధరల దాడి..ద్రవ్యోల్బణం !



దేశంలో ద్రవ్యోల్బణ పరిస్థితులను నివారించడంలో పటిష్టమైన చర్యలు తీసుకోవడం లేదు. రూపాయి మారకం విలువ నానాటికి దిగజారుతోంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం 84 రూపాయలు దాటింది. ధరలు స్వారీ చేస్తున్నాయి. ప్రధానంగా బియ్యం,ఉప్పు,పప్పుల ధరలు విపరీతంగా పెరుగుతున్నా అజమాయిషీ చేయడంలేదు. ధరలను కంట్రోల్ చేయడం తమ పని కాదన్న రీతిలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయి. ధరలను అదుపు చేసే యంత్రాంగం లేకుండా పోయింది. పాలకులకు ఇది పని కాదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. మరీ ముఖ్యంగా మోడీ పాలనలో గత పదేళ్లుగా అన్నిరకాల వస్తువుల ధరలు, మందుల ధరలు దాడి చేస్తున్నా పట్టించుకోవడం లేదు. జివిఎస్టీ గురించి సమీక్షించకుండా నిరంకుశం గా వ్యవహరిస్తున్నారు. దీనికితోడు నిత్యావసర ధరలతో పాటు, నిత్యం వాడే మందుల ధరలు కూడా ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయి. ఇవన్నీ వాటంతట అవే పెరుగుతున్నాయని అనుకోవడానికి లేదు. అయినా నియంత్రించే వ్యవస్థ లేకుండా పోయింది. వ్యాపారులపై అజమాయిషీ లేకపోవడంతో ధరలతో దాడి చేస్తున్నారు. పేదవాడు మరింత పేద వాడుగా, ధనవంతులు మరింత ధనవంతులగా మారుతున్నారు. పేదరిక నిర్మూలన గురించి మాట్లాడుతున్న మోడీ సర్కార్ ఈ పరిస్థితులను సమీక్షించడం లేదు. ఎక్కడ పేదరికం పోయిందో చెప్పడం లేదు. పేదరికం పోతే పేదలకు ఉచిత బియ్యం పంపిణీ ఎందుకు చేస్తున్నారో చెప్పడం లేదు. వ్యవసాయోత్పత్తులను పెంచి, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడం ద్వారా దేశంలోని పేదలకు అన్నం పెట్టాలన్న ప్రణాళికలకు అడుగులు పడడం లేదు. సహజంగానే వ్యవసాయిక దేశమైన భారత్‌లో ఉన్న నేలలు అన్ని పంటలకు అనువుగా ఉన్నాయి. సహజవనరులు కూడా ఉన్నాయి. పరిమితంగా ఉన్న వనరులను సమర్ధవంతంగా ఉపయోగించడం వంటి విధానాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పాటించట్లేదు. పథకాల పేరుతో పంచడం తప్ప, ఆదాయం పెంచే మార్గాలను అన్వేషించడం లేదు. నీటి వనరులను సద్వినయోగం చేసే దిశగా సాగడం లేదు. వ్యవసాయోత్పత్తులు పెరుగు తున్నా వాటిని ప్రజలకు చేరవేయడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయి. అలాగే వ్యవసాయ అనుబంధ రంగాలను ప్రోత్సహించి..వేదేశీ మారక ద్రవ్యం సంపాదించేలా ప్రణాళికలు లేకుండా పోయాయి. వ్యవసాయ అభివృద్ధి, పరిశ్రమల అభివృద్ధి కుంటుపడటమే ధరలు నానాటికీ పెరగడానికి కారణంగా చూడాలి. ఇబ్బడిముబ్బడిగా ఉచిత పథకాలు, డబ్బుల పందేరంతో ప్రజలను సోమరులుగా తయారు చేస్తున్నారు. అన్నింటికీ ప్రభుత్వాలపై ఆధారపడేలా చేస్తున్నారు. పేదరికానికి మూలం ప్రభుత్వ విధానాలే అన్నది గుర్తించడం లేదు. ప్రజలను దేశ ఉత్పత్తిలో భాగస్వాములుగా చేయడం అన్నది పక్కన పెట్టేశారు. ప్రజలను చైతన్యవంతులుగా, విజ్ఞానవంతులుగా, ఆలోచనా పరులుగా, అవగాహనాపరులుగా చేస్తే తమకు ముప్పు అన్న ఆలోచనలో రాజకీయ పార్టీల నేతలు, పాలకులు ఉన్నారు. భారతదేశంలో ఆర్థిక, సామాజిక, రంగాల అభివృద్ధి జరుగుతుందని అనుకుంటున్నా అది ఎంతన్నది ...మన ఆర్థికాభివృద్ధిని లెక్కలేసుకుంటే కొంతేనని తెలుతుంది. భారతదేశ ఆర్థిక వ్యవస్థ నానాటికీ దిగజారి చివరకు ఎటుదారితీస్తుందోఅన్న భయం కలుగుతోంది. దారిద్ర్య సూచికలో భారతదేశం 107వ స్థానానికి పడిపోయింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో దేశ స్థితిని దారిద్ర్యం వైపు, దివాళాకోరుతనం వైపు చూడడానికి ఒక అవకాశం కలిగింది. ఈ విధంగా భారతదేశం దిగజారిపోవడానికి కారణం పాలకవర్గం తీసుకుంటున్న తిరోగమన చర్యలే అని చెప్పక తప్పదు. కార్పొరేట్ శక్తులు, బ్యాంకులకు డబ్బులు ఎగవేసిన వాళ్ళు, అవినీతి అధికారులు, దోపిడీని కొనసాగిస్తున్న రాజకీయ నాయకులే అత్యధికం. భారతదేశం ఎందుకు ఆర్థికంగా సంక్షోభంలో వుందని పరిశీలిస్తే పాలకుల తిరోగమన విధానాలు కారణంగా చెప్పుకోవాలి. వ్యవసాయ పశు గుణాభివృద్ధి ద్వారా భారతదేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే అవకాశాలను ఎవరు కూడా పట్టించు కోవడం లేదు. గ్రామీణ అర్థిక వ్యవస్థకు ఊతంగా ఉండే వ్యవసాయ రంగాన్ని,పాడి పరిశ్రమను శాస్త్రీయంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వాలు కృషి చేయడం లేదు. రైతులను, రైతు కూలీలను నిరంతరం సంక్షోభంలో ముంచుతున్నారు. దేశంలో వ్యవసాయ భూమి విస్తరించట్లేదు. పేద ప్రజలకు భూములు ఇవ్వడంలేదు. పాలకవర్గాలు వీటన్నింటినీ విస్మరించడం వల్లే ఈ రోజున పేదరికం పెరిగిపోతోంది. వ్యవసాయాన్ని అభివృద్ధి చేసే వివిధ ప్రణాళికలు కేవలం కాగితాలకే పరిమితం అయ్యాయి. వ్యవసాయ రంగంలో అధిక ఉత్పత్తి సాధించడం, ఆహార వస్తువుల ధరలస్థిరీకరణ సాధించడం,పేద ప్రజలకు ఆహార భద్రత కలిగించడం, వ్యవసాయదారులు, వినియోగదారుల ప్రయోజనాల మధ్య సమతూకం సాధించడం వంటివి ముందుకు సాగడం లేదు. ముఖ్యంగా సంస్కరణలు వృద్ధిరేటును పెంచినప్పటికి నిరుద్యోగ నిర్మూలనకు పెద్దగా తోడ్పడలేదు. ముఖ్యంగా సంఘటిత రంగంలో ఉపాధి తగ్గిపోతున్నది. రెగ్యులర్ ఎంప్లాయిస్ తగ్గుతూ క్యాజువల్ లేబర్ పెరుగుతున్నారు. క్యాజువల్ లేబర్‌ను, ప్రభుత్వ ఉద్యోగులను రెగ్యులర్ ఉద్యోగులుగా మార్చకపోవడం వలన వారు అభద్రతలో వున్నారు. సమగ్రాభివృద్ధి చెందాలి అంటే పారిశ్రామిక అభివృద్ధి ద్వారానే సాధ్య మని గుర్తించి ముందుకు సాగాలి. వ్యవసాయఅభివృద్ధికి చర్యలు తీసుకోవాలి. విప్లవాత్మక చర్యలకు పూను కోవాలి. అలాగే పాడి రంగాన్ని, కోళ్ల పరిశ్రమల అభివృద్ధి తదితర రంగాలను ప్రోత్సహించాల్సి ఉంది.

# గురివింద సామెత చందంగా కెటిఆర్ వ్యవహారం !

తప్పులెన్నువారు తమ తప్పులెరుగరయా ..అని వేమన ఏనాడో చెప్పాడు. ఇది అచ్చంగా బిఆర్ఎస్ నేతలకు వర్తిస్తుంది. మరీ ముఖ్యంగా కెటిఆర్, హరీష్ రావులకు అచ్చుగుద్దినట్లుగా ఉంటుంది. మొగుణ్ణి కొట్టి మొగుసాలకు ఎక్కిందన్నది సామెత. చేసిన తప్పులన్నీ చేసి..ఇప్పుడు కాంగ్రెస్ మీదపడి ఏడుస్తున్నారు. పదేళ్ల పాపాల గురించి మాట్లాడరు. తమ పాలనలో అవినీతి వ్యవహారాల గురించి సమాధానం చెప్పరు. తమ పాలనలో మల్లన్నసాగర్ రైతులు తిరగబడితే ఎందుకు కేసులు పెట్టారో చెప్పరు. ఖమ్మం జిల్లాలో రైతులపై ఎందుకు కాల్పులు జరిపారో..ఎందుకు బేడీలు వేశారో చెప్పరు. కాళేశ్వరం అవినీతిపైనా మాట్లాడారు. వికారబాద్ జిల్లాలో రైతులను రెచ్చగొట్టిన ఘటనకు సమాధానం చెప్పాలి. నిజానికి ఫార్మా కంపెనీల సృష్ట ప్రదాత కెటిఆర్. దానిని ఎవరూ కాదనలేరు. రైతుల భూములను అడ్డంగా లాక్కుని వ్యాపారం చేయడం ఎవరు చేసినా నిలదీయాల్సిందే. కానీ బిఆర్ఎస్ కాదు. అది ప్రజలకు వదిలేయాలి. అవినీతి నేతలు నీతులు వల్లించడం సరికాదు. ఎందుకంటే బిఆర్ఎస్ గురించి చెప్పుకుంటూ పోతే కోకొల్లలుగా అవినీతి కథలు ఉన్నాయి. కానీ ఎదురుదాడి చేయడం, గగ్గోలు పెట్టడం ద్వారా పదినెలల ప్రభుత్వంలో అవినీతి జరిగిందని అంటున్నారు. నిజంగానే అవినీతి జరిగితే బయటకు లాగుదాం. కానీ పదేళ్ల అవినీతి గురించి చర్చించకుండా..కేవలం పది నెల్లలోనే అవినీతి జరిగిందని చెప్పడం గురివింద సామెతను గుర్తు చేస్తోంది. ముందుగా పదేళ్ల అవినీతిపై ఊరూవాడా చర్చిద్దాం. ఎవరెవరి భూములు పోయాయో, ధరణితో ఎంతమందిని మోసం చేశారో చర్చిద్దాం. అవినీతిపై చర్చలో బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి నేతలు ఎవరున్నా వదిలిపెట్టకుండా ర్చబండ ఏర్పాటు చేస్తే మంచిది. తెలంగాణలో బీఆర్ఎస్ అధికారం కోల్పోవడం, ఆ తర్వాత పార్టీలోని కొందరు కీలక నేతలు కారు దిగి కాంగ్రెస్‌లో చేరడం వంటి పరిణామాలతో సహజంగానే పార్టీలో కొంత నీరసం ఆవహించింది. ఎంపీ ఎన్నికల్లో ఒక్క సీటు గెల్చుకోక పోవడం కూడా గులాబీ పార్టీకి రాజకీయంగా భారీ దెబ్బ పడింది. ఆ తర్వాత కొద్ది పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, మాజీ మంత్రులు పార్టీ మారడంతో కారు పార్టీలో నిస్తేజం నిండింది. మరోవైపు ఎమ్మెల్సీ కవిత అరెస్టు కావడం, బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ రాజకీయ మౌనం పార్టీ శ్రేణులను అయోమయానికి గురిచేస్తున్నాయి. ప్రతిపక్ష నేతగా చురుకుగా ఉండాల్సిన కెసిఆర్ ఇంటికే పరిమితం కావడం దారుణం కాక మరోటి కాదు. అధికారం లేకుంటే అసెంబ్లీలో అడుగు పెట్టమన్న రీతిలో కెసిఆర్, జగన్ తీరు ఉంది. ఈ క్రమంలో తమపై అవినీతి కేసుల దాడి పెరగడంతో ఆత్మరక్షణ కోసం బిఆర్ఎస్ విన్యాసాలు చేస్తోంది. ఎదురుదాడిని ఎంచుకుంది. ఇవన్నీ ప్రజలు నమ్ముతారని అనుకుంటే అవివేకం తప్ప మరోటి కాదు. ఇవన్నీ ఎక్కడ మెడకు చుట్టుకుంటాయో అన్న భయంతోనే కెటిఆర్ గత కొద్ది రోజులుగా దూకుడుగా వ్యవహరిస్తున్నారు. కేటీఆర్, హరీశ్ రావులు ఇద్దరూ అధికార కాంగ్రెస్ లక్ష్యంగా విమర్శలు చేస్తున్నారు. అంశాలవారీగా కాంగ్రెస్ ను ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. తమ పార్టీ ఎమ్మెల్యేల చేరిక విషయంలో న్యాయస్థానంలో సవాల్ విసిరారు. గతంలో ఎమ్మెల్యేలను మరి గొర్రెల్లాగానే కొనుగోలు చేశారా అన్నది చెప్పాలి. నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో వరదలు, రైతుల రుణ మాఫీ, హైడ్రా కూల్చివేతలు, మూసీ ప్రక్షాళన,ఎమ్మెల్యే కౌషిక్ రెడ్డి వర్సెస్ ఎమ్మెల్యే అరికలపూడి గాంధీ సవాళ్ల వంటి అంశాలపై గగ్గోలు చేస్తున్నారు. ఇంత ప్రజాస్వామ్యయుతంగా మాట్లాడుతున్నారంటే అది రేవంత్ రెడ్డి సర్కార్ కల్పించిన స్వేచ్ఛ అని చెప్పక తప్పదు. గతంలో జర్నలిస్టులను మాట్లాడనీయలేదు. సోషల్ మీడియా వారిపైనా కేసులు పెట్టారు. వేధింపులు చేశారు. సిఎంను కలవకుండా చేశారు. మంత్రుల దగ్గరకు రాకుండా కట్టడి చేశారు. ఇన్ని మాట్లాడుతున్న కెటిఆర్ తన హయాంలో జరిగిన అవినతి కేసుల గురించి ముందుగా సమాధానం చెప్పాలి. ఫార్ములా ఈ రేస్ వ్యవహారంలో విదేశీ కంపెనీకి అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ రూ.55 కోట్లు నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చారని, ఈ కేసులో ఏసీబీ విచారణ చేస్తోంది. ఈ క్రమంలో కెటిఆర్‌ను ఎసిబి అరెస్టు చేస్తోందని కాంగ్రెస్ మంత్రులు గత కొద్ది రోజులుగా చెబుతున్నారు. అరెస్టుపై గవర్నర్ అనుమతి తీసుకున్నారని త్వరలోనే కేటీఆర్ అరెస్టు అవడం ఖాయమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బహిరంగ ప్రకటనలు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో మంత్రి కేటీఆర్ ఢిల్లీ యాత్ర అందరినీ ఆకర్షించింది. అరెస్టు నుండి తప్పించుకోవడానికి మోదీ ప్రభుత్వ సాయం కోసమే ఢిల్లీ వెళ్లారని, ఇందుకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటన చేశారు. గతంలో ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కవితకు బెయిల్ ఎలా వచ్చిందో కూడా తమ వద్ద ఆధారాలున్నాయని చెప్పడం గమనార్హం. ఇలా తెలంగాణలో రాజకీయ వాతావరణం వేడెక్కిన సమయంలో కేటీఆర్ ఢిల్లీలో కాలుపెట్టడం మరింత సంచలనానికి దారి తీసింది. బిజెపితో బిఆర్ఎస్‌కు లోపాయకారి ఒప్పందం ఉందని అందరికీ తెలిసిదే. బీజేపీ నేతలతో మంతనాలు జరిపేందుకేనా అన్న ఊహాగానాలు చెలరేగాయి. ఈ క్రమంలో తెలంగాణలో తనపై వస్తున్న ఆరోపణల దృష్ట్యా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే విధంగా మంత్రి కేటీఆర్ అమృత్ టెండర్ల వ్యవహారన్ని తెరపైకి తెచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి అమృత్ పథకంలో స్కాంకు తెరలేపారని ఆరోపించారు. అమృత్ పథకంలో పనులకు గాను 8888 కోట్ల టెండర్లను పిలిచిన రేవంత్ రెడ్డి తన బావమరిది సృజన్ రెడ్డి కంపెనీ కట్టబెట్టారని కేంద్ర పురపాలక శాఖ మంత్రి మనోహర్ లాల్ కట్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను ఆయనకు అందజేశారు. పార్లమెంట్ సమావేశాల్లోగా రేవంత్ సర్కార్ పై చర్యలు తీసుకోవాలని ఢిల్లీ వేదికగా కేటీఆర్ డిమాండ్ చేశారు. అంతే కాకుండా రెవెన్యూ మంత్రి పొంగులేటికి సంబంధించిన స్కాంలను బయటపెడతానని హెచ్చరించారు. తప్పులేదు. రేవంత్, పొంగులేటిలు తప్పు చేసివుంటే కోర్టుకీడ్చాల్సిందే.

# ఈ సారి కేడర్ కు ప్రాధాన్యం

కడప:వైసీపీ అధినేత జగన్ మొన్నటి ఎన్నికలతో చాలా వరకూ డీలా పడిపోయారు. ఆయన ఊహించని అపజయాన్ని చవి చూశారు. ఆయన అంచనాలకు అందని ఓటమి ఇది. ఎన్నికలకు సంబంధించి ఈవీఎంలు కారణమని ఆయన చెబుతున్నప్పటికీ ప్రజల్లో కూడా కొంత వ్యతిరేకత వస్తుందని ఆయనకు అర్థమయింది. క్యాడర్ కూడా తమకు సరిగా సహకరించలేదని పూర్తిగా అర్థమయింది. సొంత జిల్లా కడపతో పాటు రాయలసీమలోని అన్ని జిల్లాల్లో కూటమి దాదాపు ఎక్కువ స్థానాలలో విజయం సాధించడంతో ఆయనకు ఏం జరిగిందో కూడా అర్థం కావడం లేదు. కనీసం ఓటమికి గల కారణాలను వెతుక్కునేందుకు కూడా జగన్ సిద్ధపడటం లేదు. ఎందుకంటే ఏ కారణం వెతికినా.. చివరకు ఓటమికి ప్రధాన కారణం తనవైపు అన్ని వేళ్లు చూపిస్తుండటమేనని అనుకోవాలి. తన పోకడ వల్లనే వైసీపీ క్యాడర్ దూరమయిందని ఆయనకు తెలిసినా జరగాల్సిన నష్టం జరిగిపోయింది. అందుకే ఈసారి అధికారంలోకి వస్తే కార్యకర్తలకు ప్రాధాన్యత ఇస్తానని పదే పదే చెబుతున్నారు. సామాజిక వర్గాల నినాదం కూడా పనిచేయలేదు. అభ్యర్థులను మార్చినా ఫలితం మారలేదు. ఎన్ని కోట్ల రూపాయలు బటన్ నొక్కి లబ్దిదారుల ఖాతాల్లో చెప్పిన సమయానికి జమ చేసినా ఈవీఎంల బటన్ మాత్రం తనకు అనుకూలంగా పడలేదు. దీంతో తాను చేసిన తప్పొప్పులను జగన్ లోలోపల సమీక్షించుకునే పరిస్థితికి వచ్చారు. మరోవైపు ఒంటరిపోరాటం కూడా ఓటమికి ఒక కారణంగా ఆయన చూస్తున్నారు. చంద్రబాబు నాయుడు కూటమి గట్టినప్పుడల్లా విజయం సాధించి ముఖ్యమంత్రి అవుతున్నారు. ఓట్లు బదిలీ జరగడంతో పాటు పోలింగ్ కేంద్రాల వద్ద సరైన విధంగా ఏర్పాట్లు, క్యాడర్ అందుబాటులో ఉండేందుకు పొత్తు ఉపయోగపడుతుందన్నది చంద్రబాబు ఆలోచన కార్యరూపం దాల్చిన తర్వత జగన్ కూడా అర్థమయింది. అందుకే జగన్ ఆలోచనల్లో కూడా మార్పు వస్తున్నట్లు కనిపిస్తుంది. ఈసారి ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసే కంటే పొత్తులతో కలసి వెళ్లడం మంచిదన్న అభిప్రాయంతో జగన్ ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీని వల్ల ప్రతిపక్ష బలం పెరగడం అటుంచి.. నైతికంగా మద్దతు లభిస్తుందని ఆయన అభిప్రాయపడుతున్నారు. అయితే ఏ పార్టీతో పొత్తు పెట్టుకోవాలన్న దానిపై జగన్ ఇంకా ఒక నిర్ణయానికి రాలేదు. కాంగ్రెస్ తో చేతులు కలపలేరు. అలాగే కూటమిలో ఉన్న బీజేపీని బయటకు తెచ్చి పొత్తు పెట్టుకోలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో జగన్ చూపు వామపక్ష పార్టీలపై పడిందని చెబుతున్నారు. కొన్ని స్థానాలు ఇచ్చి కూటమి ఏర్పాటు చేసుకుంటే తనకు నైతిక బలం పెరుగుతుందని, వాయిస్ కూడా ఎక్కువవుతుందని జగన్ భావిస్తున్నట్లు తెలియవచ్చింది. అయితే ప్రతిపాదన వారి నుంచి వస్తే జగన్ కాదనలేని పరిస్థితిలో ఉన్నారు. జగన్ మాత్రం నేరుగా వారి వద్దకు పొత్తుకు రా.. రా రమ్మని మాత్రం అడగరట. వామపక్షాలు వస్తామంటే కాదనరట.

# వైసీపీ ఎమ్మెల్యేల యూ టర్న్... అసెంబ్లీకి వెళ్దామంటూ సూచనలు

విజయవాడ:అసెంబ్లీకి వెళ్లేదే లేదని పార్టీ ఎమ్మెల్యేలను కూడా ఓ మాట అడగకుండా సొంతంగా నిర్ణయం తీసుకోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారుతోంది. వచ్చింది 11 సీట్లే అవడంతో టెక్నికల్ గా ప్రధాన ప్రతిపక్ష హోదా దక్కదు. మరి 40 శాతం ఓట్ షేర్ దక్కించుకున్న పార్టీ ప్రజల పక్షాన సభలో ఎలా నిలబడాలో తెలియదా అన్న ప్రశ్నలు వస్తున్నాయి. సభలో ఏదో జరుగుతుందని లేనిపోని డౌట్లు పెట్టుకుని వెళ్లకుండా ఉండడం ఏంటని అంటున్నారు. చంద్రబాబుకు 23 మంది సభ్యులు ఉన్నారు. ఐదుగురిని లాగేస్తే 17-18 మంది అవుతారు. అప్పుడు ఆయనకు ప్రతిపక్ష నేత హోదా కూడా ఉండదు లాగేద్దాం అని కొందరన్నారని, అలా చేసి ఉంటే ఆయనకు ప్రతిపక్ష నేత హోదా కూడా ఉండేది కాదు. అక్కడ కూర్చుని ఉండేవారు కాదంటూ మాట్లాడారు. అంటే ప్రతిపక్ష హోదా దక్కాలంటే ఏ పార్టీకైనా 10 శాతం సీట్లు ఉండాలన్నది అందరికి తెలిసిన లెక్కే కదా. మరి ఇప్పుడు 11 సీట్లతో ప్రధాన ప్రతిపక్ష హోదా అడగడమే అసలైన వింతవాదన.ఇప్పుడు అసలు టాపిక్ ఏంటంటే.. అసెంబ్లీకి వెళ్లేది లేదని జగన్ అంటున్నారు. దూరంగా ఉంటున్నారు కూడా. కారణం.. అందరు ఎమ్మెల్యేల మాదిరే తనకు కూడా 2 నిమిషాలే మైక్ ఇస్తారని, కావాలనే తనకు ప్రతిపక్ష నేత హోదా ఇవ్వలేదని చెబుతున్నారు. మాజీ సీఎం అసలు అసెంబ్లీకి వెళ్లను అనడానికి ఇదే మెయిన్ రీజనా.. మరేదైనా ఉందా అన్న విషయం చుట్టూ చర్చ జరుగుతోంది. అయితే తెరవెనుక లెక్కలు చాలానే ఉన్నాయంటున్నారు. ఏపీ అసెంబ్లీలో సీట్లు గెలిచినవి నాలుగే పార్టీలు. అందులో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేశాయి. అవి అధికార పక్షం. మరి సభలో ప్రజా సమస్యలపై మాట్లాడాల్సింది వైఎస్సార్ సీపీ మాత్రమే. కానీ తాము అక్కడ మాట్లాడం.. సభ బయటే మాట్లాడుతాం అంటోంది వైసీపీ. నిజానికి అసెంబ్లీకి వెళ్లకూడదు అన్న నిర్ణయం తీసుకోవడంపై వైసీపీలో అంతర్గతంగా రకరకాల చర్చలు జరుగుతున్నాయి.ఏ పార్టీ అయినా ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాలి. నేను అక్కడికి రాను.. ఇక్కడికి రాను.. అనడం ప్రజాస్వామ్యానికే పెద్ద ముప్పు అన్న వాదన కూడా పెరుగుతోంది. రైట్.. వైసీపీ అధినేత జగన్ సభకు వెళ్లకూడదని బలమైన నిర్ణయం తీసుకున్నారు. బాగానే ఉంది.. మరి మిగితా 10 మంది ఎమ్మెల్యేల అభిప్రాయం అసలు తీసుకున్నారా లేదంటే ఏకపక్షంగా తన నిర్ణయాన్ని అందరిపై రుద్దారా అన్న చర్చ పార్టీలో అంతర్గతంగా నడుస్తోంది. కొత్త ప్రభుత్వం వచ్చి ఆర్నెళ్లు కూడా కాలేదు. ఇప్పటి నుంచే సభకు వెళ్లకుండా ఉండడం అంటే రాజకీయంగా పార్టీకి పెద్ద దెబ్బే పడుతుందన్నది టాక్. ప్రజాస్వామ్యబద్ధంగా ఎమ్మెల్యేగా ఎన్నికై? ప్రజాసమస్యలు ప్రస్తావించాల్సిన అసెంబ్లీకి హాజరుకాకపోతే ప్రజలు మనల్ని క్షమించరేమో అని అటు ఓడిపోయిన ఎమ్మెల్యేలు, గెలిచిన వైసీపీ ఎమ్మెల్యేలు తెగ బాధపడిపోతున్నారట.

# పండగల్లో దసరాకు విశిష్ట స్థానం !

దసరా హిందువుల ముఖ్యమైన పండుగ. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుండి ఆశ్వయుజ శుద్ధ నవమి వరకు తొమ్మిది రోజులు దేవీ నవరాత్రులు పదవరోజు విజయ దశమి కలసి దసరా అంటారు. ఇది ముఖ్యముగా శక్తి ఆరాధనకు ప్రాధాన్యత ఇచ్చే పండుగ. ఈ పండుగను నవరాత్రి, శరన్నవరాత్రి అని అంటారు. శరదృతువు ఆరంభంలో వచ్చే పండుగ కనుక ఈ పేరు వచ్చింది. కొందరు ఈ పండుగకు మొదటి మూడు రోజులు పార్వతిదేవికి, తరువాతి మూడు రోజుల లక్ష్మీ దేవికి, తరువాత మూడురోజులు సరస్వతి దేవికి పూజలు నిర్వహిస్తారు. ముఖ్యముగా శాక్తేయులు దీనిని ఆచరిస్తారు. విజయదశమి రోజున చరిత్ర ప్రకారం రాముడు రావణుని పై గెలిచిన సందర్భమే కాక పాండవులు వనవాసం వెళ్తూ జమ్మి చెట్టుపై తమ ఆయుధాలను తిరిగి తీసిన రోజు. ఈ సందర్భమున రావణ వధ, జమ్మి ఆకుల పూజా చేయటం రివాజు. జగన్మాత అయిన దుర్గాదేవి, మహిషాసురుడనే రాక్షసునితో 9 రాత్రులు యుద్ధము చేసి అతనిని వధించి జయాన్ని పొందిన సందర్భమున 10వ రోజు ప్రజలంతా సంతోషంతో పండగ జరుపుకున్నారు. అదే విజయదశమి.


హిందువులు జరుపుకునే పండగలలో దసరా పండగకు విశిష్ట స్థానం ఉంది. ఆశ్వయుజ మాసం శుక్లపక్షంలో మొదటి తొమ్మిది రోజులను దసరా నవరాత్రులు, దేవీ నవరాత్రులు లేక శరన్నవరాత్రులు అని అంటారు. ఈ దసరా ఉత్సవాన్ని నవరాత్రులుగా తొమ్మిది రోజులు పాటు జరుపుకుని.. 10వ రోజున దసరా లేదా విజయదశమిగా జరుపుకుంటారు. ఈ తొమ్మిది రోజులు శక్తిస్వరూపిణి అయిన దుర్గాదేవి అవతారాలను అంటే నవదుర్గలను అత్యంత భక్తీ శ్రద్దలతో పూజిస్తారు. ఈ దేవీ నవరాత్రులలో చివరి మూడు రోజులు, దుర్గాష్టమి, మహర్నవమి, విజయదశమిగా జరుపుకుంటూ విద్యార్థులు పుస్తకాలూ, పెన్నులను పూజిస్తే, శ్రామికులు తమ పనిముట్లను పూజిస్తారు. ఇక క్షత్రియులు ఆయుధ పూజ చేసి.. అమ్మవారి కృపకు పాత్రులవుతారు. దుర్గాదేవి మహిషాసురమర్దనిగా అవతరించి రాక్షసుని మీదకు దండెత్తి విజయం సాధించింది. అంతేకాదు రాముడు రావణ సంహారం చేసింది దసరనే.. కనుక పూర్వం రాజులు తమ దండయాత్రకు దసరా పండగానే శుభ ముహూర్తంగా ఎంచుకునే వారని తెలుస్తోంది. దేవీ పూజ ప్రాధాన్యత ఈశాన్య భారతదేశంలో హెచ్చుగా ఉంటుంది. దైత్యవంశానికి ఆశాదీపంలా జన్మించిన 'మహిషాసురుడు' తన ఆంతరంగిక మిత్రులతో, సచివులతో సమాలోచన చేసి, మరణంలేని జీవనం కోసం మేరుపర్వతశిఖరం చేరి బ్రహ్మదేవుని గూర్చి ఘోరతపస్సు ప్రారంభించాడు. కాలం కదలికలో అనేక వేల సంవత్సరాలు కదిలి వెళ్లిపోయాయి. మహిషాసురుని అచంచల తపస్సుకు సంతసించిన బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై, 'మహిషాసురా.., ఇంక తపస్సు చాలించి ఏ వరం కావాలో కోరుకో' అన్నాడు.'పితామహా.,నేను అమరుణ్ణి కావాలి. నాకు మరణం లేని జీవితాన్ని ప్రసాదించు' అని కోరాడు మహిషాసురుడు. అప్పుడు బ్రహ్మదేవుడు 'మహిషాసురా..పుట్టిన ప్రాణి గిట్టక తప్పదు.., గిట్టిన ప్రాణి మరల పుట్టక తప్పదు. జననమరణాలు సకలప్రాణికోటికి సహజ ధర్మాలు. మహాసముద్రాలకూ, మహాపర్వతాలకూ కూడా ఏదో ఒక సమయంలో వినాశం తప్పదు.

ప్రకృతివిరుద్ధమైన నీ కోరిక తీర్చుట అసంభవం. కనుక,నీ మరణానికి మృత్యువుకు ఒక మార్గం విడిచిపెట్టి, మరే వరమైనా కోరుకో' అన్నాడు. అప్పుడు మహిషా సురుడు 'విధాతా..అల్పమైన కోరికలకు ఈ మహిషాసురుడు ఆశపడడు. సరే.. ఆడది నా దృష్టిలో అబల..ఆమెవల్ల నాకే ప్రమాదమూ రాదు. కనుక.,పురుషుడి చేతిలో నాకు మరణం రాకుండా వరం అనుగ్రహించు' అని కోరాడు.

# మర్రికుంట గ్రామంలో మూడు ఇళ్లలో చోరీ

- వరుస దొంగతనాలతో మర్రికుంట గ్రామ ప్రజలు బెంబేలు

**బేతంచర్ల : ఉత్తేజిత ప్రతినిధి**



బేతంచర్ల మండల పరిధిలోని మర్రి కుంట గ్రామంలో శుక్రవారం రాత్రి మూడు ఇళ్లలో చోరీ జరిగింది వివరాల్లోకి వెళ్తే వీరాయి పల్లె శివన్న,ఇంట్లో రూ 40 వేల నగదు కమ్మలు,వెండి పట్టీలు,అలాగే అంగుదాడు పెద్ద అయ్య స్వామి,ఇంట్లో రూ 50 వేల నగదును కమ్మలు అలాగే అంగుదాడు చిన్నయ్య స్వామి,ఇంట్లో చోరికి ప్రయత్నించినట్లు తెలిపారు.సమాచారం మేరకు ఎస్సై రమేష్ బాబు,సంఘటన స్థలానికి జాగిలాలతో వెళ్లి పరిశీలించారు.గతంలో కూడా అదే గ్రామంలో చోరీలు జరగడంతో

గ్రామ ప్రజలు భయాందోళన చెందుతున్నారు.గతంలో అదే గ్రామంలో బజారు పెద్ద మాధవస్వామి,ఇంట్లో చోరీ జరిగింది అయితే పోలీసులు కేసు నమోదు చేశారు.కానీ నిదితులను గుర్తించలేదు ఇప్పటికైనా పోలీస్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# షుగర్ లెవల్స్ పెరగకుండా..







క్రిస్మస్ రానే వచ్చింది. క్రిస్టియన్స్‌కి అతి పెద్ద పండుగ అయిన ఈ రోజున చాలా మంది స్వీట్స్ తింటారు. అలాంటప్పుడు షుగర్ ఉన్నవారు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకోండి. క్రిస్మస్, న్యూ ఇయర్‌కి షుగర్ లెవల్స్ పెరగకుండా ఇలా కంట్రోల్ చేసుకోండి.. క్రిస్మస్, న్యూ ఇయర్ బ్యాక్ టూ బ్యాక్ వస్తుంటాయి. ఈ టైమ్‌లో చాలా మంది స్వీట్స్‌తో సెలబ్రేట్ చేసుకుంటారు. అలాంటప్పుడు షుగర్ పెరిగే అవకాశం ఉంది. కాబట్టి, షుగర్ టెస్ట్ చేసుకోవడం ద్వారా మధుమేహాన్ని అదుపులో ఉంచుకోవాలి. షుగర్ ఉన్నవారు తమ ఆరోగ్యం పట్ల మరింత జాగ్రత్త తీసుకోవాలి. డాక్టర్ సూచించిన టైమ్‌కి ట్యాబ్లెట్స్ తీసుకోవడం, ఇన్సులిన్ తీసుకోవాలి. ఆహారం విషయంలో కూడా జాగ్రత్తలు పాటించాలి. అందులో కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి. అవేంటో తెలుసుకోండి.

స్వీట్స్ తినే ముందు..

దీంతో షుగర్ లెవల్స్ బ్యాలెన్స్ అవుతాయి. తిన్న వెంటనే షుగర్ లెవల్స్ పెరగవు. అయితే, షుగర్ కంట్రోల్ అవ్వని వారు భోజనానికి ముందు, తర్వాత షుగర్ లెవల్స్‌ని చెక్ చేసుకోవాలి. డైట్‌లో ఏం తినాలి.. వీలైనంత వరకు రెగ్యులర్ డైట్ ఫాలో అవ్వాలి. డైట్‌లో సాధారణ కార్బోహైడ్రేట్స్ తీసుకోండి.

గ్రిల్డ్ చికెన్, చేపలు, కూరగాయలు తీసుకోవచ్చు. సలాడ్ తినొచ్చు. జంక్ ఫుడ్ అవాయిడ్ చేయడం మంచిది. హైడ్రేటెడ్.. అదే విధంగా శరీరానికి సరిపడా నీటిని తీసుకోండి. ఇది డీహైడ్రేషన్ అవ్వకుండా కాపాడుతుంది. తక్కువ కేలరీలను వినియోగిస్తుంది. చక్కెర, ఉప్పుని తగ్గిస్తుంది. శరీరం డీహైడ్రేట్ అయితే గ్లూకోజ్ కంటెంట్ స్పీడ్‌గా మీ బాడీపై ఎఫెక్ట్ చూపిస్తుంది. అందుకే షుగర్ ఉన్నవారికి ఎక్కువగా దాహం ఉంటుంది. టైమ్‌కి తినడం.. ఫెస్టివల్ సీజన్‌లో సాధారణంగా పనిలో పడి తినరు. కానీ అలా చేయొద్దు. ఇలా భోజనం మానేస్తారు. దీని వల్ల షుగర్ లెవల్స్ మారుతుంటాయి. దీంతో వికారం, విరోచనాలు కూడా అయ్యే అవకాశం ఉంటుంది.

# స్నాక్స్ ఫ్రై చేసిన నూనెని ఇలా క్లీన్ చేయండి..







మనం సాధారణంగా చాలా పదార్థాలని నూనెలో ఫ్రై చేస్తుంటాం. ఈ నూనెని మళ్ళీ వాడాలంటే అందులో కొన్ని మిగిలిన పదార్థాలు అలానే ఉండిపోతాయి. ఈ నూనెని ఎలా క్లీన్ చేయాలో ఇప్పుడు చూద్దాం.

మనం స్నాక్స్ చేసినప్పుడు గిన్నె అడుగు భాగంలో నూనె అలా ఉండిపోతుంది. దీనిని పూర్తిగా క్లీన్ చేయాలంటే కొన్ని ఈజీ టిప్స్ ఉన్నాయి. దీని వల్ల గిన్నెలో మిగిలిన నూనెని క్లీన్ చేయొచ్చు. పైగా అడుగు భాగంలోని నూనెని కూడా పూర్తిగా వాడుకోవచ్చు. అదెలానో ఇప్పుడు చూద్దాం.


కార్న్‌ఫ్లోర్.. ముందుగా కార్న్‌ఫ్లోర్ తీసుకోండి. అందులో కొద్దిగా నీరు కలిపి బజ్జీ పిండిలా చేయాలి. దీనిని మరిగే నూనెలో వేయండి. అప్పుడు అది నూనె అడుగు భాగంలోకి వెళ్ళి పిండి తాలుకూ అవశేషాలను అతుక్కునేలా చేస్తాయి. దీంతో ఈజీగా వాటిని బయటికి తీసేస్తే పదార్థాల తాలుకూ మొత్తం అవశేషాలు వచ్చేసి నూనె క్లీన్ అవుతాయి.

మిగిలిన నూనెలో.. అదే విధంగా ఇప్పుడు క్లీన్ అయిన నూనెని మనం తీసి వాడుకోవచ్చు. ఇప్పుడు అడుగు భాగంలోని నూనె కూడా వేస్ట్ అవ్వొద్దనుకుంటే అందులో ఆమ్లెట్, దోశలు వేయొచ్చు. దీని వల్ల వల్ల నూనె మొత్తం మనం వాడినట్లుగా అవుతుంది.

గిన్నెని క్లీన్ చేయండి.. ఇప్పుడు ఈ గిన్నెల్ని మనం నిమ్మరసం, సబ్బుతో కలిపి క్లీన్ చేస్తే గిన్నె మొత్తం క్లీన్ అవుతుంది. జిడ్డు కూడా ఉండదు.

ఇవి మరువొద్దు.. అయితే, ఒక్కటి గుర్తుపెట్టుకోండి. ఒకసారి వాడిన నూనెని మరోసారి ఉపయోగించకపోవడమే మంచిది. ఈ నూనెని మళ్ళీ మళ్ళీ వాడడం వల్ల ఆరోగ్య సమస్యలొస్తాయి. కాబట్టి ఫ్రై చేసేటప్పుడే తక్కువ పరిమాణంలో ఫ్రై చేయడం, చేయాలి. ఎయిర్ ఫ్రైయర్స్ వాడండి. దీని వల్ల ఎక్కువగా నూనె వేస్ట్ అవ్వొదు. నూనె పదార్థాలు ఎక్కువగా వాడడం వల్ల అధిక బరువు, కొలెస్ట్రాల్ పెరుగుతుంది. అందుకే, వీలైనంత వరకూ ఈ ఆయిలీ ఫుడ్స్, స్నాక్స్‌కి దూరంగా ఉండడం మంచిది.

# పట్టు చీరలు ఇస్త్రీ చేసేటప్పుడు మర్చిపోవద్దు..



పట్టు చీరలు కట్టుకుంటే ఎంత బావుంటాయో అంతే అందంగా మెంటెయిన్ చేయాలి. ఇందులో భాగంగా వీటిని ఇస్త్రీ చేయాలంటే కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి. అవేంటో తెలుసుకోండి. ఇస్త్రీచేస్తే బట్టలు కొత్తవాటిలా మెరుస్తాయి. అందుకే పట్టు చీరలు ఎప్పటికీ కొత్తగా కనిపించాలంటే కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి. అందులో ఐరన్ కూడా ఒకటి. ఇంట్లోనే ఇస్త్రీ చేయాలంటే కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి. దీంతో పట్టు చీరలు ఎప్పటికీ కొత్తవాటిలానే కనిపిస్తాయి.

లేబుల్ చెక్ చేయడం.. ముందుగా పట్టు చీరలు కొనేటప్పుడే వాటి గురించి అడిగి తెలుసుకోండి. ఇస్త్రీ చేయొచ్చో లేదో అడిగండి. లేబుల్ ఉంటే దానిని చెక్ చేయండి. దీంతో చీరలు పాడవ్వకుండా చూడొచ్చు.


కాటన్ క్లాత్.. ఏదైనా పట్టు చీరలు ఐరన్ చేసేటప్పుడు వాటిపై కాటన్ క్లాత్ ఉంచి వాటిపై నుంచి ఐరన్ చేయండి. అప్పుడు ఎలాంటి ఇబ్బంది లేకుండా చీరలు కూడా చక్కగా ఐరన్ అవుతాయి.

సెట్టింగ్.. అదే విధంగా ఈ చీరల్ని ఐరన్ చేసేటప్పుడు ఐరన్ బాక్స్‌లోని సిల్క్ సెట్టింగ్ చేయాలి. దీని వల్ల చీరలకి తగ్గట్టుగా ఐరన్ చేయొచ్చు. అందుకే అందులోని సిల్క్ సెట్టింగ్ చేయండి. ముందుగా

బార్డర్.. చీరలు ఎప్పుడైనా ముందుగా బార్డర్ నుంచి ఐరన్ చేయాలి. తర్వాత చీరని మధ్యలో ఐరన్ చేయండి. అలా చేయడం వల్ల చీర చక్కగా ముడతలు పోతాయి. అయితే, ఎక్కువసేపు ఒకే దగ్గర పెట్టొద్దు. చీర కొంగుని మడిచి చక్కగా ఇరన్ చేయండి. చీర కొంగులో ఇలాంటి ఎలాంటి ముడతలు లేకుండా ఐరన్ చేయండి. ఐరన్ అయ్యాక.. ఐరన్ చేశాక చీరని మడతపెట్టొద్దు. హ్యాంగర్‌కి పెట్టి వేలాడదీయండి. అంతేకానీ, డ్రాయర్‌లో పెట్టొద్దు. దీంతో ఇలా ముడతలు ఏర్పడతాయి. అదే విధంగా, వీటిని ప్లాస్టిక్ కవర్‌లో పెట్టొద్దు. దీని వల్ల తేమ వస్తుంది. కాబట్టి, అలా పెట్టొద్దు.

# పెయిన్ కిల్లర్స్ వాడే బదులు వీటిని అప్లై చేస్తే నొప్పులు తగ్గుతాయ్..







మనకి కొన్నిసార్లు విపరీతమైన బాడీ పెయిన్స్ ఉంటాయి. అవి తగ్గించేందుకు పెయిన్ కిల్లర్స్ వాడుతుంటారు. వాటి వల్ల సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయి. అలా కాకుండా ఉండాలంటే కొన్ని టిప్స్ ఫాలో అవ్వొచ్చు. అవేంటో తెలుసుకోండి.

పెయిన్ కిల్లర్స్ వాడే బదులు వీటిని అప్లై చేస్తే నొప్పులు తగ్గుతాయ్.. కడుపు నొప్పి, తలనొప్పి ఇతర నొప్పులతో చాలా మంది బాధపడతారు. దీనికి అప్పటికప్పుడు రిలాక్స్ అయ్యేందుకు పెయిన్ కిల్లర్స్ వాడతారు. దీని వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొంటారు. సైడ్ ఎఫెక్ట్స్ వస్తుంటాయి. అలా కాకుండా నొప్పుల నుండి రిలాక్స్ అవ్వాలంటే కొన్ని మెడిసిన్స్ కాకుండా కొన్నిసహజ పద్ధతులు వాడొచ్చు. అవేంటో తెలుసుకోండి.

అల్లం, పసుపు.. అల్లంని మెత్తగా చేసి అందులో పసుపు కలిపి అప్లై చేయాలి. దీని వల్ల యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు సహజ నొప్పి నివారణిగా పనిచేస్తాయి. మంటను తగ్గించేందుకు నొప్పిని తగ్గించడంలో ఈ రెండు బాగా పనిచేస్తాయి.

కోల్డ్ కంప్రెస్.. నొప్పి, వాపుని తగ్గించేందుకు కోల్డ్ కంప్రెస్ ఓ సాధారణ, ఎఫెక్టివ్ మార్గం. ఓ ఐస్ క్యూబ్‌ని ఓ క్లాత్‌లో చుట్టి నొప్పిని ఉన్న ప్లేస్‌లో అప్లై చేస్తే రక్త నాళాలు శాంతించి వాపు, బెణుకులు తగ్గుతాయి. దీని వల్ల తీవ్రమైన గాయాలు కూడా తగ్గుతాయి. స్కిన్ ప్రాబ్లమ్ రాకుండా ఉండేందుకు ఒక్కోసారి 15 నుంచి 20 నిమిషాల పాటు ఉంచాలి.

ఆయిల్ మసాజ్.. అరోమాథెరపీ, లావెండర్, పిప్పర్‌మెంట్, యూకలిప్టస్ వంటి ఆయిల్స్‌ని మసాజ్ చేస్తే నొప్పి, ఒత్తిడి తగ్గుతుంది. అందుకోసం మీరు ఇష్టపడే నూనె తీసుకుని నొప్పి ఉన్న చోట మసాజ్ చేయండి. దీనిని వాసన ఒత్తిడిని తగ్గిస్తుంది. దీని వల్ల నొప్పి చాలా వరకూ తగ్గుతుంది.

ఆక్యుపంక్చర్.. ఇది చైనీస్ బెస్ట్ ఆక్యుపంక్చర్.. దీని వల్ల నొప్పి తగ్గుతుంది. శరీర నరాలను శాంతపరుస్తుంది. ఇది జీవశక్తిని కూడా ఉంచుతుంది. కొన్ని సూదులలాంటి వస్తువులతో వేళ్ళపై ఒత్తిడితో ఈ పద్ధతులు నొప్పిని ఎఫెక్టివ్‌గా తగ్గిస్తాయి.

# స్పెషల్ దోశ.. చేయడం కూడా ఈజీనే..

కుట్టు కా ఆటా లేదా బుక్వీట్ పిండి ఉపవాస కాలంలో ఎక్కువగా తీసుకునే ఫుడ్. ఇది ఎంతో హెల్దీ అంతే టేస్టీ కూడా.. దీనిని తయారు చేసుకోవడం కూడా అంతే ఈజీ మరి ప్రాసెస్ ఏంటో తెలుసుకోండి. బుక్వీట్ అనేది పండ్ల విత్తనం, ఇది సోరెల్, నాట్వీడ్, ర్హుబర్బ్ లకు సంబంధించినది. నవరాత్రి ఉపవాస సమయంలో ఇది తినొచ్చు. బుక్వీట్లో మొత్తం తొమ్మిది ముఖ్యమైన అమైనో ఆమ్లాలు ఉన్నాయి. ఇవి మన శరీరం యొక్క ప్రోటీన్ యొక్క బిల్డింగ్ బ్లాక్స్. ఇందులో ఫైబర్, యాంటీఆక్సిడెంట్స్, మెగ్నీషియం కూడా పుష్కలంగా ఉంటాయి. దీంతో ఆరోగ్యకరమైన వంటకాలు చేసుకోవచ్చు. కుట్టు ఉపవాసం సమయంలో సాధారణ పిండికి సరైన ప్రత్యామ్నాయం, ఎందుకంటే ఇది చాలా మంచిది! కుట్టుతో మీరు ఏమి చేయాలో అని ఆలోచిస్తున్నట్లయితే, అద్భుతంగా దోస చేయొచ్చు. అదే ఎలా చెయ్యాలో ఇక్కడ ఉంది.



దక్షిణ భారత ఆహారంలో దోశ ఆరోగ్యకరమైన, తేలికపాటి, రుచికరమైనది. ఇది అల్పాహారంగా లేక భోజనం బదులు కూడా తీసుకోవచ్చు. సాధారణంగా దోశను మినపపిండి, బియ్యం పిండితో తయారు చేస్తారు. ఉపవాస వ్రతంలో తినే పిండి మరియు పదార్థాల కలయికను ఉపయోగించి దోస పిండిని తయారు చేయొ చ్చు. కుట్టు కా దోస యొక్క ఈ రెసిపీలో, లోపల పెట్టడం కోసం బంగాళాదుంప, రాక్ సాల్ట్‌తో తయారు చేస్తారు. ఈ పిండిలో అర్బి, బుక్వీట్ పిండి, ఎర్ర కారం, పచ్చిమిర్చి మరియు ఉప్పు ఉండటం వల్ల మెత్తగా ఉంటుంది. పిండి ఉడికించి, లోపల వేయిం చిన బంగాళాదుంపతో చేసిన కూరను పెట్టి పాన్ మీద కాలుస్తారు.

తయారీ విధానం: కుట్టు కా దోస కు కావలిసిన పదార్థాలు:

పొటాటో ఫిల్లింగ్ కోసం: ఉడకబెట్టిన మూడు బంగాళాదుంపలు నెయ్యి వేయించడానికి సరిపడా, ఉప్పు రుచికి సరిపడా, అర టీస్పూన్ కారం, అర టీస్పూన్ తరిగిన అల్లం

దోశ కోసం: 5 టేబుల్ స్పూన్ల బుక్వీట్ పిండి కుట్టు, 2 టేబుల్ స్పూన్ల ఉడకబెట్టిన అర్బి (కోలోకాసియా), ఉప్పు రుచికి సరిపడా.. అర టీస్పూన్ అజ్వైన్ (క్యారమ్ సీడ్స్), అర టీస్పూన్ కారం 1 స్పూన్ తరిగిన అల్లం, 1 స్పూన్ తరిగిన పచ్చిమిర్చి, కాచిన నెయ్యి కొంచెం.

పొటాటో ఫిల్లింగ్ తయారీ విధానం: బాణలిలో నెయ్యి వేడి చేసి, బంగాళాదుంపలను చూర్ణం చేసి మిగిలిన పదార్థాలలో కలపాలి. బంగాళదుంప మిశ్రమాన్ని లేత గోధుమ రంగు వచ్చేవరకు కొన్ని నిమిషాలు వేపాలి. వేపిన బంగాళాదుంప మిశ్రమాన్ని బయటకు తీసి పక్కన ఉంచండి.

దోశ తయారీ విధానం: ఒక గిన్నెలో, అర్బీని మాష్ చేసి పిండి మరియు ఉప్పుతో కలపండి. కొంచెం నీరు వేసి బాగా కలపాలి. అజ్వైన్, కారం, అల్లం, పచ్చిమిర్చి వేసి మళ్లీ కలపాలి. పిండి మృదువుగా జాలువారే వరకు నీటిని జోడించి, కలపండి. ఒక ఫ్లాట్ పాన్ వేడి చేసి, దానిపై కొంచెం నెయ్యి వేసి, దోస వెయ్యండి. కొన్ని నిమిషాలు ఉడికించనివండి, అంచులు క్రిస్పీగా రావాలంటే చుట్టూ ఎక్కువ నెయ్యి వెయ్యండి. ఇప్పుడు దోసను తిప్పండి మరియు మరొక వైపు ఉడికించాలి. ఇప్పుడు పైన కొంత పొటాటో ఫిల్లింగ్ కొంచెం వేసి ఉంచండి. తరువాత దోసను మడవండి. పుదీనా మరియు కొబ్బరి పచ్చడితో తింటే చాలా బాగుంటుంది.

# ముల్లంగి ఆకులు పారేస్తున్నారా..?






శీతాకాలంలో ముల్లంగి ఎక్కువగా దొరుకుతుంటుంది. ముల్లంగి పచ్చడి, పరాటాలు, సలాడ్, ముఖ్యంగా సాంబార్ ముల్లంగి వేస్తే.. చాలా ఇష్టంగా తింటారు. చాలామంది ముల్లంగి దుంపను వంటకు వాడి.. ముల్లంగి ఆకులను చెత్తగా భావించి బయట పారేస్తూ ఉంటారు. మీరూ ఈ కోవకు చెందితే.. పెద్ద తప్పు చేస్తున్నట్లే. ముల్లంగి ఆకుల్లో పోషకాలు సమృద్ధిగా ఉంటాయని నిపుణులు అంటున్నారు. ఈ ఆకుల్లో విటమిన్ కె, విటమిన్ సి, ఐరన్, మెగ్నీషియం, ఫోలేట్, కాల్షియం వంటి పోషకాలు నిండి ఉంటాయి. ముల్లంగి అకుల రుచి కూడా అద్భుతంగా ఉంటాయి. ముల్లంగి ఆకులతో పప్పు, కర్రీ, పరాటా, ముల్లంగి ఆకులు ఆలూ కర్రీ ఇలా రకరకాలు వండుకోవచ్చు. ముల్లంగి ఆకులు మన ఆహారంలో చేర్చుకుంటే.. అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని నిపుణులు అంటున్నారు.

ముల్లంగి ఆకుల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తుంది. పేగుల కదలికలను సులభతరం చేస్తుంది. మలబద్ధకం, ఎసిడిటీ, కడుపు ఉబ్బరం వంటి సమస్యల నుంచి రక్షిస్తుంది. మీరు జీర్ణ సమస్యల కారణంగా ఇబ్బంది పడుతుంటే.. మీ డైట్‌లో ముల్లంగి ఆకులను కచ్చితంగా చేర్చుకోండి.

రోగనిరోధక శక్తిని పెంచుతుంది.. శీతాకాలంలో రోగనిరోధక శక్తి కొంత మందగిస్తుంది. దీనికారణంగా.. జలుబు, ఫ్లూ, ఇన్ఫెక్షన్లు ఎక్కువగా దాడి చేస్తాయి. ముల్లంగి ఆకుల్లో విటమిన్ సి ఉంటుంది. విటమిన్ సి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. ఇది ఇమ్యూనిటీని బూస్ట్ చేస్తుంది, ఇన్ఫెక్షన్ల నుంచి రక్షిస్తుంది. ఈ సీజన్‌లో ఇమ్యూనిటీని బూస్ట్ చేసుకోవడానికి.. డైట్‌లో ముల్లంగి ఆకులు చేర్చుకోండి. లో బీపీ ఉన్నవారు.. వారి డైట్‌లో ముల్లంగి ఆకులు చేర్చుకుంటే మేలు జరుగుతుందని నిపుణులు అంటున్నారు. ముల్లంగి ఆకుల్లో సోడియం ఉంటుంది. ఇది రక్తపోటును స్థిరీకరించడానికి తోడ్పడుతుంది.

డయాబెటిస్ ఫ్రెండ్లీ.. డయాబెటిస్ పేషెంట్స్ ముల్లంగి గొప్ప డైట్ ఆప్షన్ అని నిపుణులు అంటున్నారు. ముల్లంగి ఆకులు రక్తంలో చక్కెర స్థాయిలను కంట్రోల్‌లో ఉంచడానికి సహాయపడతాయి. దీనిలో ఫైబర్ బ్లడ్ షుగర్ లెవల్స్ కంట్రోల్ ఉంచుతాయి.

# జగన్‌పై గులకరాయి దాడి కేసు నిందితుడు సతీష్ మిస్సింగ్..

విజయవాడ: అజిత్‌సింగ్‌నగర్‌లో వైఎస్ జగన్‌పై దాడి కేసులో నిందితుడిగా ఉన్న వేముల సతీష్‌కుమార్ అదృశ్యం కలకలం రేపుతోంది. ఈ నెల 18 నుంచి సతీష్ కనిపించకుండా పోవడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రేమ వ్యవహారమే కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. సతీష్ ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు, రాజకీయ కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. సతీష్ గతంలో తనను ఈ కేసులో అన్యాయంగా ఇరికించారని ఆరోపించిన విషయం తెలిసిందే.

2024 ఎన్నికల ప్రచారం సమయంలో.. విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లో వైఎస్ జగన్‌పై గులకరాయితో దాడి చేసిన కేసులో నిందితుడిగా ఉన్న వేముల సతీష్‌కుమార్ మాయం కావడం కలకలం రేపింది. అజిత్‌సింగ్‌నగర్‌లోని వడ్డెర కాలనీలో తల్లిదండ్రులు దుర్గారావు, వెంకట రమణలతో సతీష్‌కుమార్ నివాసం ఉంటున్నాడు. రోజువారీ కూలిపనులు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నాడు. సతీష్‌కుమార్ ఈ నెల 17 రాత్రి తల్లిదండ్రులతో కలిసి ఇంట్లోనే నిద్రించాడు. అయితే ఆ మరుసటి రోజు (జులై 18న) ఉదయం 6 గంటలకు తల్లిదండ్రులు నిద్రలేచి చూసేసరికి సతీష్ కనిపించలేదు.

సతీష్ కుమార్ కోసం తల్లిదండ్రులు చుట్టుపక్కల వెతికారు.. బంధువుల ఇళ్లకు వెళ్లాడేమోనని ఆరా తీశారు. సతీష్ ఆచూకీ లభించకపోవడంతో.. ఈ నెల 20న రాత్రి తల్లిదండ్రులు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.. సతీష్ కీలకమైన కేసులో నిందితుడిగా ఉండటంతో పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. పోలీసులు సతీష్‌తో ఉండే ఇద్దరు స్నేహితుల్ని ప్రశ్నించారు. ప్రాథమిక దర్యాప్తులో ప్రేమ వ్యవహారం కారణంగానే సతీష్ ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. తన ప్రేమ విషయంలో తల్లి మందలించడంతో వెళ్లిపోయినట్లు సమాచారం.. తల్లి కూడా నిజమేనని ఒప్పుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు సతీష్ ప్రేమించిన యువతి వివరాలు సేకరించే పనిలో ఉన్నారు.సతీష్ దగ్గర మొబైల్ లేకపోవడంతో ఆచూకీ గుర్తించడం కష్టంగా మారింది అంటున్నారు. అందుకే అతడు ప్రేమించిన యువతి వివరాలు తెలుసుకునే పనిలో ఉన్నారు. అంతేకాదు సతీష్ కుమార్ అదృశ్యం వెనుక రాజకీయ కారణం ఏమైనా ఉందా అనే కోణంలో కూడా ఆరా తీస్తున్నారు. సతీష్ కుమార్ ఆచూకీ త్వరలోనే లభిస్తుందంటున్నారు అధికారులు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్ జగన్ విజయవాడ అజిత్‌సింగ్ నగర్ ప్రచారానికి వచ్చారు.. ఆ సమయంలో వైఎస్ జగన్‌పై రాయితో దాడి జరిగింది. ఈ కేసులో వేముల సతీష్ కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.. అయితే సతీష్ మాత్రం అన్యాయం తనను ఈ కేసులో ఇరికించార న్నారు.. ఆ తర్వాత సతీష్‌కు బెయిల్ రావడంతో జైలు నుంచి విడుదలయ్యాడు. నేరం చేసినట్లు ఒప్పుకోవాలని పోలీసులు తనపై ఒత్తిడి చేశారని ఆరోపించాడు. జగన్‌పై రాయి ఎవరు విసిరారో తనకు తెలియదని.. తనకు ఆ ఘటనతో సంబంధం లేదని చెప్పినా పోలీసులు వినలేదన్నారు. అనవసరంగా తనను ఈ కేసులో బలి చేశారన్నారు. ఈ కేసు అప్పట్లో సంచలనంగా మారిన సంగతి తెలిసిందే.



## మరో కొత్త హైవే.. రెండు చోట్ల బైపాస్‌లు

ప్రకాశం: జిల్లా ప్రజలకు ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ఒంగోలు నుండి బేస్తవారిపేట వరకు 113 కిలోమీటర్ల మేర రోడ్డును నాలుగు లైన్లుగా విస్తరిం చనున్నారు. రాయలసీమ ప్రాంతానికి రవాణా సౌకర్యం మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. సంతనూతలపాడు, పొదిలి వద్ద బైపాస్‌లు నిర్మించ నున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టును పూర్తి చేయనున్నారు. త్వరలోనే డీపీఆర్ సిద్ధం కానుంది.



ఆంధ్రప్రదేశ్‌లో మరో హైవేను నాలుగు లైన్లుగా విస్తరించేందుకు అడుగులు పడుతున్నాయి. ప్రకాశం జిల్లా ఒంగోలు నుంచి పశ్చిమ ప్రకాశం జిల్లాకు, కర్నూలువైపు వెళ్లేవారికి ప్రభుత్వం తీపికబురు చెప్పింది. ఈ రోడ్డును నాలుగు వరుసలుగా విస్తరించనున్నారు. దీనికోసం అధికారులు డీపీఆర్ సిద్ధం చేస్తున్నారు. రాయలసీమ నుంచి రవాణాకు ఇది కీలకంగా మారుతుంది.. ఈ మేరకు ఒంగోలు నుంచి బేస్తవారిపేట వరకు 113 కిలో మీటర్ల పొడవున నాలుగులైన్లుగా విస్తరిస్తారు.. సంతనూతలపాడు, పొదిలి దగ్గర బైపాస్‌లు వస్తాయి.. ప్రభుత్వం, ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ)తో విస్తరిస్తారు.

ఒంగోలు నుంచి కొనకనమిట్ల మీదుగా బేస్తవారిపేట వెళ్లే మార్గంలో ప్రయాణం కష్టంగా మారింది. ఒంగోలు నుంచి బేస్తవారిపేట వరకు సంతనూతలపాడు, చీమకుర్తి, పొదిలి ప్రాంతాల్లో రోడ్డు చాలా ఇరుకుగా ఉంది.. చీమకుర్తి గ్రానైట్ పరిశ్రమలు, లారీల వల్ల రోడ్డు దెబ్బతింది. ముఖ్యంగా మద్రిచెట్లపాలెం కూడలి నుండి చీమకుర్తి వరకు రోడ్డు చాలా దారుణంగా ఉంది. దీనికి తోడు ఆక్రమణలు కూడా పెరిగిపోయా యి. భారీ ట్రైలర్లు, టిప్పర్ల వల్ల మద్రిచెట్లపాలెం – ఒంగోలు మధ్య తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.. ఈ సమస్యకు పరిష్కారంగా ప్రభుత్వం రోడ్డును ప్రైవేటు భాగస్వామ్యంతో నాలుగు వరుసలుగా విస్తరించాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రైవేటు సంస్థ ద్వారా సర్వే కూడా చేశారు. ఈ రోడ్డు విస్తరించేం దుకు.. ప్రస్తుతం ఉన్న రోడ్డుకు ఇరువైపులా స్థలం ఎంత ఉంది అని చూస్తున్నారు.

రాయలసీమ జిల్లాల నుంచి కూరగాయలు, సరుకులు రావడానికి ఒక ముఖ్యమైన రహదారి ఉంది. అందుకే దీనిని నేషనల్ హైవే నాలుగు లైన్లుగా మార్చాలని గతంలో ప్రయత్నించారు. కానీ అది జరగలేదు. సంతనూతలపాడు, పొదిలి పట్టణాల దగ్గర రోడ్డు చాలా ఇరుకుగా ఉండ టంతో.. అక్కడ బైపాస్‌లు కట్టాలని భావిస్తున్నారు. ఈ హైవేను బేస్తవారిపేట వరకు నాలుగు లైన్లుగా విస్తరించి.. ఈ రోడ్డును అనంతపురం నేషనల్ హైవేకు కలుపుతారు. ఈ రోడ్డును నాలుగు లైన్లుగా విస్తరించేందుకు ఎంత ఖర్చవుతుందో అంచనా వేసే పనిలో ఉన్నారు. డీపీఆర్ వచ్చిన తర్వాత ఈ రోడ్డు విస్తకరణకు ఎంత భూమి సేకరించాలి, వ్యయం ఎంత అవుతుందో క్లారిటీ వస్తుందంటున్నారు అధికారులు. ఆ తర్వాత పనులు మొదలుపెడతారన్నారు.

## అల్పపీడనం ప్రభావంతో ఈ జిల్లాల్లో భారీ వర్షాలు

ఆంధ్రప్రదేశ్: భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా కోస్తాంధ్రలో ఆదివారం వరకు భారీ వర్షాలు కురుస్తాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయి. శ్రీశైలం ప్రాజెక్టుకు వరద నీరు వస్తోంది, గేట్లు ఎత్తివేశారు. గోదావరికి కూడా వరద కొనసాగుతోంది. ఏం జరగనుందో వేచి చూడాల్సిందే!



ఆంధ్రప్రదేశ్ ప్రజల్ని వాతావరణశాఖ అలర్ట్ చేసింది.. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. 'ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం కేంద్రీకృతమై ఉంది. ఇది రానున్న 24 గంటల్లో వాయువ్య బంగాళాఖాతంలో మరింత బలపడేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. తదుపరి 48 గంటల్లో పశ్చిమ బెంగాల్, ఉత్తర ఒడిశా తీరాల వైపు కదిలేందుకు అవకాశం ఉంది. ఈ ప్రభావంతో కోస్తాంధ్రలో ఆదివారం వరకు అక్కడక్కడ భారీ వర్షాలు నమోదైయ్యేందుకు ఛాన్స్ ఉంది. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్ళరాదు. అలాగే పిడుగులతో కూడిన వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి' అని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది.

ఇవాళ శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వానలు పడే అవకాశం ఉంది. మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసేందుకు ఆస్కారం ఉంది' అని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు.

ఏపీలోని పలు జిల్లాల్లో ఆదివారం వరకు భారీ వానలు పడే అవకాశం ఉందంటున్నారు. అల్పపీడనం ప్రభావంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయంటున్నారు. శనివారం ఉత్తరాంధ్ర జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు, అలాగే మరికొన్ని చోట్ల మోస్తరు నుంచి తేలికపాటి వానలు పడతాయంటున్నారు. రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. మరో మూడు రోజుల పాటూ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అల్లూరి సీతారామరాజు జిల్లాలో వర్షం దెబ్బకు పలు రోడ్లు కొట్టుకుపోయాయి. పలు వాగులు, వంకలు పొంగిపొర్లడంతో కొన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మరోవైపు శ్రీశైలం ప్రాజెక్టుకు వరద నీరు వచ్చి చేరుతోంది.. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల ప్రభావంతో నీళ్లు కొనసాగుతున్నాయి. ప్రాజెక్టు రెండు గేట్లను ఎత్తి నీళ్లను కిందకు వదులుతున్నారు. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 883.10 అడుగులుగా ఉంది. ఇటు గోదావరికి కూడా వరద కొనసాగుతోంది.

## శ్రీశైలంలో 3 రోజులు అభిషేకాలు రద్దు..

శ్రీశైలం: మల్లన్న ఆలయంలో శ్రావణ మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని శని, ఆది, సోమవారాల్లో అభిషేకాలు రద్దు చేస్తున్నట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. 27 రోజుల్లో హుండీ ద్వారా రూ.4.17 కోట్ల ఆదాయం వచ్చిందని, భక్తులు బంగారం, వెండి కానుకలు సమర్పించారని ఆయన పేర్కొన్నారు. విశాఖపట్నం సింహాచలం అప్పన్న ఆలయంలోనూ శ్రావణమాస ఉత్సవాలు జరుగుతున్నాయి..



ఆలయంలో అభిషేకాలను రద్దు చేస్తున్నట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. శ్రీశైలంలో శ్రావణ మాసోత్సవాలు నేటి నుంచి ప్రారంభమయ్యాయని.. ఆగస్టు 24 వరకు కొనసాగుతాయ న్నారు. శ్రావణమాసం కావడంతో భక్తుల రద్దీ పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. శని, ఆది, సోమవారాలు రద్దీగా ఉండే రోజుల్లో అభిషేకాలు రద్దు చేస్తామన్నారు. అయితే స్పర్శ దర్శనం రద్దీ రోజుల్లో నిర్ణీత వేళల్లో మాత్రమే ఉంటుంద న్నారు ఈవో. అయితే మిగిలిన రోజుల్లో మాత్రం అభిష కాలు, స్పర్శ దర్శనాలు కొనసాగుతాయన్నారు. శ్రీశైలం ఆలయంలో ఆగస్టు 8, 22న ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హుండీలను లెక్కించారు. 27 రోజులకు సంబంధించిన హుండీలను లెక్కించగా రూ.4,17,61,215 నగదు రూపంలో ఆదాయం వచ్చింది. 225గ్రాముల 600మిల్లీ గ్రాముల బంగారం, 11కేజీల 500గ్రాముల వెండిని భక్తులు కానుకలుగా సమర్పించారు. 1300 ఓమన్ బైసా, 475 యుఎస్ఏ డాలర్లు, 305 ఆస్ట్రేలియా డాలర్లు, 220 శ్రీలంక కరెన్సీ రూపాయలు, 200 ఇథోపియన్ బిర్, 160 నేపాల్ రూపాయలు, 155 కెనడా డాలర్లు, 70 యుఏఈ దిర్హామ్స్, 51 ఖతార్ కరెన్సీ, 50న్యూజిలాండ్ డాలర్లు, 40 ఇంగ్లాండ్ పౌండ్స్, 30 ఈరోస్, 5 స్కాట్లాండ్ పౌండ్స్, 2 సింగపూర్ డాలర్లు,1 సౌదీ కరెన్సీ, 1మలేషియా రింగిట్స్ కానుకల రూపంలో వచ్చాయి. మరోవైపు విశాఖపట్నం జిల్లా సింహాచలం అప్పన్న ఆలయంలో కూడా శ్రావణమాసం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ముందుగా ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్, ప్రధాన అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, కరి సీతారామాచార్యులు మిగిలిన అర్చకులతో కలిసి శుక్రవారం వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి.. అనంతరం ప్రాతఃకాల పూజలు నిర్వహించారు. చతుర్భుజ తాయారు, స్వర్ణలక్ష్మి అమ్మవార్లను ఆలయ బేడా మండపంలో వేదికపై అధిష్ఠింపజేసి విశేష కుంకుమార్చ నలు నిర్వహించారు అర్చకులు. ఈ కుంకుమార్చనలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## చైన్ స్నాచింగ్ గ్యాంగ్ అరెస్ట్



అనకాపల్లి: జిల్లాలో వరుస చైన్ స్నాచింగ్‌లతో మహిళలను కంటిమీద కునుకు లేకుండా చేసిన ముగ్గురు దొంగల ముఠాను కసింకోట పోలీసులు మెరుపుదాడితో పట్టుకున్నారు. 'ఆపరేషన్ గోల్డ్' పేరుతో చేపట్టిన ఈ దర్యాప్తులో.. జిల్లాలోని ఐదు పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన తొమ్మిది కేసులను ఛేదించి, దొంగల నుంచి రూ. 26 లక్షల విలువైన 26 తులాల బంగారం, మూడు సెల్‌ఫోన్‌లు, మూడు బైకులను స్వాధీనం చేసుకున్నారు. బైకుల మీద తిరుగుతూ.. ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న మహిళలను టార్గెట్ చేసుకుని.. మెడలోంచి బంగారు గొలుసులు లాక్కుని పరారవుతున్నారని డీఎస్పీ వివరించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో.. ముగ్గురు నిందితులను నిఘా పెట్టి పట్టుకున్నామని తెలిపారు.

# డ్రైవింగ్ టెస్ట్ పాస్ కావటంతో ఇకపై అంత ఈజీ కాదు..

విశాఖపట్నం: డ్రైవింగ్ లైసెన్స్ పొందటం ఇకపై అంత సులభం కాకపోవచ్చు. ఎందుకంటే అధునాతన ఆటోమేటెడ్ టెస్ట్ ట్రాక్‌లను ప్రవేశపెడుతున్నారు. ఈ ట్రాకులలో బండి నడిపి టెస్టు పాస్ కావటం అంత ఈజీ కాదని అధికారులు చెప్తున్నారు. విశాఖపట్నంలో ఈ ఆటోమేటెడ్ టెస్ట్ ట్రాక్ విధానంలో డ్రైవింగ్ టెస్టుకు హాజరవుతున్న వారిలో సగం మంది ఫెయిల్ అవుతున్నట్లు అధికారులు చెప్తున్నారు. అసలేంటీ ఆటోమేటెడ్ టెస్ట్ ట్రాక్ వ్యవస్థ.. ఎక్కడ ఎక్కువ మంది ఫెయిల్ అవుతున్నారనే వివరాలను ఈ కథనంలో తెలుసుకుందాం.

భారతదేశాన్ని ఇబ్బందులు పెడుతున్న సమస్యలలో.. రోడ్డు ప్రమాదాలను కూడా ప్రధానంగా చెప్పుకొవచ్చు. మనదేశంలో నిత్యంలో ఏదో ఒక మూల ప్రమాదం జరుగుతూనే ఉంది.. ప్రాణాలు పోతూనే ఉన్నాయి. కొన్నిసార్లు స్వయంకృతాపారాధాల వలన ప్రాణాలు పోగొట్టుకుంటే.. మరికొన్నిసార్లు మన ప్రమేయం ఏమీ లేకపోయినా కూడా ఇతరుల తప్పిదాలకు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. అందుకే రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకుంటున్నాయి. కఠినమైన చట్టాలు తీసుకుంటున్నాయి. ఈ క్రమంలోనే డ్రైవింగ్ లైసెన్స్ ల జారీని కూడా మరింత కట్టుదిట్టం చేశారు. విశాఖపట్నంలో ఆటోమేటెడ్ డ్రైవింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి.. డ్రైవింగ్ లైసెన్సు పరీక్ష చేపడుతున్నారు. ఈ ప్రక్రియ కారణంగా డ్రైవింగ్ లైసెన్స్ కావాలంటూ వస్తున్న వారిలో సగానికి పైగా డ్రైవింగ్ టెస్టులో ఫెయిల్ అవుతున్నట్లు లెక్కలు చెప్తున్నాయి.

విశాఖపట్నంలో డ్రైవింగ్ లైసెన్స్ టెస్ట్ పాస్ కావటం ఇప్పుడంత ఈజీ కాదు. విశాఖపట్నంలోని గంభీరమ్ వద్ద ఆటోమేటెడ్ డ్రైవింగ్ ట్రాక్ విధానంలో డ్రైవింగ్ టెస్ట్ నిర్వహిస్తున్నారు. అయితే గత ఆరు నెలల కాలంలో డ్రైవింగ్ లైసెన్స్ కోసం వచ్చిన 50 శాతం నుంచి 60 శాతం మంది అభ్యర్థులు ఆటోమేటెడ్ డ్రైవింగ్ ట్రాక్ విధానంలో డ్రైవింగ్ టెస్ట్ పాస్ కాలేకపోయారని లెక్కలు చెప్తున్నాయి. ఆటోమేటెడ్ డ్రైవింగ్ ట్రాక్ విధానంలో భాగంగా సెన్సార్ల ద్వారా ఎలక్ట్రానిక్ పద్ధతిలో పర్యవేక్షణ ఉంటుంది. ఈ కారణంగా ఎక్కువ మంది డ్రైవింగ్ టెస్ట్ పాస్ కాలేకపోతున్నట్లు తెలిసింది. మరీ ముఖ్యంగా 8 టెస్టు ట్రాకులలో ఎక్కువ మంది ఫెయిల్ అవుతున్నట్లు అధికారులు చెప్తున్నారు.



విశాఖపట్నంలోని గంభీరమ్ వద్ద ఉన్న ఆటోమేటెడ్ టెస్ట్ ట్రాక్ వద్దకు డ్రైవింగ్ టెస్టుల కోసం రోజూ 80 నుంచి 120 మంది వరకూ వస్తుంటారు. అయితే వారిలో 40 నుంచి 60 మంది వరకూ డ్రైవింగ్ టెస్టులో ఫెయిల్ అవుతున్నారు. ఆటోమేటెడ్ టెస్ట్ ట్రాక్ వ్యవస్థలో టెస్టింగ్ ట్రాక్ అంతటా సెన్సార్లు అమర్చి ఉంటాయి. వాహనం ప్రతి కదలికను ఈ సెన్సార్లు పసిగడుతూ ఉంటాయి. ఈ కారణంగానే ఎక్కువ మంది ఫెయిల్ అవుతున్నట్లు తెలిసింది. డ్రైవింగ్ టెస్ట్ విషయానికి వస్తే రెండు పద్ధతులో డ్రైవింగ్ లైసెన్స్ టెస్ట్ ఉంటుంది. ఒకటి రాతపరీక్ష. రెండోది గ్రౌండ్ టెస్టు. అయితే గ్రౌండ్ టెస్టులో భాగంగా లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు 8 ట్రాకుల గుండా వాహనాన్ని నడపాల్సి ఉంటుంది.

అయితే ట్రాకుల కుండా వాహనాలను నడిపే సమయంలో ఏ మాత్రం తడబడినా సెన్సార్లు పసిగట్టేస్తున్నాయి. దీంతో ఎక్కువ మంది డ్రైవింగ్ లైసెన్స్ టెస్ట్ పాస్ కాలేకపోతున్నారు. అయితే మొదటిసారి వాహనాన్ని నడపటంలో తడబడి ఫెయిల్ అయినవారు.. రెండు, మూడో ప్రయత్నాల్లో పాస్ అయ్యి లైసెన్స్ పొందుతున్నట్లు అధికారులు చెప్తున్నారు. ఇక ఫెయిల్ అవుతామనే భయంతో ఇప్పుడు ఎక్కువ మంది తొలుత డ్రైవింగ్ ట్రైనింగ్ తీసుకుని ఆ తర్వాత లైసెన్స్ టెస్టుకు వస్తున్నట్లు తెలిపారు. గతంలో చిన్న చిన్న తప్పులు చేసినా లైసెన్సులు వచ్చేవని.. కానీ ఇప్పుడు అధునాతన ఆటోమేటెడ్ టెస్ట్ ట్రాక్ కారణంగా చిన్న తప్పు చేసినా డ్రైవింగ్ టెస్టులో ఫెయిల్ అవుతున్నారని చెప్తున్నారు.



## సింగ్‌నగర్‌లో మళ్లీ వరదలు.!

విజయవాడ: సోషల్ మీడియా రెండు వైపులా పదును ఉన్న కత్తి.. మంచికీ వాడొచ్చు, చెడునూ వ్యాప్తి చేయొచ్చు.. అయితే సోషల్ మీడియాలో వచ్చే వార్తలను చూసి కంగారుపడిపోవాల్సిన అవసరం లేదు. వాస్తవాన్ని తెలుసుకుని అప్రమత్తంగా వ్యవహరిస్తే చాలు. అసలు విషయానికి వస్తే రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రస్తుతం పలుచోట్ల భారీ వర్షాలు కురుస్తున్న సంగతి తెలిసిందే. ఈ సమయంలోనే విజయవాడ సింగ్‌నగర్?లో మళ్లీ వరదలు అంటూ నెట్టింట ప్రచారం జరుగుతోంది. విజయవాడ సింగ్‌నగర్‌లో మళ్లీ వరదలు వస్తున్నాయి.. అప్రమత్తంగా ఉండండి అంటూ వదంతులు ప్రచారం చేస్తున్నారని.. తాను ప్రస్తుతం కడపలో ఉన్నానని, ఇది ఎంత వరకూ నిజమో చెప్పాలంటూ ఓ నెటిజన్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. తన ట్వీట్‌కు ఏపీ సీఎం, డిప్యూటీ సీఎం, పవన్ కళ్యాణ్, నారా లోకేష్ హ్యాండిల్లను ట్యాగ్ చేశారు. ఈ నేపథ్యంలో ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ స్పందించింది.

"ఇలాంటి వదంతులను నమ్మకండి. ఇలాంటి వాటిని ప్రచారం చేయకండి. విపత్తుల నిర్వహణ సంస్థలో 24 గంటలు అందుబాటులో ఉండే టోల్ ఫ్రీ 112, 1070, 18004250101 నెంబర్లను సంప్రదించి అసత్య ప్రచారాలను ఆపవచ్చు. ఎటువంటి భారీ వర్షాలు, వరదలు, తుపానులు ఇతర ఏ విపత్తులైన అకౌంట్ నుంచి అప్డేట్స్ వస్తాయి." అంటూ ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. మరోవైపు బంగాళాఖాతంలో వాయుగుండం, ఏపీలో భారీ వర్షాలపై హోం మంత్రి వంగలపూడి అనిత సమీక్షించారు. విపత్తు నిర్వహణ శాఖ కార్యాలయంలో జరిగిన ఈ సమీక్షా సమావేశంలో విపత్తు నిర్వహణ శాఖ ఎండీ ప్రఖర్ జైన్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ నుంచి వాతావరణ పరిస్థితులను పరిశీలించారు. వాయుగుండం శుక్రవారం సాయంత్రానికి పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్ పరిసరాల్లో తీరం దాటే అవకాశముందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

వాయుగుండం ప్రభావంతో రాయలసీమ, కోస్తా జిల్లాలలో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. దీని ప్రభావంతో తీరం వెంబడి గంటకు 40 నుంచి 60 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ఈ నేపథ్యంలో సోమవారం వరకు మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్ళరాదని సూచించింది. సహాయం కోసం టోల్‌ఫ్రీ నంబర్లు ఏర్పాటు

మరోవైపు వర్షాలు, ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉన్న ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను హోంమంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. రేపు, ఎల్లుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో.. ఇరిగేషన్, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్ శాఖలతో సమన్వయం చేసుకొని గండ్లు, ఫ్లాష్ ఫ్లడ్ ప్రభావిత ప్రాంతాలను గుర్తించి అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించిన హోం మంత్రి వంగలపూడి అనిత.. అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం కంట్రోల్ రూమ్‌లో 112, 1070, 1800-4250101 టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేయాలని ప్రజలకు సూచించారు.

## ఉపాధి హామీ కూలీలకు కేంద్రం శుభవార్త..

ఆంధ్రప్రదేశ్: ఉపాధి హామీ కూలీలకు కేంద్రం శుభవార్త చెప్పింది. ఉపాధి హామీ కూలీలకు రావాల్సిన వేతనాలు విడుదల చేసింది. రూ.605 కోట్లు కేంద్రం విడుదల చేయగా.. ఒకట్రెండు రోజులల్లో ఈ డబ్బులు ఉపాధి హామీ కూలీల బ్యాంక్ ఖాతాలలో జమ కానున్నాయి. ఉపాధి హామీ కూలీలకు మే నెలలో చివరిసారిగా కేంద్రం డబ్బులు విడుదల చేసింది. పెండింగ్ డబ్బులు విడతల వారీగా విడుదల చేస్తామని అధికారులు చెప్తున్నారు.

ఏపీలోని ఉపాధి హామీ కూలీలకు (శ్రామికులు) కేంద్ర ప్రభుత్వం శుభవార్త వినిపించింది. రూ.605 కోట్ల వేతన బకాయిలను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీల బ్యాంకు ఖాతాల్లో ఈ మొత్తం మరో రెండు, మూడు రోజుల్లో జమకానుంది. గ్రామీణ ఉపాధి పథకంలో పనిచేస్తున్నవారికి కేంద్రం రూ.2,500 కోట్లకు పైగా వేతనాలు చెల్లించాల్సి ఉంది. గ్రామీణ ఉపాధి హామీ శ్రామికులకు 2025 మే 28 తర్వాత కేంద్రం ఇప్పటి వరకూ వేతనాలు విడుదల చేయలేదు. ఈ క్రమంలోనే బకాయిలు చెల్లించాలంటూ



కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖకు ఏపీ ప్రభుత్వం ఇటీవల లేఖ రాసింది. దీంతో రూ.605 కోట్లను కేంద్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసింది. మిగతా మొత్తాన్ని దశలవారీగా విడుదల చేయనున్నారు.

ఉపాధి హామీ పథకంలోని కూలీలకు ఇకపై డబ్బులు రావాలంటే.. రోజూ రెండుసార్లు ఫోటో తీసి ఆన్‌లైన్‌లో పెట్టాల్సి ఉంటుంది. పని ప్రదేశంలో ఉదయం, సాయంత్రం కూలీలను రెండుసార్లు ఫొటో తీసి ఆన్‌లైన్‌లో ఉంచాల్సి ఉంటుంది. ఈ ఫోటోలను నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఉదయం 9 గంటలకు మొదటి ఫోటో.. సాయంత్రం 4 గంటలకు రెండో ఫోటో తీసి అప్‌లోడ్ చేయాలని కేంద్రం సూచించింది.

# సికింద్రాబాద్ నుంచి మరో వందే భారత్ ట్రైన్..



సికింద్రాబాద్: ప్రధానమంత్రి మోదీ ప్రభుత్వం వందేభారత్ రైళ్లను ప్రవేశపెట్టడంతో ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా ఉంది. దీనికి పెరుగుతున్న ఆదరణను చూసి మరిన్ని రైళ్లను అందుబాటులోకి తెస్తున్నారు. సికింద్రాబాద్ నుండి పూణేకు కొత్త రైలు రాబోతోంది, ఇది ప్రయాణికులకు మరింత వేగంగా చేరేందుకు ఉపయోగపడుతుంది. అంతేకాదు, తెలుగు రాష్ట్రాల నుంచి ఇతర ప్రాంతాలకు కూడా కనెక్టివిటీ పెంచేందుకు రైల్వే శాఖ ప్రయత్నిస్తోంది. మరిన్ని వివరాలు త్వరలో తెలుస్తాయి!

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సెమీ హైస్పీడ్ రైలు వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు దేశవ్యాప్తంగా ప్రయాణికుల నుంచి అద్భుతమైన ఆదరణ లభిస్తోంది. సాధారణ రైళ్లతో పోలిస్తే వందేభారత్‌లో ఉన్న అధునాతన సౌకర్యాలు, వేగం, సౌలభ్యం దీనికి ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టాయి. అధిక టికెట్ ధర ఉన్నప్పటికీ.. గమ్యస్థానాలకు వేగంగా చేరుకునే లక్ష్యంతో ప్రయాణికులు వందేభారత్‌ను ఎక్కువగా ఎంచుకుంటున్నారు.

ప్రస్తుతం సికింద్రాబాద్ నుండి నాగ్‌పూర్‌కు వందేభారత్ రైలు నడుస్తున్నప్పటికీ.. దానికి ఆక్యుపెన్సీ ఆశించిన స్థాయిలో లేదు. ఈ రైలును మొదట 20 కోచ్‌లతో ప్రవేశపెట్టగా.. ప్రయాణికుల ఆదరణ లేకపోవడంతో బోగీలను కుదించి ఎనిమిది కోచ్‌లతో నడుపుతున్నారు. దీనికి విరుద్ధంగా.. సికింద్రాబాద్–పూణె మార్గానికి అధిక డిమాండ్ ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. హైదరాబాద్, పూణె రెండూ ముఖ్యమైన ఐటీ నగరాలు కాబట్టి.. ఈ మార్గంలో ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా ఉంటుందని నివేదికలు చెబుతున్నాయి. ప్రస్తుతం సికింద్రాబాద్ నుంచి పూణెకు శతాబ్ది ఎక్స్‌ప్రెస్ మాత్రమే మధ్యాహ్నం వేళ నడుస్తోంది. వందేభారత్‌ను ఉదయం వేళ ప్రారంభిస్తే ప్రయాణికులకు మరింత సౌకర్యవంతంగా ఉంటుందని ప్రతిపాదనలు వస్తున్నాయి. సికింద్రాబాద్–పూణె మధ్య వందేభారత్ అందుబాటులోకి వస్తే దాదాపు మూడు గంటల ప్రయాణ సమయం ఆదా అవుతుంది. అంతేకాకుండా.. మహారాష్ట్ర, కర్ణాటకలోని ఇతర ప్రధాన ప్రాంతాలకు తెలుగు రాష్ట్రాల నుండి వందేభారత్ కనెక్టివిటీని పెంచేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే విజయవాడ నుండి బెంగళూరుకు వయా తిరుపతి ఖరారైన వందేభారత్ త్వరలో పట్టాలెక్కాల్సి ఉంది. అయితే సాంకేతిక కారణాలతో ఆలస్యం అవుతోంది. వందేభారత్ స్లీపర్ రైళ్లు ప్రారంభమయ్యే తొలి విడతలోనే తెలుగు రాష్ట్రాలకు కేటాయింపు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. సికింద్రాబాద్ నుండి ఢిల్లీ, విజయవాడ నుండి అయోధ్య మధ్య స్లీపర్ సర్వీసుల కోసం ప్రతిపాదనలు ఉన్నాయని.. దీనిపై రైల్వే శాఖ త్వరలో నిర్ణయం తీసుకోనుందని సమాచారం.

# ఐఏఎస్ శ్రీలక్ష్మికి హైకోర్టులో షాక్..

తెలంగాణ: ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మికి తెలంగాణ హైకోర్టులో నిరాశ ఎదురయ్యింది. ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో తనను నిర్దోషిగా ప్రకటించాలంటూ ఆమె హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా శుక్రవారం దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం.. శ్రీలక్ష్మి పిటిషన్‌ను కొట్టివేసింది. ఇప్పటికే ఓబుళాపురం మైనింగ్ కేసులో కోర్టు.. శ్రీలక్ష్మిని నిందితురాలిగా తేల్చింది. ఇక శుక్రవారం నాటి కోర్టు తీర్పు అనంతరం.. సీబీఐ ఈ కేసులో ఆమె పాత్రపై విచారణ జరపనుంది. గాలి జనార్ధన్ రెడ్డికి గనులు కేటాయించడంలో శ్రీలక్ష్మి ముఖ్యపాత్ర పోషించారనే ఆరోపణలు వచ్చాయి. ఇప్పుడు సీబీఐ దీనిపై విచారణ జరపనుంది. ఇక ఓబుళాపురం మైనింగ్ కేసులో.. శ్రీలక్ష్మి నిర్దోషి అంటూ గతంలో తెలంగాణ హైకోర్టు తీర్పు వెల్లడించింది. దీంతో ఈ కేసు విచారిస్తున్న సీబీఐ.. శ్రీలక్ష్మి విషయంలో తెలంగాణ హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. దీన్ని విచారించిన సుప్రీం కోర్టు.. హైకోర్టులోనే ఓఎంసీ కేసులో శ్రీలక్ష్మి పాత్ర తేల్చాలని ఆదేశాలు జారీ చేసింది. ఈక్రమంలో ఇరువైపుల వాదనలు విన్న తెలంగాణ హైకోర్టు.. తాజాగా ఆమె దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్‌ని కొట్టేసింది.



గాలి జనార్ధన్ రెడ్డి ఓబుళాపురం మైనింగ్ పేరుతో దోపిడికి పాల్పడిన సమయంలో.. అప్పటి ప్రభుత్వంలో.. మైనింగ్ శాఖ ఉన్నతాధికారిగా శ్రీలక్ష్మి విధుల్లో ఉన్నారు. ఆ సమయంలో శ్రీలక్ష్మి చేతుల మీదుగా అనేక అక్రమాలు జరిగాయని.. లీజుల్లో అవకతవకలు నుంచి.. అర్హత లేకపోయినా గాలి జనార్ధన్ రెడ్డి కంపెనీలకు లీజులు కట్టబెట్టడం వరకూ చాలా అంశాల్లో శ్రీలక్ష్మి పాత్ర ఉందని సీబీఐ కేసులు పెట్టింది. కానీ శ్రీలక్ష్మి మాత్రం ఈ కేసులో తనకు ఎలాంటి సంబంధం లేదని.. గతంలో సీబీఐ కోర్టులో డిశ్చార్జ్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే సీబీఐ కోర్టు ఈ పిటిషన్‌ని కొట్టేసింది. దీంతో శ్రీలక్ష్మి అదే పిటిషన్‌ను హైకోర్టులో దాఖలు చేశారు. 2022లో ఆమెను కేసు నుంచి డిశ్చార్జ్ చేస్తూ హైకోర్టు తీర్పు చెప్పింది. దీంతో ఈ కేసులో హైకోర్టు తాము చూపించిన ఆధారాలను పరిగణనలోకి తీసుకోకుండా.. శ్రీలక్ష్మిని డిశ్చార్జ్ చేశారని ఆరోపిస్తూ.. సీబీఐ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టు ఇచ్చిన తీర్పును పక్కన పెట్టింది. మళ్లీ హైకోర్టులోనే విచారణ జరపాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో తెలంగాణ హైకోర్టు ఈ డిశ్చార్జ్ పిటిషన్‌ని విచారించి.. దాన్ని డిస్మిస్ చేసింది. తాజా తీర్పు అనంతరం.. సీబీఐ ఈ కేసులో ఆమె పాత్రపై విచారణ జరపనుంది. ఈ విచారణలో ఆమె దోషిగా తేలితే జైలుకు వెళ్లాల్సి వస్తుందంటున్నారు.

# బీజేపీ నాయకురాలు మాధవీలత అరెస్ట్..



హైదరాబాద్: గత ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన మాధవీ లతను బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. పెద్దమ్మ తల్లి ఆలయాన్ని ప్రభుత్వం కూల్చివేసిందని ఆరోపిస్తూ ఆమె రోడ్డుపై నిరసనకు దిగారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా బీజేపీ కార్యకర్తలతో కలిసి ఆందోళన చేస్తున్న ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆలయంలోని విగ్రహాన్ని తరలించిన తహసీల్దార్ వెంటనే స్పందించాలని ఆమె డిమాండ్ చేశారు.

గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ తరపున హైదరాబాద్ ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగి తెలుగు రాష్ట్రాల్లోనే కాక దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారు మాధవీ లత. నాటి నుంచి ఇప్పటి వరకు నిత్యం ఏదో రకంగా వార్తల్లో నిలుస్తూనే ఉన్నారు. ఈక్రమంలో తాజాగా హైదరాబాద్ పోలీసులు మాధవీ లతను అరెస్ట్ చేశారు. కుండపోత వానలో నిరసన చేస్తున్న ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకుని.. పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మరి ఇంతకు మాధవీ లతను ఎందుకు అరెస్ట్ చేశారు.. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ఆమె నిరసన చేయడానికి గల కారణాలు ఏంటి అంటే..

బీజేపీ నాయకురాలు మాధవీ లతను బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రభుత్వం ఎమ్మెల్యే కాలనీలో ఉన్న పెద్దమ్మ తల్లి ఆలయాన్ని కూల్చేసిందని ఆరోపిస్తూ.. మాధవీ లత రోడ్డుపై బైఠాయించారు. ఆమెతో పాటు పలువురు బీజేపీ కార్యకర్తలు కూడా ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆమెను అరెస్ట్ చేశారు. అసలేం జరిగిందంటే.. బంజారాహిల్స్, ఎమ్మెల్యే కాలనీలో.. ప్రభుత్వ స్థలంలో ఉన్న పెద్దమ్మ తల్లి ఆలయాన్ని అధికారులు కూల్చేశారని ఆరోపిస్తూ.. ఆ కాలనీవాసులు గురువారం సాయంత్రం ఆందోళనకు దిగారు.

విషయం తెలుసుకున్న మాధవీ లత.. వారికి మద్దతు తెలపడం కోసం బీజేపీ కార్యకర్తలతో కలిసి అక్కడకు చేరుకున్నారు. అనంతరం కాలనీవాసులతో కలిసి ఆమె కూడా ఘటనా స్థలంలో బైఠాయించారు. ఈ సందర్భంగా మాధవీ లత మాట్లాడుతూ.. పదేళ్లుగా కాలనీ వాసులు.. ఇక్కడ అమ్మవారిని పూజిస్తున్నారని తెలిపారు. అలానే ప్రతి ఏటా ఆషాడమాసంలో బోనం కూడా సమర్పించేవారని.. ఈ ఏడాది బోనాల సందర్భంగా కూడా బోనాలు సమర్పించారని తెలిపారు.

అలాంటి ఆలయాన్ని.. ప్రభుత్వ భూమి అని చెప్పి.. అధికారులు ఆలయాన్ని తొలగించడం సరికాదన్నారు మాధవీ లత. ఆలయంలోని విగ్రహాన్ని తరలించిన తహసీల్దార్.. వెంటనే సంఘటనా స్థలానికి రావాలని ఆమె డిమాండ్ చేశారు. ఓవైపు వర్షం కురుస్తున్నా సరే.. కాలనీ వాసులు, మాధవీ లత.. వానలో తడుస్తూనే నిరసన తెలిపారు. సుమారు నాలుగు గంటల పాటు వారు రోడ్డు మీదనే బైఠాయంచారు. దీంతో విషయం కాస్త పోలీసులకు తెలియడంతో.. బంజారాహిల్స్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మాధవీ లతను బలవంతంగా పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా మాధవీ లత మాట్లాడుతూ.. 'బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీ రోడ్ నెం.12 వద్ద శతాబ్దాల నాటి అమ్మవారి దేవాలయాన్ని కూల్చివేయడానికి చేసిన ప్రయత్నం నా మనసును కలచివేస్తోంది. వర్షంలో తడిసిన భక్తులు.. కన్నీళ్లతో అమ్మవారిని రక్షించమంటూ వేడుకుంటున్నారు. పోలీసులు నన్ను గుడిలోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఒక సనాతన మహిళగా .. అమ్మవారిని బయటకు లాగి, ఆమె ఆలయాన్ని కూల్చివేయడాన్ని చూశాం. ఇది దారుణం, ఇది అధర్మం.ఇది కేవలం భూమి కాదు..ఇది మన భక్తి, మన మాతృరూపం, మన ధర్మం. ఈ దౌర్జన్యాన్ని బహిరంగంగా ఖండిస్తున్నాను' అని చెప్పుకొచ్చారు. మాధవీ లత అరెస్ట్ సంచలనంగా మారింది.

# 1500 ఎకరాల్లో.. ఎయిర్‌పోర్ట్..

తెలంగాణ: విమానాశ్రయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆదిలాబాద్‌లో కొత్త విమానాశ్రయానికి ఎయిర్‌ఫోర్స్ అనుమతి లభించగా, వరంగల్ విమానాశ్రయానికి 205 కోట్ల రూపాయలు కేటాయించనున్నారు. మామునూరు ఎయిర్‌పోర్టును అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఇది 2027 నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. రామగుండం, కొత్తగూడెంలో విమానాశ్రయాల ఏర్పాటు ప్రతిపాదనను ఎయిర్‌పోర్ట్ అథారిటీ తిరస్కరించింది. ఈ అంశానికి సంబంధించిన పూర్తి వివరాలు మీ కోసం

తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. రాష్ట్ర అభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంటుంది. దీనిలో భాగంగా రాష్ట్రంలో విమానాశ్రయాలు పెంచేందుకు కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలో వరంగల్‌లో విమానాశ్రయానికి.. ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నిధులు కేటాయించేందుకు అంగీకరించిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో తెలంగాణలో మరో విమానాశ్రయం ఏర్పాటుకు ఎయిర్‌ఫోర్స్ ఆమోదం తెలిపింది. అలానే వరంగల్ మామునూరు విమానాశ్రయానికి 205 కోట్ల రూపాయలు అవసరం అవుతాయంటూ అధికారులు ఇచ్చిన నివేదికకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. త్వరలోనే ఈ నిధులు విడుదల కానున్నాయి. మరి ఇంతకు తెలంగాణలో మరో కొత్త విమానాశ్రయం ఎక్కడ ఏర్పాటు చేయబోతున్నారంటే..

తెలంగాణకి మరో కొత్త ఎయిర్‌పోర్ట్ రాబోతుంది. ఆదిలాబాద్ జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటుకు ఎయిర్‌ఫోర్స్ గ్రీన్స్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ పంపింది. ఇక ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి 1500 ఎకరాలను సేకరించనున్నారు. ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేయబోయే విమానాశ్రయాన్ని.. రాష్ట్రం, ఎయిర్‌ఫోర్స్ సంస్థలు వినియోగించుకుంటాయి. ఇక ఈ ఎయిర్‌పోర్ట్ కోసం 1500 ఎకరాలు సేకరించాలని నిర్ణయించారు. అయితే మొత్తం భూసేకరణ ఒకేసారి చేయకుండా.. ముందుగా మొదటి దశలో 900 ఎకరాలు సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మిగిలిన భూమిని తర్వాత సేకరించాలని భావిస్తున్నట్లు సమాచారం. ఇక్కడ కార్గో సేవలు, భవిష్యత్‌లో రన్‌వే విస్తరణ, హోటల్, ప్రయాణికులకు అత్యవసర సేవలు అందించేలా ఆస్పత్రిని నిర్మించాలని ప్రభుత్వం ప్రణాళికలు రెడీ చేస్తుంది.

ఇదిలా ఉంటే వరంగల్ జిల్లాలో మామునూరు ఎయిర్‌పోర్టును నిర్మించనున్న సంగతి తెలిసిందే. ఇది నిజాం కాలంలో ఎయిర్ పోర్టుగా ఉండేది. పాత విమానాశ్రయాన్నే తిరిగి అభివృద్ధి చేస్తున్నారు. దీని విస్తరణ, భూసేకరణ కోసం రూ. 205 కోట్లు అవసరం అవుతాయని ప్రభుత్వానికి నివేదిక అందించారు. త్వరలోనే సర్కార్ ఈ నిధులను మంజూరు చేయనుంది. అన్ని అనుకున్నట్లుగా జరిగితే వరంగల్ ఎయిర్ పోర్ట్ 2027 నాటికి అందుబాటులోకి వస్తుందని అంచనా వేస్తున్నారు. తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో కొత్త విమానాశ్రయాల నిర్మాణంపై దృష్టి సారించింది. ప్రస్తుతం ప్రయాణికుల కోసం హైదరాబాద్‌లో ఒక్కటే విమానాశ్రయం అందుబాటులో ఉంది. అదే శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం. ఇక బేగంపేటలో ఎయిర్‌పోర్ట్ ఉన్నా.. అది ప్రముఖుల వినియోగానికి మాత్రమే అందుబాటులో ఉంది. దీంతో రాష్ట్రంలో ఎయిర్‌పోర్టుల సంఖ్య పెంచాలని భావించిన రేవంత్ సర్కార్.. కేంద్రానికి పలు ప్రతిపాదనలు పంపించింది.

# మరోసారి సెక్రటేరియెట్‌లో ఊడిన పెచ్చులు...

తెలంగాణ: కొత్త సెక్రటేరియట్ భవనం ప్రారంభం నుండి వివాదాలకు కేంద్రంగా మారుతోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం.. నగరం నడిబొడ్డున వందల కోట్ల రూపాయలతో తెలంగాణకు కొత్త సెక్రటేరియట్ బిల్డింగ్ నిర్మించిన సంగతి తెలిసిందే. నిత్యం వేల మంది పర్యాటకులు సెక్రటేరియట్ బిల్డింగ్ సందర్శించడానికి వస్తుంటారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని.. పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. ఇదంతా బాగానే ఉంది కానీ వందల కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన సెక్రటేరియట్ భవనం ప్రారంభం నుంచి విమర్శలు మూటగట్టుకుంటుంది. తెలంగాణ సమాజం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించిన సెక్రటేరియట్ నిర్మాణంలో నాణ్యత పాటించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. సెక్రటేరియట్ భవనానికి పలు చోట్ల పగుళ్లు, వాటర్ లీకేజీలు వంటి ఘటనలు వెలుగు చూశాయి. ఇక తాజాగా సెక్రటేరియట్ ప్రాంగణంలో పెద్ద ప్రమాదం తప్పింది. సెక్రటేరియట్ పెచ్చులూడి.. సీఎం కాన్వాయ్ వెళ్లే మార్గంలో పడ్డాయి.

హైదరాబాద్‌లోని సచివాలయ భవనంలో గురువారం సాయంత్రం మరోసారి పెచ్చులూడాయి. ఇన్నర్ లాన్‌లో ముఖ్యమంత్రులు, మంత్రుల కాన్వాయ్ వెళ్లే మార్గంపై సిమెంట్ పెచ్చులు ఊడి పడ్డాయి. అయితే అదృష్టవశాత్తు.. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో.. పెను ప్రమాదం తప్పింది. అయితే సెక్రటేరియట్ భవనం పెచ్చులూడటం ఇదే మొదటిసారి కాదు. ఈ ఏడాది ఫిబ్రవరి 12న కూడా ఇలాంటి సంఘటనే చోటు చేసుకుంది.

సచివాలయం ఆరో అంతస్తు నుంచి ఒక పెద్ద పెచ్చు భాగం ఊడి.. అక్కడ పార్క్ చేసి ఉన్న కారుపై పడింది. ఈ ఘటనలో కారు బాగా డ్యామేజ్ అయ్యింది. అప్పుడు కూడా అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై గతంలో ఆర్ అండ్ బీ శాఖ పూర్తిస్థాయి విచారణ చేపట్టింది. అలానే కొన్ని రోజుల క్రితం ఓ కిటికీ అంచు ఊడి పడటంతో ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. సచివాలయ బిల్డింగ్ ప్రారంభం అయిన నాటి నుంచి ఏదో ఒక లోపం బయటపడుతూనే ఉంది. ఇప్పటికే సచివాలయంలో పలు చోట్ల వాటర్ లీకేజీలు, గోడలకు పగుళ్లు కనిపిస్తున్నాయి.

ఇక తాజాగా మరోసారి పెచ్చులూడటం సంచలనంగా మారింది. ఈ ఘటనపై జనరల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం, ఉన్నతాధికారులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఈ ఘటనతో మరోసారి సచివాలయ నిర్మాణ నాణ్యత, భద్రతా ప్రమాణాలపై అనుమానాలను రేకెత్తిస్తుంది. అయితే గతంలో పెచ్చులూడిన సందర్భంలో నిర్మాణ సంస్థ చర్యలు చేపట్టింది.

# హెచ్‌పీసీఎల్‌తో ఒప్పందం కుదుర్చుకున్న ర్యాపిడో..



హైదరాబాద్: బైక్ టాక్సీలు ఎన్ని వచ్చినా ర్యాపిడోకు ఉన్న డిమాండ్ వేరే లెవల్ అని చెప్పుకోవచ్చు. ప్రస్తుతం ర్యాపిడో హైదరాబాద్ మెట్రోలో ప్రయాణం చేసే వారికి టికెట్స్ పై డిస్కౌంట్లతో అద్భుత ఆఫర్లను ఇస్తోంది. తమ యాప్ లో ఈ వివరాలను కూడా పొందుపరిచింది. అయితే మరో అడుగు ముందుకేసి.. ర్యాపిడో హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ తో ఒక ఒప్పందం కుదుర్చుకుంది. దీని వల్ల వారికి ఇంధనంపై 1.25 శాతం తగ్గింపు లభించనుంది. హైదరాబాద్‌లో బైక్ టాక్సీలకు డిమాండ్ అనూహ్యంగా పెరిగిన నేపథ్యంలో.. ర్యాపిడో తన అగ్రస్థానాన్ని నిలుపుకుంటోంది. మొట్టమొదటగా హైదరాబాద్‌లో బైక్ టాక్సీ సేవలను ప్రవేశపెట్టిన ఘనత ర్యాపిడోకే దక్కుతుంది. ఈ స్టార్టప్ 2015లో స్థాపించబడింది. కాలక్రమేణా.. ఇది భారతదేశంలో పట్టణ రవాణాలో కీలకమైన భాగంగా మారింది. ప్రస్తుతం 75 మిలియన్ల మందికి పైగా వినియోగదారులు, 500కు పైగా నగరాల్లో సేవలు అందిస్తూ.. ఒక బిలియన్ రైడ్‌లు పూర్తి చేసినట్లు ర్యాపిడో పేర్కొంది. హైదరాబాద్‌లో మాత్రమే.. ఈ సంస్థ రోజుకు 1.5 లక్షల క్యాబ్ రైడ్‌లు నిర్వహిస్తుందని 2024 జనవరి నివేదికలు చెబుతున్నాయి. ఇది క్యాబ్ మార్కెట్‌లో దాదాపు 25 శాతం వాటాను కలిగి ఉంది. ర్యాపిడో కేవలం బైక్ టాక్సీ సేవలతో ఆగకుండా.. ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తోంది. ముఖ్యంగా.. హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు ఆకర్షణీయమైన డిస్కౌంట్లను అందిస్తోంది. తమ యాప్‌లో మెట్రో టికెట్ బుకింగ్ సేవలను అందుబాటులోకి తెచ్చిన ర్యాపిడో, మొదటి మెట్రో టికెట్ బుకింగ్‌పై 20 శాతం వరకు తగ్గింపును ఇస్తోంది. కూపన్ కోడ్‌ను ఉపయోగించి రూ. 35 లేదా అంతకంటే తక్కువ టికెట్ ధర ఉన్నట్లయితే.. అది ఉచితంగా లభిస్తుంది. టికెట్ ధర రూ. 35 కంటే ఎక్కువ ఉన్నా.. ఆ మొత్తాన్ని తగ్గిస్తారు. ఇది హైదరాబాద్ నగర ప్రయాణికులకు ఆర్థికంగా ఎంతో ప్రయోజనకరంగా ఉంది. ఈ భాగస్వామ్యం మెట్రో స్టేషన్ల నుండి చివరి మైలు కనెక్టివిటీని మెరుగుపరచడమే కాకుండా.. నగర రవాణాను మరింత సులభతరం చేస్తుంది.

ప్రయాణికులతో పాటు.. తమ డ్రైవర్ భాగస్వాములైన 'కెప్టెన్‌ల' సంక్షేమానికి కూడా ర్యాపిడో ప్రాధాన్యత ఇస్తోంది. ఇందులో భాగంగా.. హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ తో గురువారం ఒక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించింది. ఈ ఒప్పందం బైక్ టాక్సీ, క్యాబ్ కెప్టెన్లకు వారి వాహన నిర్వహణలో గణనీయమైన ప్రయోజనాలను అందించనుంది. ఈ కార్యక్రమం మొదట హైదరాబాద్‌లో ప్రారం భమై.. భవిష్యత్తులో భారతదేశంలోని 11 నగరాలకు విస్తరించనుంది. ఈ ఒప్పందం వల్ల దేశవ్యాప్తంగా 3.8 లక్షల మందికిపైగా కెప్టెన్‌లకు మేలు జరుగుతుందని ర్యాపిడో తెలిపింది. హైదరాబాద్‌లోని అన్ని హెచ్‌పీసీఎల్ బంకులలో ఇంధనంపై 1.25 శాతం తగ్గింపు లభిస్తుంది. వాచ్‌పీ లూబ్రికెంట్, వాహన్ కిట్‌పై 50 శాతం తగ్గింపు ఇస్తారు. హైదరాబాద్‌లోని 300కుపైగా హెచ్‌పీసీఎల్ స్టేషన్లలో ఈ ప్రయోజనాలను పొందవచ్చు. తద్వారా వారి ఆదాయాన్ని పెంచుతుంది. ర్యాపిడో బైక్ టాక్సీ సేవలతో పాటు.. ఆహార పదార్థాలు, ఇతర వస్తువులను డెలివరీ చేయడానికి కూడా ఉపయోగపడుతుంది. ర్యాపిడో ఇప్పుడు ఫుడ్ డెలివరీ విభాగంలో కూడా సేవలను అందిస్తోంది. ఇది స్విగ్గీ , జొమాటో వంటి సంస్థలకు పోటీగా నిలుస్తోంది. దీంతో పాటు.. తెలంగాణ ప్రభుత్వం గిగ్ వర్కర్ల సంక్షేమానికి కట్టుబడి ఉందని పేర్కొన్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగానే వారికి ప్రమాద బీమా , ఆరోగ్య బీమా సౌకర్యాలను కల్పించే విధంగా పాలసీని రూపొందించాలని తెలంగాణ ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది.

# ఖమ్మంలో వేంకటేశ్వరస్వామి ఆలయం..

ఖమ్మం: జిల్లా వాసులకు తిరుమల తిరుపతి దేవస్థానం శుభవార్త తెలిపింది. జిల్లాలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి టీటీడీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దాదాపు 10 ఎకరాల స్థలంలో ఆలయాన్ని నిర్మించేందుకు టీటీడీ ఆమోదం తెలిపింది. మంత్రి తుమ్మల నాగేశ్వర రావు చేసిన ప్రతిపాదనకు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఆమోదం తెలిపారు. త్వరలోనే ఆలయ నిర్మాణానికి సంబంధించిన పనులు ప్రారంభం కానున్నాయని సమాచారం.

కలియుగ దైవం తిరుమల శ్రీవారికి రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాక దేశ, విదేశాల్లో పెద్ద సంఖ్యలో భక్తులున్నారు. నిత్యం వేల సంఖ్యలో భక్తులు తిరుమల వచ్చి శ్రీవారిని దర్శించుకుంటారు. ఇక తిరుమల తిరుపతి దేవస్థానం అధ్వర్యంలో అనేక ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలు చేపడుతున్న సంగతి తెలిసిందే. ఈక్రమంలో ఖమ్మం వాసులకు టీటీడీ శుభవార్త చెప్పింది. జిల్లాలో వెంకటేశ్వరస్వామి ఆలయం నిర్మించేందుకు టీటీడీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జిల్లాలోని ఆ ప్రాంతంలో 10



ఎకరాల స్థలంలో ఆలయాన్ని నిర్మించేందుకు టీటీడీ ఆమోదం తెలిపింది. ఆ వివరాలు..

ఖమ్మంలో వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించాలని.. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు చేసిన ప్రతిపాదనకు టీటీడీ ఆమోదం తెలిపింది. జిల్లా కేంద్రమైన ఖమ్మంలో వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించాల్సిందిగా తుమ్మల చేసిన ప్రతిపాదనకు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఆమోదం తెలిపారు. ఈక్రమంలో ఆలయ నిర్మాణం గురించి చర్చించడానికి టీటీడీ బృందం గురువారం నాడు మంత్రి క్యాంపు కార్యాలయంలో తుమ్మలతో భేటీ అయ్యింది. పలు అంశాలపై వారు చర్చించారు. అనంతరం టీటీడీ స్థపతి మరి కొందరితో కలిసి రఘునాథపాలెం మండల కేంద్రం, నగరంలోని అల్లీపురంలో ఉన్న కొన్ని స్థలాలను పరిశీలించారు. ధంసలాపురం, రఘునాథపాలెం మండల నరసింహులగుట్టలోని రెండు వేర్వేరు సర్వే నంబర్లలో ఉన్న పదెకరాల స్థలాలను పరిశీలించారు. త్వరలోనే ఆలయ నిర్మాణంపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. గత నాలుగు దశాబ్దాలుగా శ్రీభద్రాద్రి సీతారామ చంద్రస్వామి ఆశీస్సులతో.. ఖమ్మం జిల్లా అభివృద్ధి కోసం పాటు పడుతున్నాను అని చెప్పుకొచ్చారు. జిల్లాలో నిర్మాణం చేపడుతున్న సీతారామా ప్రాజెక్ట్, భక్తరామదాసు, మంచుకొండ లిఫ్ట్ ఇరిగేషన్, ఎన్టీఆర్ వరద కాల్వతో జిల్లాలోని లక్షల ఎకరాల భూములు సస్యశ్యామలం కానున్నాయని తెలిపారు. అలానే జాతీయ రహదారులతో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రగతి పథంలో పయనిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఖమ్మం సిటీలో ఐకానిక్‌గా.. భవిష్యత్తు తరాలకు గుర్తుండేలా టీటీడీ ఆధ్వర్యంలో వేంకటేశ్వర స్వామి ఆలయం నిర్మాణం చేపట్టబోతున్నట్లు వెల్లడించారు.

టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీ వేంకటేశ్వర ఆలయ నిర్మాణ ట్రస్టు(శ్రీవాణి)ద్వారా దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో3,615 ఆలయాల నిర్మాణం, పలు ఆలయాల జీర్ణోద్ధరణ కార్యక్రమాలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఈకార్యక్రమంలో భాగంగా పలు నగరాల్లో వేంకటేశ్వరస్వామి వారి ఆలయాల నిర్మాణం జరుగుతుంది. శ్రీవాణి ట్రస్టు నిధులతో వెనకబడిన వర్గాలు వారు ఉండే కాలనీలు, కొండ ప్రాంతాలు, సముద్రతీర ప్రాంతాల్లో ఆలయాలు నిర్మించారు. అలానే ఆయా ఆలయాలకు శ్రీవాణి ట్రస్ట్ నుంచి ప్రతి నెలా ధూపదీప నైవేద్యాల కోసం రూ.5 వేలు ఆర్థిక సాయం అందిస్తున్నారు. దీనిలో భాగంగానే ఖమ్మంలో వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించనున్నారు.

వార్ 2 సినిమా ట్రైలర్ తాజాగా రిలీజైంది. ఈ ఏడాది ఆగస్టు 14న రిలీజ్ కాబోతున్న ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. యష్ రాజ్ ఫిలిమ్స్ నిర్మిస్తున్న ఈ సినిమాలో జూ ఎన్టీఆర్, హృతిక్ రోషన్ హీరోలుగా నటిస్తున్నారు. కియారా అద్వానీ హీరోయిన్‌గా యాక్ట్ చేస్తుంది. తాజాగా రిలీజైన ట్రైలర్ సినిమాపై అంచనాలు పెంచేసింది. హృతిక్-ఎన్టీఆర్ మధ్య పోరాట సన్నివేశాలు గూస్‌బంప్స్ తెప్పిస్తున్నాయి.

జూ.ఎన్టీఆర్, హృతిక్ రోషన్ వార్ 2 సినిమా ట్రైలర్ తాజాగా రిలీజైంది. భారీ అంచనాల మధ్య ఈ ఏడాది ఆగస్టు 14న వార్ 2 రిలీజ్ కాబోతుంది. అయితే గతంలో వచ్చిన టీజర్‌పై చాలా విమర్శలు రావడంతో సినిమా ఎలా ఉంటుందా ఏంటా అనే అను మానులు చాలానే వచ్చాయి. ముఖ్యంగా హృతిక్ రోషన్‌కి ఎక్కువగా స్క్రీన్ స్పేస్ ఇచ్చారని.. ఎన్టీఆర్‌ని పెద్దగా చూపించలేదని తెలుగు ప్రేక్షకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే తాజాగా రిలీజైన ట్రైలర్‌తో ఆ విమర్శలకి ఫుల్ స్టాప్ పెట్టింది యష్ రాజ్ ఫిలిమ్స్.

ఈ ట్రైలర్‌లో హృతిక్ రోషన్‌కి దీటుగా ఎన్టీఆర్‌ని చూపించారు. ఇక జూ. ఎన్టీఆర్ మరోసారి సిక్స్ ప్యాక్ లుక్‌లో పవర్ ప్యాక్డ్‌గా కనిపించారు. ముఖ్యంగా యాక్షన్ సీక్వెన్సుల్లో ఎన్టీఆర్ కనిపించిన తీరు ఫ్యాన్స్‌కి ఫుల్ ఫీస్ట్ ఇచ్చేలా కనిపిస్తుంది. ఫైటర్ జెట్స్‌లో కనిపించే సీక్వెన్స్ అదిరిపోయింది. టీజర్ వచ్చినప్పుడు కియారా అద్వానీ బికినీ సీన్ హైలెట్ అయింది. ఇక ఇందులో హృతిక్-కియారా మధ్య లిప్ లాక్ కూడా చూపించారు. అలానే హృతిక్‌తో కియారా ఫైట్ సీన్ కూడా అదిరిపోయింది. ఓవరాల్‌గా ట్రైలర్ అయితే పైసా వసూల్ అనేలా ఉంది. ముఖ్యంగా ఎన్టీఆర్‌ని హృతిక్‌తో సమానంగా ట్రైలర్‌గా మ్యాచ్ చేయడం తారక్ ఫ్యాన్స్‌కి ఫుల్ బూస్ట్ ఇచ్చే విషయం. అయితే తెలుగు డైలాగ్స్ అంతగా కనెక్ట్ అయ్యేలా లేవు. ఎందుకంటే సెంటెన్స్ ఫార్మేషన్ సరిగా లేదు. ఏదో డబ్బింగ్ సినిమాలా అనిపిస్తుంది. నేను నా గుర్తింపుని వదిలేసి నీడగా మారిపోతానంటూ హృతిక్‌కి ఇందులో ఒక డైలాగ్ ఉంది. ఇలా డైలాగ్స్‌పై కొంత



# గుస్‌బంప్స్ తెప్పించే యాక్షన్ ఫీస్ట్

కాన్సంట్రేషన్ పెట్టి ఉండే బావుండేది. అయితే హిందీ డబ్బింగ్ మాత్రం బావుంది. హిందీలో కూడా ఎన్టీఆర్ స్వయంగా డబ్బింగ్ చెప్పారు. ఆగస్ట్ 14న పాన్ ఇండియా లెవల్లో రిలీజ్ కాబోతుంది. వార్ మొదటి పార్ట్‌లో టైగర్ ష్రాఫ్‌తో హృతిక్ రోషన్ తలపడ్డాడు. ఈసారి ఆ ప్లేస్‌లో ఎన్టీఆర్ నిలబడ్డారు. సౌత్ ఇండియాలో కూడా భారీ కలెక్షన్లు రాబట్టేందుకు వార్ 2కి మంచి ఛాన్సులు ఉన్నాయి. సినిమా ఎంత గొప్పగా ఉన్నా బాలీవుడ్ చిత్రాలకి ఇక్కడ పెద్దగా మార్కెట్ లేదు. దీంతో ఇక్కడి స్టార్స్‌ని కూడా అందులో పెట్టడం మంచి మార్కెటింగ్ పాయింట్. ఇప్పుడు వార్ 2లో ఎన్టీఆర్ ఉన్నారు కాబట్టి భారీ ఓపెనింగ్స్‌కి ఢోకా లేదన్నమాట.

# ఇక నన్ను నిర్మాతగానే చూస్తారు..



ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు సీక్వరించిన తర్వాత పవన్ కళ్యాణ్‌లో చాలానే మార్పులు వచ్చాయి. ముఖ్యంగా ఆల్‌రెడ్ కమిట్ అయిన చిత్రాలని వీలైనంత త్వరగా పూర్తి చేసి పాలన, రాజకీయాలు చూసుకోవాలని పవన్ అనుకుంటున్నారు. కానీ ఫ్యాన్స్ మాత్రం అప్పుడప్పుడూ అయిన యాక్టింగ్ చేయాలని కోరుకుంటున్నారు. ఇలాంటి సమయంలో మరోసారి తన మనసులో మాట బయటపెట్టారు పవన్. ఇక తనని నిర్మాతగా మాత్రమే చూసే అవకాశం ఉందని లేటెస్ట్ ఇంటర్వ్యూలో క్లారిటీ ఇచ్చారు. 'హరిహర వీరమల్లు' చిత్రంతో దాదాపు రెండేళ్ల తర్వాత ఆడియన్స్‌ని పలకరించారు పవన్ కళ్యాణ్. ఫ్యాన్స్ అయితే పవన్ స్క్రీన్ మీద కనిపించారు అది చాలు అంటూ సంబరపడిపోతున్నారు. అయితే పవన్ ఎంతగా కష్టపడినా వీఎఫ్ఎక్స్ దెబ్బేశాయని అలానే డైరెక్షన్ లోపం కొట్టొచ్చినట్లు కనిపించిందనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. అయినా కానీ నిన్న సక్సెస్ మీట్ గ్రాండ్‌గా నిర్వహించింది మూవీ టీమ్. ఇక ఈ సక్సెస్ మీట్ తర్వాత ఓ ఛానల్‌కి పవన్ ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా తన పొలిటికల్ కెరీర్, సినీ ప్రస్థానంపై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు పవన్. జాని సినిమా ఫ్లాప్ అయినా కూడా ఆ సమయంలో మీలో చాలా ప్యాషన్ ఉండేది.. అలాంటి ప్యాషన్ మళ్లీ మేము ఎప్పుడు చూడగలమని యాంకర్ అడిగారు. దీనికి పవన్ సూటిగా సమాధానమిచ్చారు.

**ఇక నిర్మాతగానే...**

"నేను ఇక స్టోరీని నెరేట్ చేయగలనని అనుకోవడం లేదు.. అందుకే నేను ప్రొడక్షన్ కంపెనీ స్టార్ట్ చేద్దామనుకుంటున్నా.. 10-15 ఏళ్లుగా అనుకుంటున్నా కానీ పెద్దగా దృష్టి పెట్టలేదు.. ఇప్పుడు నాకు అవసరం కూడా అయింది కాబట్టి ఇక నా క్రియేటివ్ ప్యాషన్, కమిట్‌మెంట్ అన్నీ నేను ప్రొడ్యూస్ చేసే సినిమాల్లో చూడొచ్చు.. పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్ సంస్థని మొదలుపెడతా.. దాని ద్వారా సినిమాకి నా కమిట్‌మెంట్ కొనసాగుతుంది" అంటూ పవన్ చెప్పారు.

ఇప్పుడు ఈ వీడియో వైరల్ అవుతోంది. ఇక మీదట సినిమాల్లో యాక్టింగ్ చేసే విషయంలో పవన్‌కి ఒక క్లారిటీ ఉందని.. ఇదే క్లారిటీ ఫ్యాన్స్‌కి కూడా ఇస్తున్నారంటూ నెటిజన్లు పోస్టులు పెడుతున్నారు. ఇటీవల ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో కూడా పవన్ ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉండటం వల్ల అంతకుముందే కమిట్ అయిన సినిమాలకి చాలా వరకూ తాను అన్యాయం చేయాల్సి వచ్చిందని.. దాని వల్ల నిర్మాతలు కూడా నష్టపోయారంటూ పవన్ అన్నారు. అందుకే చేతిలో ఉన్న మూడు సినిమాలు హరిహర వీరమల్లు, ఓజీ, ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రాలని వీలైనంత త్వరగా పూర్తి చేసి.. ఈ గొడవ వదిలించుకుందామని డిసైడ్ అయ్యా అంటూ పవన్ అన్నారు. అంటే పవన్ ఇక యాక్ట్ చేయరా అని తెగ పోస్టులు పెట్టారు. ఇప్పుడు ఆ అనుమానాలనే నిజం చేస్తూ మరోసారి యాక్టింగ్‌పై పవన్ ఇండైరెక్ట్ కామెంట్లు చేశారు. ఇక ఏం చేసినా నిర్మాతగానే తప్ప నటన ఉండదని తేల్చిచెప్పేశారు.

# వీరమల్లులో కోట శ్రీనివాసరావు.. 5 నిమిషాల సీన్‌లో..



పవన్ కళ్యాణ్ నటించిన 'హరి హర వీరమల్లు' చిత్రం విడుదల కాగా, దివంగత నటుడు కోట శ్రీనివాసరావు చివరిసారిగా ఈ సినిమాలో కనిపించడంతో ప్రేక్షకులు భావోద్వేగానికి గురవుతున్నారు. ఆయన కొల్లూరు సంస్థాన రాజుగా దాదాపు 5 నిమిషాలు కనిపించి, పవన్ కళ్యాణ్‌తో స్క్రీన్ పంచుకున్నారు. కోట చివరి సినిమా కావడంతో ఆయన సన్నివేశాలు వైరల్ అవుతున్నాయి. ఆయన మరణానంతరం కూడా ప్రేక్షకులను అలరించారని అభిమానులు గుర్తు చేసుకుంటున్నారు.

పవన్ కళ్యాణ్ నటించిన 'హరి హర వీరమల్లు' సినిమా గురువారం ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో రిలీజయింది. ఎన్నో ఏళ్లుగా ఊరిస్తూ ఊరిస్తూ వచ్చిన ఈ చిత్రం ఎట్టకేలకు థియేటర్లలోకి రావడంతో అభిమానులు ఖుషీ అవుతున్నారు. సినిమా హిట్టా ఫట్టా అనేది పట్టించుకోకుండా, ఫైనల్ గా విడుదలైనందుకు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు యాంటీ ఫ్యాన్స్ ఈ చిత్రాన్ని సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోల్ చేస్తున్నారు. డిజాస్టర్ అంటూ ట్రెండ్ చేస్తున్నారు. ఈ విషయాలన్నీ పక్కన పెడితే, సినిమాలోని ఓ అంశం మాత్రం సినీ ప్రియులను ఆకట్టుకుంటోంది.

'హరి హర వీరమల్లు' సినిమాలో దివంగత నటుడు కోట శ్రీనివాసరావు కనిపించారు. ఆయన కొల్లూరు సంస్థాన రాజు పాత్రలో నటించారు. తెరపై దాదాపు 5 నిమిషాల పాటు కనిపిస్తారు. అంతేకాదు పవన్ కళ్యాణ్‌తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకున్నారు. కోహినూర్ డైమండ్‌ని మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు దగ్గర నుంచి తీసుకొచ్చే బాధ్యతల్ని వీరమల్లుకి అప్పగించే సన్నివేశాల్లో కోటా కనిపించారు. ఆయనకి చిన్న చిన్న డైలాగ్‌లు కూడా ఉన్నాయి. ఇది చూసి ప్రేక్షకులు భావోద్వేగానికి గురవుతున్నారు. ('హరి హర వీరమల్లు 2' టైటిల్ ఇదే.. అసలు సెకండ్ పార్ట్ ఉంటుందంటారా?)

కోట శ్రీనివాసరావు చివరి సినిమాగా 'హరి హర వీరమల్లు' నిలిచిపో యింది. చివరిసారి కోటాను తెరపై చూసిన ఆడియన్స్ ఎమోషనల్ కామెంట్స్ చేస్తున్నారు. గొప్ప నటుడిని ఇండస్ట్రీ కోల్పోయిందని, ఆయన చనిపోయాక కూడా ప్రేక్షకులను అలరించారని పోస్టులు పెడుతున్నారు. విలక్షణ నటుడు కనిపించిన సన్నివేశాలను స్క్రీన్ షాట్స్ తీసి సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. ఇవి ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి.

ఐదు దశాబ్దాల పాటు ప్రేక్షకులను అలరించి, తెలుగు సినీ చరిత్రలో తనదైన ముద్ర వేసిన కోట శ్రీనివాసరావు(83) ఇటీవల కన్నుమూసిన విషయం తెలిసిందే. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధ పడ్డ ఆయన.. జులై 13న తుదిశ్వాస విడిచారు. సినీ ప్రముఖులు, అభిమానులు ఆయనకు నివాళులు అర్పించారు. ప్రధాని నరేంద్ర మోదీ సైతం కోట మరణంపై స్పందిస్తూ, సోషల్ మీడియా వేదికగా సంతాపం వ్యక్తం చేసారు.

1978లో 'ప్రాణం ఖరీదు' సినిమాతో చిరంజీవితో పాటుగా వెండి తెరకు పరిచయమైన కోట శ్రీనివాసరావు.. విలక్షణమైన నటనతో, విభిన్నమైన పాత్రలతో సినీ అభిమానులను అలరించారు. దాదాపు 750కి పైగా చిత్రాలలో నటించారు. ఎటువంటి పాత్ర అయినా అవలీలగా పరకాయ ప్రవేశం చేసి, వర్సటైల్ యాక్టర్ అనే పదానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు. తన విలనీతో భయపెట్టినా, కామెడీతో కడుపుబ్బా నవ్వించినా, సెంటిమెంట్ తో కంటతడి పెట్టించినా అది 'కోటా'కే చెల్లింది. వయోభారంతో, ఆరోగ్య సమస్యలతో చివరి రోజుల్లో సినిమాలకు దూరంగా ఉంటున్న ఆయన.. ఇప్పుడు చివరగా 'హరి హర వీరమల్లు' సినిమాలో కనిపించారు. కోట శ్రీనివాసరావు భౌతికంగా లేకపోయినా, ఆయన తన సినిమాలతో ఎప్పటికీ తెలుగు సినీ అభిమానుల గుండెల్లో నిలిచిపోతారు.

# హిట్టు కొట్టాకే రమ్మని మా అమ్మ వార్నింగ్



పవన్ కళ్యాణ్ నటించిన 'హరి హర వీరమల్లు' చిత్రం థియేటర్లలో విడుదలైంది. చిత్ర బృందం హైదరాబాద్‌లో సక్సెస్ మీట్ నిర్వహించి ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపింది. సినిమా ముగింపు అద్భుతంగా ఉందని, పార్ట్-2 కోసం ఎదురు చూస్తున్నామని చాలామంది ఫోన్ చేసి ప్రశంసించారని జ్యోతికృష్ణ అన్నారు. పవన్ కళ్యాణ్ 18 నిమిషాల ఫైట్ సీక్వెన్స్ కంపోజ్ చేశారని, కీరవాణి అద్భుతమైన నేపథ్య సంగీతం అందించారని కొనియాడారు. సినిమాపై కొందరు నెగిటివ్ ప్రచారం చేస్తున్నారని ఏఎం రత్నం అన్నారు.

పవన్ కళ్యాణ్ నటించిన ' హరి హర వీరమల్లు ' చిత్రం భారీ అంచనాల నడుమ థియేటర్లలో అడుగుపెట్టింది. జూలై 23 రాత్రి నుంచే ప్రీమియర్ షోలు పడ్డాయి. గురువారం ఐదు ప్రధాన భారతీయ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ నేపథ్యంలో సాయంత్రం చిత్ర బృందం హైదరాబాద్ లో సక్సెస్ మీట్ నిర్వహించి, ఆడియన్స్ కు కృతజ్ఞతలు తెలియజేసారు. దీనికి పవన్ కళ్యాణ్, నిధి అగర్వాల్, జ్యోతి కృష్ణ, ఏఎం రత్నం తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా జ్యోతికృష్ణ మాట్లాడుతూ, "థియేటర్లలో ప్రేక్షకుల స్పందన చూసి చాలా సంతోషం కలిగింది. సినిమాని ముగించిన తీరు అద్భుతంగా ఉందని, పార్ట్-2 చూడాలనే ఆసక్తి కలుగుతోందని చాలామంది ఫోన్ చేసి ప్రశంసించారు. చిన్న చిన్న పిల్లలు కూడా సినిమాలో పులి, తోడేలు సీన్స్ చూసి ఎంజాయ్ చేస్తున్నారు. ఇది ఫ్యామిలీతో కలిసి చూడాల్సిన సినిమా. పవన్ కళ్యాణ్ సినిమా అంటేనే అందరూ కలిసి చూస్తారు. వీకెండ్ లో ఇలాంటి మంచి సినిమా అందించినందుకు గర్వంగా ఉంది. ఈ సినిమాకి ఇద్దరు హీరోలు.. ఒకరు పవన్, ఇంకొకరు కీరవాణి" అని అన్నారు. (హరి హర వీరమల్లు సినిమా చూస్తే కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌లో 10 మార్కులు..!)

"సినిమాలో పవన్ కళ్యాణ్ ఒక 18 నిమిషాల ఫైట్ సీక్వెన్స్ ను కంపోజ్ చేశారు. డైలాగ్స్ లేకుండా దాదాపు 30 నిమిషాల ఎపిసోడ్ రన్ అవుతుంది. విజువల్ గా కథ చెప్పడం చాలా టఫ్ ఛాలెంజ్. ఆ ఎపిసోడ్ కి బ్యాగ్రౌండ్ స్కోర్ చేయడానికి కీరవాణికి 12 రోజుల టైం పట్టింది. 5 ఏళ్లు ఒక ఫ్యామిలీగా మాతో కలిసి పని చేసిన టీం అందరికీ థ్యాంక్స్. నిధి అగర్వాల్ ఐదేళ్లు వెయిట్ చేసి ఈ సినిమాతో సక్సెస్ కొట్టింది. అలాగే మా డైరెక్షన్ డిపార్ట్ మెంట్ సపోర్ట్ ను మర్చిపోలేను"

"మా నాన్నగారు ఫస్ట్ చేసిన మూడు సినిమాలు యవరేజ్. పెద్దగా ఆడలేదు. 'కర్తవ్యం' సినిమాతో ఛాలెంజ్ చేసి హిట్ కొట్టారు. ఫస్ట్ హిట్ కొట్టినప్పుడు ఆయన ఫేస్ లో సంతోషంతో ఒక బ్రైట్నెస్ చూశాను. దాని తర్వాత చాలా హిట్స్ ఇచ్చారు కానీ, ఆ ఫేస్ ఆ స్మైల్ హ్యాపీనెస్ ఇంకా ఏ సినిమాలో చూడలేదు. హరి హర వీరమల్లు ఫస్ట్ షో పడిన తర్వాత ఆయన ఫేస్ లో మళ్ళీ ఆ హ్యాపీనెస్ చూశాను. యూట్యూబ్ లో ఆ వీడియోని నేను పదేపదే చూసుకున్నాను. ఇది ఆయనకు అంతటి డ్రీం ప్రాజెక్ట్"

"ఈ సినీ ప్రయాణంలో నా భార్య, మా అమ్మ ఇచ్చిన సపోర్ట్ ని ఎప్పటికీ మరచిపోలేను. సినిమా రెండుసార్లు వాయిదా పడిన తర్వాత, మూవీ రిలీజై హిట్టు కొట్టిన తర్వాతే ఇంటికి రమ్మని మా అమ్మ వార్నింగ్ ఇచ్చారు. ఇప్పుడు ధైర్యంగా ఇంటికి వెళ్లొచ్చు. నాకు ఇంత గొప్ప అవకాశాన్ని ఇచ్చిన పవన్ కళ్యాణ్ కి మనస్ఫూర్తిగా థ్యాంక్స్ చెబుతున్నాను" అని జ్యోతికృష్ణ అన్నారు. కొందరు కావాలనే ఈ సినిమాపై నెగిటివ్ ప్రచారం చేస్తున్నారని, అవి ఎవరూ పట్టించుకోవడం లేదని ఏఎం రత్నం పేర్కొన్నారు.

# నిన్న థియేటర్‌లో, ఈరోజు ఓటీటీలో..

అధర్వ మురళి నటించిన 'డీఎన్ఏ' చిత్రం తెలుగులో 'మై బేబీ'గా విడుదలైంది. అయితే, థియేటర్లకు ప్రేక్షకులు రావడం తగ్గిపోయిందనే చర్చ జరుగుతున్న వేళ, ఈ సినిమా విడుదలైన 24 గంటల్లోనే జియో హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ కానుండటం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇది థియేటర్ల కలెక్షన్లపై ప్రభావం చూపుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

థియేటర్లకు వచ్చే జనాల సంఖ్య రోజు రోజుకూ తగ్గిపోతోందని గత కొన్ని నెలలుగా సినీ ఇండస్ట్రీలో పెద్ద ఎత్తున చర్చలు జరుగుతున్నాయి. దీనికి ఓటీటీలు ఒక కారణమనే అభిప్రాయానికి వచ్చేశారు. కొత్త సినిమాలన్నీ నెల తిరక్కుండానే డిజిటల్ ఫ్లాట్ ఫామ్స్ లోకి వస్తుండటంతో, ప్రేక్షకులు సినిమా హాళ్లకు రావడం లేదని, ఇది కలెక్షన్స్ పై ప్రభావం చూపిస్తోందనే తీర్మానానికి వచ్చేశారు. థియేట్రికల్ రిలీజుకి, ఓటీటీ స్ట్రీమింగ్ కి మధ్య గ్యాప్ ఉండాలనే చర్చలు జరుగుతున్న తరుణంలో ఇప్పుడు ఒక సినిమా 24 గంటల్లోనే డిజిటల్ వేదికలోకి రావడానికి రెడీ అయింది.

'గద్దలకొండ గణేష్' ఫేమ్ అధర్వ మురళి, నిమిషా సజయన్ జంటగా నటించిన తమిళ చిత్రం 'డీఎన్ఏ'. చైల్డ్ ట్రాఫికింగ్ బ్యాక్ డ్రాప్ లో నెల్సన్ వెంకటేష్ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కింది. దీనికి ఐదుగురు మ్యూజిక్ డైరెక్టర్లు వర్క్ చేసారు. గిబ్రాన్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందించారు. తమిళనాట ఈ క్రైమ్ థ్రిల్లర్ మంచి విజయం సాధించింది. ఈ చిత్రం 'మై బేబీ' పేరుతో ఈరోజు (జూలై 18) తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇక్కడి దాకా అంతా బాగానే ఉంది కానీ, ఇవాళ శుక్రవారం థియేటర్లలోకి వచ్చిన ఈ చిత్రం శనివారం ఓటీటీలోకి వస్తుండటం అందర్నీ ఆశ్చర్యపరుస్తోంది. చిత్రాన్ని జులై 19వ తేదీ నుంచి జియో హాట్‌స్టార్ ఓటీటీలో స్ట్రీమింగ్ చేయనున్నట్లు ప్రకటించారు. తెలుగు, తమిళంతో సహా మొత్తం ఐదు భాషల్లో అందుబాటులో ఉంటుందని తెలిపారు. అంటే థియేటర్‌లో విడుదలైన 24 గంటల్లోనే డిజిటల్ వేదికలోకి వస్తోందన్నమాట. డిజిటల్ డీల్ ప్రకారం తమిళ వెర్షన్



టైం ప్రకారమే వచ్చేస్తోంది. కాకపోతే తెలుగు డబ్బింగ్ రైట్స్ తీసుకున్న సురేష్ కొండేటి టైంకి సినిమాని రిలీజ్ చేసుకోలేదు. ఇప్పుడు హడావిడిగా ఓటీటీ స్ట్రీమింగ్ కి ఒక్క రోజు ముందు హడావిడిగా దొరికినన్ని థియేటర్లలో తెలుగు వెర్షన్ ను రిలీజ్ చేసారు.

గతంలో త్రిష 'ఐడెంటిటీ', శివరాజ్ కుమార్ 'వేదా' సినిమాలు కూడా ఇలానే థియేటర్లలో రిలీజైన కొన్ని గంటల వ్యవధిలో ఓటీటీలోకి వచ్చాయి. దీంతో థియేటర్లలో ఈ సినిమాలను ఎవరూ పట్టించుకోలేదు. ఇప్పుడు మరికొన్ని గంటల్లో ఓటీటీలోకి వస్తుందని తెలిసి 'మై బేబీ' సినిమాని థియేటర్లలో చూడటానికి జనాలు ఏ మేరకు ఇంట్రెస్ట్ చూపిస్తారనేది ప్రశ్నార్థంగా మారింది. అందుకే నిర్మాతలు డబ్బింగ్ రైట్స్ తీసుకొని థియేటర్లలో రిలీజ్ చేసుకోవాలనుకున్నప్పుడు, ఓటీటీ డీల్స్ ను దృష్టిలో పెట్టుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మరి ఈ విషయంలో మేకర్స్ ఇప్పటి నుంచైనా జాగ్రత్తగా ఉంటారేమో చూడాలి.

# ఆనందంతో గంతులేసిన వీరమల్లు నటి

పవన్ కళ్యాణ్, నిధి అగర్వాల్ హీరో హీరోయిన్లుగా నటించిన తాజా చిత్రం 'హరి హర వీరమల్లు'. ఏఎం రత్నం నిర్మాణంలో క్రిష్ జాగర్లమూడి, జ్యోతి కృష్ణ దర్శకత్వంలో ఈ ఫిక్షనల్ పీరియాడిక్ మూవీ తెరకెక్కింది. పవన్ స్టార్ ఫ్యాన్స్ ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న ఈ పాన్ ఇండియా సినిమా.. ఫైనల్ గా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. రిలీజైన రోజే చిత్ర బృందం సక్సెస్ మీట్ నిర్వహించింది. సినిమాలో నటించిన నివితా మనోజ్ ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ తో ఫోటో దిగాలని ఆశపడింది. స్టేజ్ మీదకు వచ్చి తన అభిమాన హీరో పక్కన నిలబడి మురిసిపోయింది. ఆనందంతో గెంతులేసింది. ఆమె చర్యలతో పవన్ కూడా సిగ్గు పడిపోయారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.



# హార్డ్ వర్క్..

కన్నడ హీరో రిషభ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'కాంతార: చాప్టర్-1'. 2022లో బాక్సాఫీస్ దగ్గర బ్లాక్ బస్టర్ గా నిలిచిన 'కాంతార' చిత్రానికి ప్రీక్వెల్ ఇది. హొంబలే ఫిల్మ్స్ బ్యానర్ లో భారీ బడ్జెట్ తో తీస్తున్నారు. ఇప్పటికే రిలీజైన ఫస్ట్ లుక్ ఆడియన్స్ ను విపరీతంగా ఆకట్టుకుంది. తాజాగా షూటింగ్ కంప్లీట్ అయిందనే విషయాన్ని తెలియజేస్తూ చిత్ర బృందం మేకింగ్ వీడియోని రిలీజ్ చేశారు. కాంతార వరల్డ్ ను ఎలా క్రియేట్ చేశారనేది ఈ వీడియోలో చూపించారు. మూడేళ్లు కష్టపడి, 250 రోజులు షూటింగ్ చేసి ఈ సినిమాని రూపొందించినట్లు తెలిపారు. ఇది కేవలం ఒక సినిమా కాదని, ఇదొక పవర్ అని పేర్కొన్నారు. అక్టోబర్ 2వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మరోసారి క్లారిటీ ఇచ్చారు.

